306

ఆంధ్రపత్రి

సచిత్ర వారప



4 అ

6-7-

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKL



పల్లవశిల్పం, మహాబలిపురం.

ఫొటో: టి. రామమూర్తి—మద్రాసు.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

సంపుటము 48
సంచిక 44
6-7-55


Founder : K. NAGESWARA RAO

మన్మథ ఆషాఢ బహుళ ప్రథమ బుధవారం



"భ్రమా భ్రమర భ్రమణ భ్రమరణ
భ్రమాకరణ బ్రహ్మైకవన్య కమలవ్రాతాలు."

ఫోటో : వి. జి. కృష్ణమూర్తి—గొల్లప్రోలు



చర్మవ్యాధుల కన్నిటికీ

"సైబాల్"

చర్మవ్యాధుల న్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విరుక్రిమి నాశనిగా త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. పుండ్లు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, సెగగడ్డలు, తామర, కాళ్ళపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.



బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబి గ్రైప్"

తయారీదార్లు

ది సౌత్ ఇండియన్ మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు:

సీతారాము జనరల్ స్టోర్సు వర్క్సు

విజయవాడ, సికింద్రాబాద్.


బరంపురం (గంజాం), బొంబాయి.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

వైజయంతీమాల.

రావల్‌గాన్






గ్లూకోజు, మంచిపాలు, చక్కెర వీటితో తయారై, చేతితో తాకబడక, యంత్రంతో ప్యాకింగ్ కాబడినవి. "రావల్‌గాన్" మిఠాయిలూ, టాఫీలూ గత పది సంవత్సరములుగా ప్రసిద్ధి చెందినవి.

ఉచిత బహుమతుల కేటలాగ్ కోసం వ్రాయండి.

నేమిచంద్ పారసమల్ & కో.,

128-ఏ, నైనియప్ప నాయక్ వీధి, మద్రాసు-3.


రొమ్ము దగ్గు



పెప్స్ పీల్చండి.

PEPS

క్రిమి సంహారకరమైన గొంతు, రొమ్ము బిళ్లలు.



మద్రాసు సోల్ ఏజెంట్లు: దాదా & కంపెనీ.
పార్కుటౌన్ మద్రాసు-3.

ఏకాంకిక:

ధ్రువతార

గుడిమెళ్ల బాలా త్రిపురసుందరి

తెలుగు భాషాసమితివారిచే బహుమతి పొందిన కుమారి గుడిమెళ్ల బాలా త్రిపురసుందరిగారి ఆరు ఏకాంకికలను మా పాఠకులకు అందిస్తున్నాము.

రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ జూన్ 26 వ తేదీని హైదరాబాద్‌లో బహుమతి ప్రదానోత్సవం జరిపారు.

కుమారి బాలా త్రిపురసుందరిగారు 1952 లో "గృహవిజ్ఞాన శాస్త్రము"నకు కూడా తెలుగు భాషాసమితివారి బహుమతి పొందారు.

బహుమతి పొందిన ఆరు ఏకాంకికలు 'ధ్రువతార', 'సినిమా పిచ్చి', 'ఝాన్సీ లక్ష్మి', 'వాడు వర్ధిల్లుంతరా', 'లవంగి', 'మంచె నీడలు'. వీనిని వరుసగా వారపత్రికలో ప్రచురించగలము. వీనిలో 'ధ్రువతార' అను ఏకాంకిక 1954 జూన్ 16 వ తేదీ ఆంధ్ర వారపత్రికలో ప్రచురించబడింది.

—సంపాదకుడు.'

[వెరెష్‌ఛగిన్ రష్యను అభ్యుదయచిత్రకళావేత్త. ఈయనచిత్రాలు మనోజ్ఞంగా ఉండి హృదయానికి హత్తుకొనిపోతాయి. "బ్రిటిష్ ఇండియాలో ఫిరంగులతో కాల్చి చంపడం" అనే చిత్తరువు ఆయన గీసిన బొమ్మలలో పేరెన్నికగన్నది. అందు బ్రిటిష్ వారు 1856 లో భారతదేశభక్తులను రూపుమాపడం చిత్రితమైనది. విప్లవకారుల రెక్కలు విరిచి ఫిరంగులకు కట్టారు. రెప్పపాటు కాలంలో తుపాకులు పేలుతాయి. వారల పవిత్ర కళేబరాలు తుత్తునియలై పంచభూతాల్లో కలిసిపోతాయి. "సిపాయిల తిరుగుబాటు కాలంలోనే కాకుండా వేల లెక్కలో ఫిరంగులతో సిపాయిలను కాల్చి చంపే పద్ధతి ఇంతకు అనేక సంవత్సరాల పూర్వం, తదనంతరం బ్రిటిషువారు అమలు జరిపారని" వెరెష్‌ఛగిన్ అన్నారు.

ఇటీవల 1942.45 లో నేతాజీ బ్రిటిషు సామ్రాజ్య విషవృక్షాన్ని కూకటివేళ్లతో పెకలించివేయడానికి దూరప్రాచ్యంలో లేవదీసిన తుపానును గూర్చి, జనరల్ క్లిమ్ సైన్యాలు ఇంఫల్ ప్రాంతంలోను, తదితర చోట్ల గుప్తంగాచేసిన అత్యాచారాలను గూర్చి చదివాను. ఈ వార్తల్ని, వెరెష్ ఛగిన్ పలుకుల్ని మననం చేసుకుంటూ పడుకున్నా. ఆ రాత్రి నాకు కలవచ్చింది. స్వప్నంలో పుతలీబాయి కనుపించింది. ఆమె లోకానికి చాటమన్న 'కన్నీటి కబురే' ధ్రువతారలో పతిత్ప లోకంముందు పెట్టినాను]

పాత్రలు

పుతలీబాయి—వృద్ధురాలు.

చిన్నగంగు—పది సంవత్సరముల బాలుడు.

పెదగంగు—సుమారు ఇరువదియైదేండ్లవాడు. దృఢకాయుడు. కాకి యూనిఫారములో ఉంటాడు. మొలలో 'బాయినెటు' వ్రేలాడబడి వుంటుంది. అజాద్ హిందు ఫౌజునుండి శెలవుగైకొని ఇంటికి వచ్చి నాల్గు దినములైంది.

డేవిడ్ డయ్యరు—బ్రిటిష్ సార్జంటు. బట్టతల మనిషి. అతనిది గ్రద్ద ముక్కులాంటి వంకర ముక్కు.

యాసిన్‌ఖా—జమాదారు.

డోనాల్డు—బ్రిటిష్ సోల్జరు.

రాంసింగ్—సిపాయి.

(సమయము—1945వ సంవత్సరమున వేసవియందు ఒకనాటి నడిరేయి. నీలాల నింగిలో ఒక్క చుక్కైనా పొడవలేదు. పుడమిపై దట్టంగా మంచుతెరలు వ్రేలాడుతున్నాయి. నిశాకన్య నీలిపావడ నిగనిగ చదలంటుతున్నాయి.

దృశ్యము—మణిపూరు కొండకోనల నడుమ పర్ణశాల. దూరమున మణిపూరునది ఎరను తరుముతున్న నల్లత్రాచులా దుముకుచు గలగలలాడుచు పరుగెడుతోంది.

కుటీరంలో వృద్ధ స్త్రీ ఆతురతతో ఇటునటు తిరుగుతుంటుంది. చినగంగు కిటికీవద్ద కూర్చొని రెప్పవాల్చక అవతలకు చూస్తూ ఉంటాడు. ఇద్దరి జీర్ణవస్త్రాలలోంచి దైన్యం తొంగిచూస్తూ వుంటుంది.)

చినగంగు: అమ్మా! ఘడియ ఘడియకు మంచు దట్టమైపోతోంది. జాబిల్లి మరుగు పడ్డాడు. అన్నయ్యా ఎల్లా ఇల్లు చేరుకుంటాడో—

పుతలీ: కొంచెం మెల్లిగా మాటాడు. చదుకంలో ఎవరైనా తిరుగుతున్నట్లు కన్పిస్తోందా?

చిన: లేదు. కిటికి ఎదురుగా నున్న లేగి చెట్టే సరిగా అగుపడుటలేదు. కారుచీకటి

కమ్మేసింది. అబ్బా! ఈదురుగాలంటూ గాలి.

పు: తుపాను వస్తుందేమో!

చిన: కిటికీలో లాంతరు పెట్టనా?

పు: ఎందుకు?

చిన: వెలుగు లేకపోతే అన్నయ్య దారి తప్పుతాడేమో.

పు: వద్దు. ఈల వినిపించేవరకు ఏమీ చేయవద్దు——

చిన: సరేలే. (కొంచెంసేపు ఊరుకొని). అమ్మా! అన్నయ్య ఇంతవరకు నాకు యుద్ధాన్నిగురించి ఏమీ చెప్పలేదు. నే నడిగితే ఏమీ మాట్లాడకుండా నవ్వి వూరుకుంటాడు. నువ్వడిగితే పూస గుచ్చినట్లు అంతా చెపుతాడు.

పు: అన్నయ్య దూరప్రయాణం చేసి వచ్చాడు. వాణ్ణి నువ్వు వేధించకు.

చిన: అది కాదమ్మా! అన్నయ్య బోలె డన్ని ఊళ్ళు చూశాడట. రంగం చూశాట్ట-సింగపూరు చూశాట్ట, మలయా చూశాట్ట, ఇంకా ఏమేమో చూశాట్ట. నాకు వాటిని గురించి వినాలని ఎంతో కుతూహలంగా వుంది. (తల్లి కొంగుపట్టుకొని) అన్నయ్యతో నువ్వు చెప్పమనవూ?

పు: అలాగేలే.

చిన: అయితే నా చేతిలో చేయి వేయి మరి.

పు: అల్లాగే అన్నానా.

చిన: అమ్మోయి! అన్నయ్యంతవాణ్ణి అయిన తర్వాత నేకూడా పటాలంలో చేరి పోతా. ఏం?

పు: అలాగే.

చిన: (ఉలిక్కిపడి) ఏదో శబ్దం అయినట్లుందే.

పు: (పరికించి) ఏం లేదు. వరుగుడు తోటలో గాలి పోసుకొంటే రొద కల్గుతోంది. అంతే.

చిన: అమ్మ నా కివ్వాళ కొంచెం భయంగా వుంది.

పు: భయమెందుకు, చిట్టి తండ్రి!

చిన: నాన్నగారు ఎక్కడికో ఊరు వెళ్లారన్నావు చూశావూ! ఆ రోజూ యిల్లాగే భయంవేసింది. (ఆతృతతో) నాన్నగారు తిరిగి ఎప్పుడు వస్తారమ్మా?

పు: (కంటతడిపెట్టి) వస్తారులే నీకెందుకు భయం?

చిన: ఈ ప్రొద్దు పాలకి వెళ్ళివస్తూ చూచానమ్మా. పదిమంది ఎఱ్ఱ టోపీలవాళ్లు. వెధవ బుంగమీసాలూవాళ్లూను. అందులో ఒకడిది బట్టతల. టోపీతీసి చేతిలో పట్టుకొన్నాడు. ఉడుతలుపీకిన తాటిటెంకలా ఉంది వాడి తొగరుజుట్టు. (చేతులుచాస్తూ) వాళ్ల దగ్గరేం - ఇంతింత పెద్ద పెద్ద టుపాకులున్నాయి. పెద్దపెద్ద కత్తులుకూడా ఉన్నాయి. దుబేగారి దయ్యాలమేడవుంది చూశావూ! ఊరిబయట - అందులో ఉన్నారమ్మ వీళ్లు. కసాయివాడు రోజూ ఇల్లా వెడుతూవుంటాడు చూశావూ - వాడంత భీకరంగా వున్నారు వీళ్లు. వనలతగారి బుల్లెబ్బాయి వీళ్లనిచూచి కౌరుకౌరుమని ఏడ్చాడు. ఊళ్లోఉన్న పిల్లలందర్ని పట్టుకొని ఊపిరాడకుండా సంచుల్లోవేసి బిగించి తీసుకుపోతారట వీళ్లు.

పు: ఎవరు చెప్పా రీమాట?

చిన: సాయీ -

పు: అవన్నీ ఉత్తుత్తిమాటలు.

చి: కాదమ్మా! వాళ్ల వీపులమీద సంచులున్నాయి. ఆ సంచుల్ని చూస్తే నాగుండెల్లో రాయిపడ్డట్టయింది.

పుత: ఓయి భగవంతుడా! జడుసుకో లేదు కదా వీడు. (కొంచెం ఉప్పు తెచ్చి దిగతుడిచి పారవేస్తుంది) ఈశ్వరుడా! ఈ పసికూనలు నీసొత్తు.

చిన: నేను మధ్యాహ్నం ఏంచేశానో తెలుసా?

పు: (కుతూహలంతో) ఏంచేశావు?

చిన: వాళ్ల మేడచేరువ నేఉన్న చెట్టెక్కి చూశాను.

పు: తెగులబడినట్లే ఉంది ప్రయోజకత్వం.

చిన: (దీనంగా) అమ్మా! నే చేసింది తప్పువనా?

పు: (లేని సంతోషము తెచ్చుకొని) కాదులే. వాళ్ళేంచేశారు?

చిన: రెండు కోలీలుగా బయలుదేరారు. సిల్చారుదారినిబట్టి ఒకముఠా పోయింది. వంతూ మార్గాన్ని పట్టి రెండో కోలీ పోయింది.

[దూరాన్నుండి ఈలపాట మెల్లగా వినిపిస్తుంది]

చిన: (ఒక్క గంతువేసి) అదిగో - సంగీతం -

పు: ఊ. (చినగంగు లాంతరుఎత్తి పట్టుకొని కిటికీవద్ద నిలబడతాడు.)

పు: అబ్బాయీ! లాంతరు ఆర్పేయి. దీనివెలుగులో గుమ్మందగ్గర నిలబడ్డవాడు చుట్టుపట్ల ఆమడదూరంవరకూ పుచ్చపువ్వులా కన్పిస్తాడు.

[చినగంగు లాంతరు ఆర్పేస్తాడు. తలుపు తెరచుకొని పెదగంగు ప్రవేశిస్తాడు. పుతలీ ఆముదందీపం వెలిగిస్తుంది. పెదగంగు బాగా అలసివుంటాడు. వళ్లంతా తడిసిఉంటుంది.]

పు: నాయనా! మంచులో తడిసి ముద్దయినట్లున్నావు. కోటు విప్పేయి.

పెదగంగు: (కోటు విప్పుతూ) ఈ దరిద్రగొట్టు ఎఱ్ఱటోపీవాళ్లను తప్పించుకొని వచ్చేసరికి తలప్రాణం తోకకు వచ్చింది.

పు: రేచుల్లా దాపరించారు వీళ్లు.

చిన: కొరివిదయ్యాల్లా ఉన్నారమ్మ వీళ్లు.

పెద: ప్రేమీపహాడ్ కొండకావల చిట్టడవి వుంది చూశావూ. ఇక్కడికి పదికోసులుంది. అక్కడున్నారు నా జతి... (చినగంగును చూచి ఏదియో జ్ఞప్తికి తెచ్చుకొన్నవాడిలాగ) గంగూ! అమ్మ లేవలేదు వెళ్లి కాస్త టీ కాచిపెడుదూ! గొంతు వాడిపోయింది. (వెళ్లలేక వెళ్లలేక చినగంగు కాళ్ళీడ్చుకొంటూ వంటింట్లోకి వెళతాడు).

పెద: (నిట్టూర్చి) అమ్మా! తమ్ముడి కోట్లో నువ్వుగింజ నానదు.

పు: కాని వాడు నీకథ తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నాడు సుమా! మీ యుద్ధాన్నిగురించి ఎవరేమి అనుకుంటున్నా చెవులప్పగించి వింటాడు. వాడి కున్న ఆసక్తి నాకూ ఉంది - అయితే అలసిసొలసి వస్తే, విసికించడమెందుకని నిన్ను అడగకుండా మానుకొంటున్నా——

పెద: దానికేమమ్మా - జర్మనీ, ఇటలీ, క్రోషియా, జపాను, మంచూకో, నాన్కింగు, బర్మా, ఫిలిప్పైనుదీవుల విపణి వీధుల్లో ఆజాదు హిందు సర్కారువారి రూణీక్యములు చలామణి అవుతున్నాయి. ఈ ప్రభుత్వమును నెలకొల్పిన జ్ఞానజ్యోతి నేతాజీ. ఆ మహానుభావుణ్ణి గూర్చి ఎంతని వర్ణించను?

పు: ఔను. ఆయన ఆదర్శజీవితాన్నుండి భరతఖండం దేశప్రేమను పిండుకొంటోంది -

పెద: ఆయన మాతృదేశాన్ని విశ్వపటమున కెక్కించిన తేజోరాశి. మూర్తీభవించిన స్వాతంత్ర్య దేవత. ఆయన గంభీరోపన్యాసం రాళ్లకు చైతన్యం కల్గిస్తుంది. చేతన జగత్తును తాన్సేను మధురగేయంలాగ మంత్రముగ్ధను గా చేస్తుంది. ఆనందపు వూవుటూయలలో పెట్టి జోల పాడిస్తుంది. ఆయన వాగ్ధాటిలో ఉన్న తాదర్శము మేళవించింది. బంగారానికి తావి అబ్బినట్లయింది. అంచేత ఆయన ప్రతి భారతీయుని హృదయసామ్రాజ్యాన్ని పాదాక్రాంతం చేసుకొన్నాడు.

పు: ఆయన గొప్ప కర్మయోగి. ఆయన చెప్పినముక్క లేవైనా నాల్గు చెప్పుదూ - విని సంతోషిస్తా.

పెద: అమ్మా నిరుడు ఫిబ్రవరి నెలలో నాల్గవరోజున హిందూ దేశంనుండి తెల్లరక్కసులను తోలివేయడానికి బయలుదేరాం. అదో పెద్దపర్వదినం మాకు. ఆరోజున నేతాజీ మాకిచ్చిన తీపులూరించు సందేశాన్ని చదువుతా విను. (జేబులోనుంచి కాగితాన్ని తీసి, ఎంతో ప్రేమతో మడతవిప్పి చదువుట ప్రారంభిస్తాడు. పుతలీ ప్రమిదలోని

శక్తిని ఎగసందోసి తదేక ధ్యానంతో కొడుకు చదివేదానిని వింటుంది.)

* "అక్కడ - అదిగో అక్కడ - నది కావల, అడవుల కావల, ఆ కొండల కావల, దైవదత్తమైన మన దేశం ఉంది. అక్కడ మనం పుట్టాం. ఆ దేశానికి మనము తిరిగి తరలి వెళ్తున్నాం.

* 1944 వ సంవత్సరము ఫిబ్రవరి నెల నాల్గవ తేదీని నేతాజీ అజాదు హింద్‌ఫౌజు సైనికులకీ క్రింది సందేశ మిచ్చాడు—

"వినండి, భారతమాత పిలుస్తోంది. హిందూ దేశపు రాజధాని ఢిల్లీ స్వాగత మిస్తోంది. 38 కోట్ల స్వదేశీయులు మనల్ని రమ్మంటున్నారు. బంధువులు బంధువులను పిలుస్తున్నారు."

"లెండి, కాలయాపనకు వీలు లేదు. అస్త్రాలను ధరించండి. అదిగో - పురోగాములు నిర్మించిన రాజబాట మీ ముందున్నది. ఆ మార్గముపై మన సైన్యాలు పోవాలి. శత్రు వ్యూహమును బద్దలుచేసుకొని మనం దారిచేసుకొందాం. భగవదిచ్ఛ యైనచో వీరస్వర్గ మలంకరిద్దాం."

"తుట్టతుది అడుగులో యీ మురిపెపు బాటను ముద్దిడుకుందాం. ఈ బాట మన సేనా వాహినిని ఢిల్లీకి గొనిపోతుంది. ఢిల్లీ బాటే స్వాతంత్ర్యానికి మార్గం. చలో ఢిల్లీ.

(కాగితాన్ని భద్రంగా మడిచి జేబులో పెట్టుకొంటాడు.)

పు: వహావ్వ - ఏం మాటలవి? మీగడ తొరకలు వజ్రపు తునకలు.

పెద. అమ్మోయ్! ఆ దినం నా కెంత ఆనందం కల్గిందో చెప్పనా? సంతోషంతో

"There-there in the distance-beyond the river, beyond those jungles beyond those hills-lies the promised land, the soil from which we sprang - the land to which we will now return-"

"Hark - India is calling - India's metropolis Delhi is calling. 380 millions of our countrymen are calling. Blood is calling to blood."

"Get up; we have no time to lose. Take up your arms. There in front of you is the road that our pioneers have built. We shall march along that road. We shall carve our way through the enemy's ranks or if God wills we shall die a martyr's death".

"And in our last step we shall kiss the road that will bring our army to Delhi. The road to Delhi is the road to Freedom. Chalo Delhi."

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపే వారు ఈ క్రింది అంశాలను గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్ పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతో నే చేర్చిపంపాలి.

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి.

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి. నెగటివ్‌లు స్వీకరించబడవు.

చిత్రాలు ఇండియన్ ఇంకులో వేసిపంపాలి. రంగుల చిత్రాలు స్వీకరించబడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం.

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం. ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది.

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము.

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎవ్విధమైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన.

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము.

—సంపాదకుడు

ఒళ్ళు పట్టలేక పోయాను. నా నరములలో తేనె కాల్వలు కుప్పతెప్పలై ప్రవహించినట్లు తోచింది. అరకాను పర్వత శిఖరాలు వాని కావల ఛిండ్విన్ నది, వాని ఒడిలో నల్లకలువలు వెదజిమ్మబడినట్లు పడియున్న, దుర్గమమైన అడవులు కళ్ళకు కట్టినట్లు గోచరించాయి. హనుమంతుడు లంకను ఒక్క దూకులో లంఘించినట్లు ఒక్క గంతులో వానిని అన్నింటిని దాటి మన పుణ్యభూమి పొలిమేరలో వాలగలననిపించింది.

పు: నేతాజీ తలపెట్టినకార్యం నిర్విఘ్నంగా సాగాలని వెయ్యిదేవుళ్ళకి మొక్కుతున్నా! అది సాగితే భారతదేశంలో నకనకలాడుచున్న కోట్లకొలది డొక్కలకు పట్టెడన్నం దొఱకుతుంది. అయితే, పెద్దాడా! మళ్లీ తిరిగి పటాలానికి ఎప్పుడు వెళ్ళాలి?

పెద: (విషాదంతో) సరిగా చెప్పలేం. పరిస్థితులు కొంచెం విషమించాయి. మాది, జపానువారిది కలసి రెండులక్షల సైన్యం. ఇప్పుడు ఇరువదిలక్షల అమెరికను, బ్రిటిషు, ఆస్ట్రేలియను సమ్మిళితదళాల కెదురునిలిచి మేము పోరవలసి వచ్చింది.

పు: యుద్ధం నిలుపుచేశారా?

పెద: లేదు. కాస్త మందగించింది. అంతే. మానమరం ఇంతటితో ముగిసేదికాదు. (చినగంగు మట్టిపాత్రలో టీపోసి పట్టుకవస్తాడు. పెదగంగు బాయినెటు క్రిందపెట్టి టీని అందుకుంటాడు.)

చిన: (కాలివ్రేళ్ళమీద నిలబడి చేయి పైకెత్తి) అన్నయ్యా! నే నింత పెద్దవాణ్ణయినాక పటాలంలో చేర్చుకొంటారుకదూ! ఎంచక్క అప్పుడు నిన్ను విడవక నీతో నే వుంటాను. నువ్వు లేకపోతే నాకూ, అమ్మకూ ఏమీ తోచదు, అన్నయ్యా! కాదు, అమ్మా?

పు: అవును, నాయనా.

(బయట తలుపు కొట్టినచప్పుడు)

పు: (తత్తరపాటుతో మెల్లిగా) పెద్దాడా! లే! రేగిచెట్టు ప్రక్క గడ్డివామి ఉంది. అక్కడ దాక్కో. పో. (పెదగంగు పెరటిలోకి వెళ్లిపోతాడు. చినగంగు మట్టిపాత్రను ఓ మూలకు త్రోసి, అన్నయ్య కోటు పట్టుకొనిపోయి వంటింట్లో పెట్టి వస్తాడు. నేలమీద బాయనెటు అట్లే పడి ఉంటుంది.)

పు: (గొంతు సవరించుకొని) ఎవరు వారు?

బయట ధ్వని: తలుపు తీయండి.

చిన: (బిగ్గరగా) ఎందుకు?

బ. ధ్వ: (మోటుగా) డామిట్! వెంటనే తెరుస్తావా? లేకపోతే ఒక తన్ను తన్ని తలుపు ఊడబెరకమన్నావా? (బూటుకాలితో నేలను ధూకుడుగా తన్నిన శబ్దం)

[తల్లి సైగచేయగా చినగంగు తలుపు

తెరుస్తాడు. (బ్రిటిషు సార్జంటు వాని వెనుక ఒక్కొక్కరుగా జమాదారు, సోల్జరు, సిపాయి లోన ప్రవేశిస్తారు. సార్జంటు చేతిలో వెండికట్టు కట్టిన సన్నని పేక బెత్తం ఉంటుంది.]

యాసిన్: (గదిమూల ఉన్న మట్టిపాత్రను సార్జంటుకు చూపిస్తూ) చూశారా?

పు: అవును. మా చిన్నాడు ఇప్పుడే టీ త్రాగాడు. (సార్జంటు గది నంతా కలయ చూస్తాడు. నేలమీద ఉన్న బాయనెటు పై, వాని దృష్టి పడుతుంది.)

సార్జంటు: (బాయనెటును పైకి తీసి) మీ చిన్నాడికి దీనితో ఏమిపని?

పు: (తెల్లపోయి, కొంచెం ధైర్యం తెచ్చుకొని) ఈ కుర్రాడు ఎక్కడినుంచో పట్టుకు వచ్చాడు బాబూ. వట్టి అల్లరివాడు. క్షమించండి. మీదైతే తీసుకుపొండి.

సార్జంటు: (సిపాయితో) పక్షి ఇప్పుడే ఎగిరిపోయివుంటుంది. బయటకు పోయి గాలించు. మిష్టర్ యాసిన్! నువ్వుకూడా పోయి చూడు. జల్దీయాప్ †

[ఇద్దరు బయటికి పోయి చీకటిలో ఏమీ కానక పది నిమిషాలలో తిరిగి లోపలకు వస్తారు.]

యాసిన్: సార్జంటు సాబ్! పక్షి గాయబ్. **

సిపాయి: అంతేనండి.

సా: షటప్. బ్లడీ యాస్ †† మీ రిక్కడ వుండండి. (కొంచెం ఆలోచించి) డోనాల్! నీవు నాతోరా. (బాటరీలైటు జేబునుండి తీస్తాడు. ముందు సార్జంటు, వెనుక సోల్జరు బయటకు వెదకటానికి బయల్దేరుతారు).

సా: (డోనాల్డు చెవిలో) మై డియర్ డోనాల్డ్! ఈ నల్లగాడిదలను విశ్వసించలేం. వీళ్లకుమనమీదుండే ద్వేషం ఇంతింత కాదు. ముఖ్యంగా ఆఫీసర్లకు*. ఈయాసిన్ గాణ్ణి మింగేద్దామన్నంత కోపం వస్తుంది

---

† 'శీఘ్రం శీఘ్రం' అని.

** గాయబ్ = పలాయనమైనది.

†† 'నోరుమూయి వెధవ గాడిదా' అని.

* 1945వ సంవత్సరము అక్టోబరు నెలలో, ప్రచురితమైన 'లండను ట్రిబ్యూను' అనే వారపత్రికయొక్క రెండవ సంచికలో డేవిడ్ కార్పెంటరు ఇల్లు వ్రాశాడు—

"A transcendent feature of the political situation in India is the volcanic hatred that one finds in the people's hearts for England and everything English. Nowhere is this hatred stronger than among the Officers".

వాడు. అప్పుడప్పుడు వాడి దొంగ వేషాలు చూస్తూ ఉంటే—

కార్పెంటరు ఆ కాలంలో బ్రిటిషు సైన్యంలో ఆఫీసరుగా పనిచేస్తూ ఉండేవాడు.

సో: నాకు తెలిసినంతవరకూ యాసిన్ వీరుడు.

సా: నీకేం తెలీదులే పద.

(ఇద్దరు చకచకా నడచి వెడతారు. పది నిమిషాలలో పెద గంగుతో ప్రవేశిస్తారు. పెదగంగు చేతులు వెనుకకు విరచి కట్టబడి వుంటాయి.)

సా: (వృద్ధురాలి నుద్దేశించి) ఓసి ముసలమారి మరాఠీముండా! (పెదగంగును చూపించి) ఈ ఉల్లూ * ఎవడంటావు?

(పుతలీ గుడ్లు మిటకరించి చూస్తుంది. కొంతసేపటికి తేరుకుంటుంది.)

పు: ఇతడు మా అప్పగారి అబ్బాయి. మీ రెవరో గొప్పవాళ్ళల్లా ఉన్నారు. మీకు మావాడిమీద కోపమెందుకు?

* ఉలూ = గుడ్లగూబ. ఈ మాటను సైనికులు తరచు వాడుతారు.

సా: వివరాలన్నీ తరువాత చెప్తాం. సింగ్! ఇతని జేబులో ఉన్నవాటిని పైకి లాగు (సిపాయి, గంగుజేబు తడిమి తుదకు నేతాజీ సందేశపత్రాన్ని బయటకు తీస్తాడు. సార్జంటు ఆ కాగితాన్ని అందుకొని చదువుకొంటాడు. కళ్ళు జేగురురాళ్ళలా ఎఱ్ఱబడతాయి. గదిలో ఉన్న గడమంచిమీద చతికిలబడతాడు.)

సా: డోనాల్డు! వాణ్ణిల్లా తీసుకొచ్చి నా ఎదుట నిలబెట్టు.

(డోనాల్డు, రాంసింగు, గంగుని పట్టుకొని సార్జంటు ఎదుట నిలపెడతారు. ఖైదీ పారిపోతాడనే భయంతో వారిరువురు చెరోక ప్రక్క నిలబడతారు.)

సా: (గంగుతో) ఏమోయ్! నిన్ను కొన్ని ప్రశ్నలడుగుతాను. సూటిగా సమాధానం చెప్పు. జాగ్రత్త సుమా! అవకతవక సమాధానా లిచ్చావంటే భూమిమీద నూకలు చెల్లినట్టే.

పెద: అల్లాగేనండి.

సా: నీతో వచ్చిన డట్ బ్లడీ* సైకిలు, వాళ్ళిద్దరూ ఎక్కడున్నారు? –

* అశ్వారోహులు.

పెద: సైకిలును నేను చూడలేదు.

సా: పోనీ - నీమాటే నమ్ముదాం. కాగా నీతో వచ్చిన జట్టుకి లెఫ్టినెంట్ ఎవరు?

పెద: నే నిక్కడకు ఒంటరిగానే వచ్చా.

సా: డొంకతిరుగుడు సమాధానాలు కట్టిపెట్టు. మీవాళ్లు ఎక్కడున్నారో త్వరగా చెప్పేయి.

చిన: వాళ్లెక్కడున్నారో చెప్పనా?

సా: ఈ కుంటడు తెలివైనవాడిలా ఉన్నాడు. అబ్బాయి! చెప్పు చూతాం.

చిన: ఉన్నచోటే ఉన్నారు.

సా: (చిన్న పుచ్చుకొని) బ్లడీఫూల్! డోనాల్డ్! ఈ కుర్రగాడిదను కొంచెం మరమ్మత్తు చెయ్యి. (సోల్జరు వచ్చి చినగంగు చెవి మెలిపెడతాడు. కుర్రవాడు నవ్వుతూ ఉంటాడు. పెదగంగు ముఖం కోపంతో కందగడ్డలా మారుతుంది. సార్జంటుకి ఉద్రేకం వస్తుంది.)

పు: (సోల్జరుతో) ముక్కు పచ్చలారని పసికూనమీద చూపిస్తావేమిటయ్యా నీ ప్రతాపం. ఇంతకీ వాడు చేసిన తప్పేమిటి? (సోల్జరు సిగ్గుపడి రెండడుగులు వెనక్కు వేస్తాడు)

పెద: (తల్లితో) ఇతరులు అక్రమంగా ప్రవర్తించేచోట సక్రమంగా ప్రవర్తించటమే క్రూరులకు కోపకారణం –

సా: (పళ్ళుకొరుకుతూ) బ్రిటిషు ప్రభుత్వమువారి రక్షణ చట్టంక్రింద బ్రిటిషు ఆఫీసరునైన నేను నీమీద (పేకబెత్తమును పెద

గంగు గుండెమీఁగుంచి) యీ నేరాలు మోపుతున్నా. ఒకటి - రాజద్రోహులైన అజాగు హింగు సైనికులకు నీవు భోజన సదుపాయాలు కల్పిస్తున్నావు. రెండు - వారి ఉనికి తెలుసుండీకూడా చెప్పడానికి నిరాకరిస్తున్నావు. మూడు - నా ఆజ్ఞను ధిక్కరిస్తున్నావు. నాల్గు - పైగా ఎత్తిపొడుపు మాటలు మాటాడుతున్నావు. అరు - నీకు తెలిసిన విషయాలను మాకు చెప్పక దాస్తున్నావు తొమ్మిది బ్రిటిషు ప్రభుత్వము వారి తాబేదారులు వారల నిష్పక్షపాత ధర్మాలను నిర్వర్తించటంలో నిర్బంధం కల్పిస్తున్నావు. పది - పైపెచ్చు వారలయందు ధిక్కారాన్వేషణ చేస్తున్నావు. ఈ నేరాలకు నీకు మరణ దండన విధింపదలచుకున్నా.

పు: నీవు మావాడిని ఏమీ చెయ్యలేవు.

సా: (వెటకారంగా) ఉహూ!

పు: దేవుడంటే నమ్మకం ఉంటే పాపానికి ఒడికట్టవు

సా: (ఆకాశంవైపు చూపిస్తూ) మనం అక్కడికి వెళ్లినప్పుడే దేవునిగూర్చి ఆలోచించేది.

యా: (మెల్లిగా) సార్జంటుసాబ్! సంజాయిషీ లేకుండా శిక్ష ఏమిటి?

సా: బ్లడీ ఫియర్సు! * సార్జంటు మాటే ఇక్కడ చట్టం.

యా: ఇక్కడనుండి వెళ్ళిన తర్వాత పశ్చాత్తాపపడవలసి వస్తుందేమో!

సా: (విసుగుగా) డామిట్! ఈ విషయంలో నీ జోక్యాన్ని గర్హిస్తున్నా. కాని నీవు చెప్పినట్లే సంజాయిషీ తీసుకుంటా. (పెదగంగుతో) ఏయి, చింబోతూ! నే మోపిన ఛార్జిలకి ఏం సమాధానం చెపుతావ్? (పెదగంగు మాట్లాడడు.)

సా: బెల్లం కొట్టిన రాయి!

పెదగంగు: నేను నీకెట్టి సమాధానం ఇవ్వదలచుకోలేదు. నీ ముఖం చూచినా, నీ మాటలు విన్నా రోత పుడుతుంది.

సా: ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొనే ఉన్నావన్నమాట. సరే! (లాలనతో) అబ్బాయ్! జీవితం మకరందం వంటిది. పది కాలాలపాటు బతకదలచినవాడివి. ఎవరి మీదో మనస్సు నిలిపేవుంటావు. ఆ చిలక ముగ్ధకంఠం జ్ఞప్తికలయిందనుకొని నే నడిగిన దానికి సమాధానమియ్యి.

పెద: నీతో చెప్పవలసినదేదీ లేదని ముందే చెప్పా.

సా: అధమం నీ ముసలితల్లిమీఁగుండైనా పేమ స్మరించుకో!

పెద: సార్జంట్! చైతన్యవిహీనమైన యీ టుపాకులను చూచుకొని మురిసిపోయి మిడిసిపడుతున్నావు. నీ క్రూరత్వం నా భౌతిక దేహాన్ని మట్టిలో కలిపినా, నా యెడదను



కుమారి గుడిమెళ్ల బాలాత్రిపురసుందరిగారికి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌గారు జూన్ 26 వ తేదీని హైదరాబాద్‌లో బహుమతి ఇచ్చారు.

పులకించుచున్న స్వేచ్ఛావాయువుల నరికట్టలేవు. నా హృదయం విచ్చగానే యీ వాయువులు అందుండి లేచి దేశమంతటా అలుముకుంటాయి.

సా: (వికటాట్టహాసముతో) అహహ! క్లిమ్ కొరం పదునాల్గవ సైన్యం పదునాల్గు గంటలలో ఈరకం పైత్యాన్ని మనగడ్డలో రూపుమాపకపోతే మారు పేరు పెట్టుకుంటా. అబ్బాయ్! నువ్వు వెఱ్ఱివాడిలా వున్నావు. మీ ఆఫీసర్లందరూ బ్రిటిషువారి హస్తగతమయ్యారు. ఏం లాభం లేదు. నే నడిగిన రవంత ప్రశ్నకు సమాధానం చెప్పితే మీ స్నేహితులకు నష్టం జరుగదు; సరిగదా నీకు లాభం తప్పక జరుగుతుంది. నిన్ను హవిల్దారుగా మా సైన్యంలో వేసుకుంటాం. వృద్ధిలోకి రాదలచినవాడివి. వెఱ్ఱి ముఱ్ఱి వ్యూహాలను తోసి పారెయి. (గంగు మాట్లాడడు) పోని డబ్బు కావాలంటావా? పుష్కలంగా ఇప్పిస్తా (గంగు తూష్ణీంభావం వహిస్తాడు.)

సా: (క్రోధాగ్నితో) ఈ మూగవాడిని బయటకు యీడ్చుకుపొండి. వాడి ముద్దు మొహం చూస్తే అసహ్యం వేస్తోంది.

పెద: డూమ్సుడేనాడు మనం తిరిగి ఒకళ్ల ముఖాల నొకళ్లు చూసుకోవలసి ఉంటుందని మీ మతగ్రంథం చెపుతోంది. (సార్జంటు కేసి చూసి నవ్వుచు) అంతే నంటావా? (పుతలీ కేసి తిరిగి నమస్కరిస్తాడు. డోనాల్డు, రాంసింగు అతనిని బయటకు తోసుకొని పోతారు. పెదగంగుముఖంపై అవగింజంతైనా విషాదం మొలకెత్తినట్లగపడదు. "నా జీవిత మొక విజయోత్సవమని ఋజువు చేయటకు పోతున్నా" అని చెప్పుచు సోల్జరు వెనకనే బయటకు పోతాడు. సార్జంటు పళ్ళు పటపట కొరుకుతూ, బూటుకాలుతో నేలను తన్నుతాడు.)

సా: యాసిన్! (కొంత తడవూరుకొని) వీడు అయఃపిండంలాంటివాడోయి. వట్టి మూర్ఖుడు. ఎక్కిన కొమ్మ నరుక్కునే రకం.

యా: సాబ్! వాని స్థైర్యం ప్రశంసనీయం. త్యాగనిరతిని స్వీయ జీవితంలో వహించుకున్నాడు.

సా: (విషపునవ్వుతో) త్యాగం ఓహో! యాసిన్! ఇంగ్లీషు దీవులందే అది దొరుకుతుంది. కంచుకాగడాలతో గాలించి నప్పటికి మరెక్కడా అది కన్పించదు. ఇది నా నమ్మకం.

యా: వాడి పట్టుదల చూస్తే నాకు సిగ్గేస్తోంది.

సా: యాసిన్! ఆ సంగతి వదిలేయి. మందభాగ్యుడు. వట్టి శుంఠ. నేనైతే భాగ్యాన్ని అంత చులకనగా తృణీకరించను.

యా: వాడివద్ద గుట్టు తీయలేకపోయారు.

సా: అప్పుడే పెదవి విరవకు. ఈ ముసలిదానికి కొంచెం చెపితే కార్యం సిద్ధింపవచ్చు. (రూపాయి జేబులోంచి తీసి పుతలీవైపు విసిరి) అవ్వా! ఇది నివద్ద ఉంచుకో. నీకు ప్రతినెలా పది రూపాయలు పింఛను వచ్చే

* *Bloody Fears* - భయంలేదు.

ఏర్పాటు చేస్తున్నా. పాపం బీదదానివి. మీ అప్పకొడుకు కేం భయం లేదులే.

పు: (రూపాయివైపు పెడముఖము పెట్టి) నా కివన్నీ ఎందుకయ్యా?

సా: వద్దూ?

పు: ఏమాత్రం వద్దు. ముమ్మాటికీ వద్దు.

సా: పోనీ మీ అప్పకొడుకు ప్రాణాలను రక్షించాలనే ఆశ ఉందా?

పు: ఎవరి ప్రాణాలనైనా మానవ మాత్రులు రక్షించగలరా? భగవంతుడు నీలో చేరి మంచి చేయించాలి గాని——

సా: ఆ అబ్బాయి ఇతగాళ్లు ఎక్కడున్నారు?

పు: నాకు తెలీదు. తెలిసినా చెప్పను.

*   *   *

సా: బ్లడీ రోగ్!* ఎందుకు చెప్పవూ?

పు: చెప్పదలచుకోలేదు కాబట్టి (గద్గద కంఠంతో) మా అబ్బాయికి వేసిన శిక్షే నాకూ వేయండి. నేరం ఒకటేగా.

చిన: ఆ శిక్షే నాకూ వేయండి.

(యుద్ధంలో పరాజయం పొందిన సేనానిలా సార్జంటు ముఖం వేలవేస్తాడు. చినగంకు తల్లిముఖంకేసి చూస్తూ ఉంటాడు. పుతలీ పరధ్యానంలో పడుతుంది. ఎంతసేపు వేచినా ఆమెనోట మాట లేదు. ఆమెకేసి చూస్తున్నకొద్ది సార్జెంటుకు అరికాలి మంట నెత్తికెక్కుతుంది.)

సా: (హఠాత్తుగా) యాసిన్! ఒక్క వెధవని గేరువుగిరివద్దకు తీసుకొనిపోయి కాల్చెయి.

యా: సార్జంట్ సాబ్! క్లైవ్‌దొర అనుజ్ఞ లేనిదే ఏ పౌరునీ కాల్చకూడదు.

సా: (వెటకారంగా) మై డియర్ యాసిన్! నేను బ్రిటిషు సార్జంటును. పాన కంలో అడ్డుపుడక వేయక నేను చెప్పింది చేయి.

యాసిన్: ఇది హత్య. (ఉద్రేకంతో) దీనికి నేను బాధ్యుణ్ణి కాను.

సా: నీవు బాధ్యుడివని ఎవరు చెప్పేరు? నీవూ కావు, నేనూ కాను——

యా: వారంటు లేకపోతే మీ అజ్ఞను ఉల్లంఘించవలసివస్తుంది.

సా: యాసిన్! అనుభవము లేనివాడా! ఇల్లారా! (చెవులో) ఇటువంటి చిన్న చిన్న విషయాలను రచ్చకు లాగితే బ్రిటిషుసేనలో నీకు పురోభివృద్ధి వుండదు. తెలిసిందా?

యా: నాలాభం మీ ఖుశీపై వుంటుంది. అట్లని యీ విషయంలో నాహృదయాన్ని చంపుకోను. మీరు వారంటు రాసిస్తే ఆ ప్రకారం అములుజరుపుతా. అంతే!

సా: అవిధేయత! నే చేసిన ప్రతిపనిని బ్రిటిషు ప్రభుత్వం సమర్థిస్తుందని నీకు తెలీదు? తెలుసు. ఎందు కింత పెళుపు? పోనీలే. కానీ! (జేబులోనుంచి నోటు బుక్కుతీసి వారంటువ్రాసి యాసిను కందిస్తాడు. వారంటు తీసుకొని సార్జంటువైపు వీపుపెట్టి 'థూ! పిరికిపంద'! అంటూ బూటు కాలుతో గడపను తన్ని యాసిను వెళ్ళిపోతాడు.)

చిన: (సార్జంటుతో) మా అన్నయ్యజట్టు ఎక్కడ ఉన్నారో నాకు తెలుసు.

సా: (విసుగుగా) పో. యిడియట్!

చిన: నిజంగానే. ఆ సంగతి చెపితే ఏమిస్తారు?

సా: ఏమికావలిస్తే అది యిస్తా.

చిన: ప్రేమగిరి కావల అడవి లేదూ! అందులో ఉన్నారు వాళ్లు.

సా: అబద్ధం చెప్పావంటే డొక్క వాలి కలుచేస్తా. తెలుసా? ఇదిగో, ఈ రూపాయి తీసికో.

చిన: (రూపాయికేసి చూడకుండా) నా కదివద్దు. నాకు మా అన్నయ్య కావాలి. తీసుకురండి మరి. నాకేం కావలిస్తే అది ఇస్తానన్నారుగా?

సా: నిజమే. ఇప్పుడూ అలాగే అంటాను. మీ అన్నయ్యను తీసుకురావడం మట్టుకసాధ్యం కాదు - (వెనక్కి చూడకుండా పెద్ద పెద్ద అంగ లేసుకుంటూ, కుటీరం లోంచి నడచి వెళ్ళిపోతాడు. చినగంకు బిక్కమొహం పెడతాడు. కొంతసేపైన తర్వాత నేలమీద పడివున్న రూపాయిని తీసి కోపంతో కిటికీలోంచి బయటకు గిరవాటు వేస్తాడు. ఇంతలో దూరంలో టుపాకీ పేలిన ధ్వని వినిపిస్తుంది. పుతలీ ఉలిక్కిపడుతుంది. చినగంకు భయంతో వెళ్ళి తల్లిని కౌగలించుకొంటాడు.)

చిన: అమ్మా! ఆ శబ్దం ఏమిటి?

పు: అన్నయ్య కైలాసగిరి ఎక్కతోంటే దేవతలు దుందుభి మ్రోగించారు.

చిన: అమ్మా! దుందుభి అంటే టుపాకీయా?

పు: (వినిపించుకోకుండా కిటికీదగ్గరకు వెళ్ళి) నాయనా - నీ జీవిత మొక విజయోత్సవమైంది. అదే నాకు సంతోషం. నీ దేశభక్తి నివాత దీపకళిక..మంచు కంబళిలో కెంపులు జలజల రాలి ఉంటాయి. ఇవి నా గుండెనుండి ఉదయించినవే. కరుడు గట్టిన సుధాధారలు! ఓ దయామయుడా! ఈనాటి ఆత్మబలి ధ్రువతారయై పది కాలములపాటు భారతదేశంలో వెలుగు జిలుగులు ప్రసరించు నట్లు అనుగ్రహింపు!

(చినగంకు తల్లికేసి నివ్వెరపోయిచూస్తూ నిలబడి పోతాడు. మెఱుపు తళ్లొత్తుతుంది. విద్యుల్లతలో దూరంలో ఎరను మ్రింగిన నాగుబాములా నిశ్చలంగా పడి నిద్రిస్తోన్న మణిపూరు నది అగుపడుతుంది.)

★

* *Bloody Rogue.*

వారసత్వం

"నాన్నోయ్! అన్నయ్య పాసయ్యాడు! పాసయ్యాడు అన్నయ్య!" అంటూ లలిత తండ్రి మంచం దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చింది.

మంచం పట్టెమీద చేతులానించి, ముందుకు వంగి వచ్చే దగ్గుతెర ఆపుకుంటూ కూర్చున్న శేషయ్య తల పైకెత్తి చూశాడు.

విశ్వనాథం, వికసించిన వదనంతో ఒక చేత్తో దినపత్రిక పట్టుకొని లలిత వెనకే లోపలికొచ్చాడు. దేశాలు జయించిన విజయగర్వంతో తండ్రిముందు కొచ్చి నుంచున్నాడు విశ్వనాథం.

ఎక్కడో అగాధంలోకి పీక్కుపోయిన శేషయ్య కళ్లలో కాంతి గాలివాన రాత్రి చీకటి మబ్బుల్లో మెరసే మెరుపులా తళుక్కుమంది.

పొంగివస్తోన్న ఆనందోద్వేగాన్ని, బయటికి దూకటానికి ప్రయత్నిస్తోన్న దగ్గుతెరతో పాటు అణుచుకొంటూ—

"మరి క్లాసు వచ్చిందా?" అని ప్రశ్నార్థకంగా కనుబొమలు ముడివేశాడు శేషయ్య.

"ఫస్టు క్లాస్‌లో పాసయాను నాన్నా! ఫస్టుక్లాసులో!!" అంటూ విశ్వనాథం తండ్రి చేతికి పత్రిక ఇచ్చాడు.

"నా బాబే! నా బాబే! ఫస్టున పాసయావటరా! నా కష్టాలు తీరే రోజు లొచ్చినయ్‌లే నాయనా!" పవిటచెంగుకు మసి చేతులు తుడుచుకొంటూ విశ్వనాథం తల్లి రామసుబ్బమ్మ వంటింట్లోనుంచి వచ్చింది.

శేషయ్య పత్రిక తీసుకుని కొడుకు నంబరు వెతుకుతూంటే, యిక ఆగలేనంటూ దగ్గుతెర ముందుకువచ్చింది.

ఖంగ్ ఖంగ్‌న ఒకటే దగ్గు! ఊపిరి సలపని దగ్గు!

తండ్రి వళ్లోవున్న పత్రిక పక్కకు పెట్టి విశ్వనాథం, తండ్రి భుజం అనుకుని వెన్ను నిమిరాడు.

రామసుబ్బమ్మ మట్టిబొచ్చెలో ఇంత బూడిద వేసుకొని శేషయ్య ముందు పెట్టింది.

శేషయ్య ఖంగ్ ఖంగ్‌న దగ్గి ఖళ్లు ఖళ్లున ఖాండ్రించి ఊశాడు. తెల్లటి నురుగులో ఎర్ర డాగులు!

"రక్తం కూడా పడుతోంది!" రామసుబ్బమ్మ గుండెలు అవిసిపోయినై. భయం భయంగా భర్త ముఖంలోకి చూచింది.

శేషయ్య ముఖం పక్కకు తిప్పుకున్నాడు. లోతుకుపోయిన కనిగుంటలనిండా నీళ్ళు! ఎండిపోయిన చెక్కిళ్లమీదగా కిందకు జారాయి.

తనకు తెలుసు, తనలోపల ఏం జరుగుతుందో; తన రక్తాన్ని జుర్రుకుంటూ లోపల వొక రాక్షసి పెరుగుతోంది. తిరుగుతోంది. రాక్షసి వొక్కొక్క బొట్టే రక్తాన్ని తన హృదయ కోశంలోంచి పీల్చుకొంటోంది. ఆ రాక్షసి - రోగం - పేరేమిటో శేషయ్యకు తెలుసు. డబ్బు ప్రవాహంలాగా ఖర్చుపెడితే ఆ రాక్షసిని మేపుతూ మనిషి బ్రతకొచ్చు! లేకపోతే అదిరక్తాన్ని పీల్చుకొంటుంది. మనిషిని తినేస్తుంది. ఇంతకీ తనలాంటి - శేషయ్యలకు రావాల్సింది కాదు ఆ జబ్బు! వస్తే—?

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

వనశ్రీ

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

తన గుండెలమీద కూర్చున్న మృత్యువుని పసికట్టాడు శేషయ్య. ఏదో ఒక్క క్షణం ఏమరుపాటు! గుండెగొట్టుకోవడం మానేస్తే? మృత్యువు శాశ్వతంగా తన్ను వశపరచుకొంటుంది!

గుండెల్లోపోటు! శేషయ్య కింద పెదవి పళ్లసందున బాధతో నలిగి పోతూంది.

"అబ్బ! కాసిని మంచినీళ్లు!" అన్నాడు శేషయ్య.

"అమ్మాయ్‌లలితా! నాన్నకు మంచినీళ్లు తీసుకురా!" అంటూ రామసుబ్బమ్మ పక్కకు చూచింది.

లలిత ఎప్పుడో వెళ్లిపోయింది! అన్నయ్య ఫస్టున పాసైన సంగతి ఆ చుట్టుపక్క ఇళ్లల్లో చాటింపు వేసి రావడానికి.

ఆమె లేచి వెళ్లి మంచినీళ్లు తీసుకొచ్చింది. శేషయ్య నీళ్లు తాగి కొంత తెప్పరిల్లాడు.

విశ్వనాథంతండ్రి ముఖంలోకి ఆదుర్దాగా చూస్తూ మంచం పక్కనే కూర్చున్నాడు.

"మరేదన్నా ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టుకో!" అన్నాడు తండ్రి.

"ఉద్యోగానికా?" విశ్వనాథం హృదయంలోని ఆశా సౌధాల పునాదులు కదిలిపోయినై.

"మరి ఏదో వొకటి చూచుకోకపోతే ఎలా?" అన్నాడు శేషయ్య ముఖం పక్కకు తిప్పుకొని; గొంతులో దుఃఖం గరగరలాడింది.

"మెడిసిన్ చదువుతా! అందుకేగా సైన్సు గ్రూప్ తీసుకొంది. క్లాసుకూడా వచ్చింది. సీటు దొరకొచ్చు!" అన్నాడు విశ్వనాథం.

"సీటు దొరికితే డబ్బు దొరకొద్దూ-" తర్వాతి మాటలు దగ్గుతెరలో కలిసిపోయినై.

"ఆ యకరం పొలం అమ్మితే సరి! ఏమైనా మెడిసన్ చదవాల్సిందే!" అంటూ విశ్వనాథం బయటికి లేచిపోయాడు.

"అంతగాక మరేవిటి? ఆ బారెడు నేలావుండి మన్ని వుద్ధరిస్తుందా? కష్టపడి చదువుకొని వాడు డాక్టరైతే ఇక మనకు కావాల్సిందేముంటుంది?" శేషయ్య ముఖంమీద స్వేదబిందువుల్ని పవిటచెంగుతో తుడుస్తూ అన్నది రామసుబ్బమ్మ.

"అది కాకే పిచ్చిదానా-?" మళ్ళీ శేషయ్యకు దగ్గుతెర కమ్ముకొచ్చింది.

శేషయ్య ముప్ఫై సంవత్సరాలు గుమస్తాగిరి చేసి రిటైరయినాడు. తాలూకా ఆఫీసులో హెడ్ గుమస్తాగా చేస్తోండగా శేషయ్యకు ఏభై ఐదో సంవత్సరం పూర్తి కావడంతో ప్రభుత్వం అతన్ని రిటైర్ అవమని ఆదేశించింది.

శరీరంలో జవసత్వాలు ఉడిగిపోయినాక, తోలుసంచిలో కట్టిన ఆ యెముకల మూట మాకెందుకూ, ఇక నువ్వు ఇంటికి పోయి విశ్రాంతి తీసుకోవచ్చు అన్నది సర్వీసు రూల్సు తాలూకు అధికార స్వరం.

ఉడుకు నెత్తురూ, వయసూ, వసుపూ గుమస్తాగిరికి ధారపోసి వట్టి ఎముకలపోగు శరీరాన్ని ఇంటికి తెచ్చుకున్నాడు శేషయ్య.

★ వారసత్వం ★

శరీరాన్నయితే ఆమాత్రమైనా తనకు మిగిల్చుకోగలిగిన శేషయ్య, ఆత్మాభిమానాన్ని ఆఫీసు ఫైల్సులోను అధికారుల బూట్లకిందా వదిలేసి చక్కా ఇంటికి వచ్చాడు. ప్రభుత్వం శేషయ్యకు నెలకు ఏభైనాలుగు రూపాయల పింఛను ఇస్తోంది.

శేషయ్య తిన ముప్ఫైఏళ్ళ సర్వీసులో దేశంలో జరిగిన చాలా మార్పుల్ని చూశాడు. స్వాతంత్ర్య పోరాటాలు, బ్రిటిష్ ప్రభుత్వ లాఠీలూ, బాయినెట్లూ, జైళ్ళు, తెల్లవాడుపోయి నల్లవాడు అధికారంలోకి రావడం చూశాడు.

దేశంలో ఎన్నిమార్పులు జరిగినా ప్రభుత్వానికి నమ్మకస్తుడుగా వున్న శేషయ్యలో గాని, అతను చేసిన గుమాస్తా గిరి విధుల్లో గాని ఏమార్పూ రాలేదు.

ముగ్గురు పిల్లల్నీ, పెళ్లాన్నీ పోషించుకొంటూ, అడపాదడపా వచ్చిన పై సంపాదన వెనకేసుకొని రెండెకరాల పొలంకూడా కొనుక్కున్నాడు శేషయ్య.

శేషయ్య రిటైరయిన రెండో సంవత్సరంలోనే విశ్వనాథం స్కూలు ఫైనలు పాసవడమూ, లలిత హైస్కూల్లో ఫోర్తుఫారంలో చేరడమూ, దాంతోపాటు కుటుంబ ఖర్చులు పెరగడమూ, జరిగింది.

ఉన్న రెండెకరాల్లో ఒక ఎకరం పొలం అమ్మి కొడుకును కాలేజీలో చదివించాడు. తన కొచ్చే పెన్షన్ ఏభై నాలుగు రూపాయిలతో సంసారం గడుపుకు వస్తోంటే, పొలం అమ్మిన డబ్బుతో విశ్వనాథాన్ని డాక్టరు పరీక్ష చేయిస్తే తన జన్మకు వో అర్థం వుంటుందనుకొన్నాడు శేషయ్య.

శేషయ్య ప్రతిరోజూ కొడుక్కు 'డాక్టరు' గురించిన ఆశల్తో ఉత్సాహపరచి పట్టుదలతో చదివించి పరీక్ష పాసయేట్టు చూశాడు.

విశ్వనాథం ఇంటర్ పాసయ్యేసరికి, శేషయ్య దాచిన సొమ్మూ, పొలం అమ్మిన డబ్బూ, పూర్తిగా అయిపోయింది. దానికి తోడు శేషయ్య మంచాన పడటంతో ఇల్లూ వళ్లూ గుల్లయిపోయింది. ఇప్పుడు మందులు కొనే వోపిక కూడా లేక వట్టి చేతులతో మృత్యువుతో పోరాడడం మొదలు పెట్టాడు.

తనకు వచ్చే పింఛన్ బాపతు సొమ్మే పొయ్యిలో పిల్లి లేవడానికి ఆధారం. తను ఏ నిముషాన కన్ను మూస్తే ఆ నిముషం నించీ ఆ ఆధారం కాస్తా పుటుక్కున తెగిపోతుంది. తర్వాత పెళ్లాం బిడ్డల సంగతి ఏం కాను? ఈ లోపలే విశ్వనాథాన్ని ఏదో గుమస్తా గిరిలో ప్రవేశపెడ్తే సంసారాన్ని ఎలాగో అలా యీదుకొస్తాడు.

కాని వాడు ఆవున్న ఎకరమూ అమ్మేసి చదువుతానంటాడు! అందులో వాడి తప్పు మాత్రం ఏముంది? సైన్సు గ్రూపు ఫస్టు క్లాసులో వచ్చాడు. తెలివి తేటలు వున్నవాడు. అవకాశం వుండి చదువుకుంటే పెద్ద డాక్టర వుతాడు. మొదట్నుంచీ ఆ ఆశలు వాడిలో రెచ్చ కొట్టింది తనే! తను ఆశించినట్టే వాడు కష్టపడి చదివి క్లాసు తెచ్చుకున్నాడు. 'మెడిసిన్' సీటు వచ్చాక రెండు సంవత్సరాలు చదివిస్తే, ఎవరో ఒకరు మంచి కట్నమిచ్చి పిల్లను ఇస్తారు. అత్తవారే మిగతా నాలుగు సంవత్సరాలు చదివించుకొంటారు. వాడు డాక్టరయి నాలుగురాళ్లు సంపాదించుకుంటే చెల్లెలికీ, తమ్ముడికీ వొకదారి చూపించ గలుగుతాడు. అదీ ఇంత వేళకు తిని కృష్ణా రామా అంటూ కూర్చుంటుంది. ఇక తను నిశ్చింతగా కళ్లుమూసుకోవచ్చు! అందాకా తను బతికుంటే తన కొడుకు-డాక్టరు - తన జబ్బును నిముషాలమీద నయం చేయడూ?

—శేషయ్య మనసు రెక్కలు విప్పుకొని భావతరంగాలలో విహరించింది.

"ఏమండీ? అబ్బాయిని చదివించొద్దా?" మెల్లగా అన్నది భార్య విసురుతోన్న విసనకర్ర ఆపి.

పసిడి రెక్కలు విప్పుకొని వినీల ఆకాశంలో విహరిస్తోన్న శేషయ్య మనసు, నులకమంచంమీద కొచ్చింది. మంచం పట్టె పగుల్లోనుంచి నల్లి శేషయ్య తొడను తెగ పొడిచింది. "అబ్బా" అంటూ కాలు కదిలించి భార్య ముఖంలోకి చూశాడు.

భార్య కళ్లల్లో అదే ప్రశ్న? ఆమె కనుపాపల నీడలలో విశ్వనాథం మెళ్లో స్టెతెస్కోప్ పెట్టుకొని మెదులుతూన్నట్టుగా భావించాడు శేషయ్య.

"వాడు వృద్ధిలోకి రావడం నాకుమాత్రం ఇష్టంలేదా? నువ్వే ఆలోచించు, ఆ కాస్త చెక్కా అమ్మితే ఏమైపోతావో బాగా ఆలోచించుకో?" అన్నాడు శేషయ్య.

"ఏమైపోయినా సరే! నా కొడుకు డాక్టరయితే నాకు అంతకంటే కావాల్సిందేముంది? మీకు వచ్చే పింఛను డబ్బుతో ఎలాగో సంసారాన్ని దిద్దుకొస్తాను. పొలం అమ్మితే వాడికి రెండు సంవత్సరాలకన్నా చదువుకొస్తుంది! ఆ తర్వాత మేం ఇస్తామంటే మేం ఇస్తామంటూ వాడి కాళ్ల చుట్టూ తిరగరూ? అసలు అబ్బాయి అదృష్ట జాతకుడు! వాడి ఐశ్వర్యమంతా ఎవరు చూడాలి?"

ఎండిపోయిన శేషయ్య పెదవులపై చిరునవ్వు కెరటంలా పొంగి వాలిపోయింది.

అవును! తన కొడుకు అదృష్ట జాతకుడే నేమో! ఎవరు చూశారు? వారాలు తిని చదువుకున్న వాళ్లలో ఒకడు జిల్లాకలెక్టరయిన సంగతి తనకు తెలుసు! వీధి లాంతరు స్తంభం వెలుగులో చదువుకొని ఒకడు హైకోర్టు జడ్జి అవడం తను చూశాడు! విశ్వనాథంలోవున్న ప్రతిభ తనకు తెలుసు! ఏదో వొకరోజు పెద్ద సర్జన్ అయిపోతాడు. బీదవాళ్ళకు ఉచితంగా వైద్యం చేసి దేశవ్యాపితమైన కీర్తిని సంపాదిస్తాడు.

—శేషయ్య. భావనా ప్రపంచంలో జనరల్ హాస్పిటల్ గేటుముందున్న డాక్టర్ రంగాచారి విగ్రహం కదిలింది. దాన్ని తను కొన్ని వందల సార్లు చూసి వుంటాడు. కాని ఈరోజు శేషయ్య మనసులో ఎంతో ఉదాత్తంగా, గంభీరంగా కనిపిస్తోంది.

శేషయ్యకు కళ్లు మసకలు కమ్ముతూన్నట్టుగా వుంది. డాక్టర్ రంగాచారి విగ్రహం సినిమాలో బొమ్మలా 'ఫేడవుట్' అయిపోతూంది. మళ్లీ 'ఫేడిన్' అవుతూంది విగ్రహం! ఆ విగ్రహంలో విశ్వనాథం ముఖకవళికలూ, వర్చస్సూ—

—శేషయ్యకు గుండె పోటూ దాని వెంబడే దగ్గు తెరా వచ్చిపడిపై.

దగ్గు తెర అణిగి స్పృహ వచ్చేసరికి తండ్రికి ఎదురుగా దీనవదనంతో విశ్వనాథం నుంచొని వున్నాడు.

"బాబూ!" అన్నాడు శేషయ్య కొడుకు ముఖంలోకి చూస్తో.

"నాన్నా! ఎలా వుంది?" తండ్రికి దగ్గరగా జరిగి అన్నాడు విశ్వనాథం.

కొడుకు జుట్టులోకి వేళ్లు పోనిచ్చి నిమురుతూ - "విశ్వం! ఎంత కష్టపడైనా డాక్టరు కోర్సు పూర్తిచేసుకో నాయనా! రేపే రాసి అప్లికేషన్ ఫారం తెప్పించుకో!" అన్నాడు శేషయ్య.

విశ్వనాథం కళ్లు చెమ్మగిల్లాయి.

2

జూన్ నెల రెండవ వారం మొదట్లో పత్రికల్లో ప్రకటనలు పరంపరగా రాసాగాయి. విశ్వనాథం ఎం బి; బి యస్; కోర్సుకు అప్లికేషన్ ఫారము పంపమని యూనివర్సిటీకి రాయాలని అనుకున్నాడు. అర్ధరూపాయి పంపితేకాని ఫారం పంపరు! ఇంట్లో అన్నిటికీ కటకటగా వుంది. ఫారం తెప్పించడానికే రూపాయి యివ్వమని నాన్నని అప్పుడే అడగడం ఏం బావుంటుంది?

విశ్వనాథం, తన క్లాస్ మేట్, స్నేహితుడూ అయిన సత్యనారాయణకి సంగతి చెప్పి ఒక రూపాయి బదులివ్వమని అడిగాడు.

అప్లికేషన్ ఫారం తెప్పించుకోవడానికి రూపాయికి తికానా లేని వాడివి

పించి, బి.యస్., కొన్ని ఎలా చదువుతావోయ్!" అంటూ వెకిలిగా నవ్వాడు.

విశ్వనాథం హృదయంలో బాకు గుచ్చినట్టయింది! సత్యనారాయణ తన హృదయాన్ని గాయపరచాడు. ఏదో క్రూరమైన నిజాన్ని తన కళ్లముందుకు లాగి చూపించాడు!

ఫస్టు క్లాసులో పాసయిన తనకు, ఏ పార్టీ పాసుకాని సత్యనారాయణ ఎంత తెలివిగా చెప్పాడు! తన మధుర స్వప్నాలపై నున్న తెరను ఎంత నిర్దయగా లాగివేశాడు. వాస్తవం అంత కఠినమా? నిజం దయారహితమా?

బాగా చీకటి పడ్డాక విశ్వనాథం ఇంటికి వచ్చాడు. సత్యనారాయణమాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. అలమారులో వున్న పుస్తకాలు చిందరవందరగా విసిరికొట్టాడు. లాంతరు గుడ్డి వెలుగులో పుస్తకాల మధ్యన తళుక్కున మెరుపు కనిపించింది!

ఆ మెరుపును మెల్లగా తీసి చేత్తో పట్టుకున్నాడు!

వెండి మెడల్! విశ్వనాథం ప్రతిభా, తెలివితేటలకు చిహ్నం! స్కూలు ఫైనల్ పరీక్షలో స్కూల్లో అందరికంటే ఎక్కువ టోటల్ వచ్చినందుకు మెడల్ ఇచ్చారు.

విశ్వనాథం మెదడులో ఒక వూహా మెరిసింది. కూలిపోయిన ఊహాసౌధాలు అతని హృదయంలో మళ్ళీ లేచి నుంచున్నాయి.

తెల్లవారి ఎవరికీ చెప్పకుండాపోయి షరాబు అంగడిలో వెండి మెడల్ అమ్మివేశాడు. మూడు రూపాయిలు వచ్చినయ్. అర్ధరూపాయి మనిఆర్డరు పంపుతూ యూనివర్సిటీకి అప్లికేషన్ ఫారం పంపమని రాశాడు.

మిగతా దాన్తో ముప్పావలా పెట్టి నాలుగు బత్తాయిపళ్లు కొనుక్కొని, రోగిష్టి తండ్రికి తీసుకుపోయాడు.

నాలుగు రోజుల తర్వాత విశ్వనాథానికి యూనివర్సిటీనుండి వుత్తరం వచ్చింది. గ్రూప్‌లో 'డిస్టిన్క్షన్' వచ్చిందని తెలియజేశారు.

విశ్వనాథం తండ్రి దగ్గరకు వుత్తరం తీసుకొని పరుగెత్తిపోయి చూపించాడు. శేషయ్య ఆనందపరవశుడయిపోయాడు. ఉత్సాహం పట్టలేక అన్నయ్య వీపుమీద చరిచింది లలిత.

"నా కష్టాలు తీరేరోజులు వచ్చినయ్‌రా నాయనా!" అన్నది రామసుబ్బమ్మ. ఆమెకు అదో అలవాటు పాపం! సంతోషకరమైన వార్త విన్నప్పుడల్లా ఆమెకు బుర్ర పని చేయక ఆమాట అంటూ వుంటుంది.

"ఐతే సీటు తప్పకుండా దొరుకుతుంది! ఏమైనా సరే, ఎన్ని అవాంతరాలు వచ్చినా సరే నువు కష్టపడి చదువు నాయనా!" అన్నాడు శేషయ్య. శేషయ్య కళ్ళకు కొడుకు ముఖంలో డాక్టరు రంగాచారి విగ్రహం నీడలు కదులుతున్నట్టుగా కనిపించింది. "అలాగే నాన్నా!" అన్నాడు విశ్వనాథం.

"నా బాబు చిటికలో డాక్టరు పరీక్ష యిచ్చెయ్యడూ! స్కూలు మొత్తంమీద ఫస్టుగా వచ్చినవాడికి అదో లెక్కా పత్రమా?" అన్నది రామసుబ్బమ్మ ఆవలిస్తో చిటిక వేసి.

3

వారం రోజుల తర్వాత వొకనాడు పేరయ్యగారు మట్టం మాపుగా శేషయ్య ఇంటికి వచ్చారు. కుశల ప్రశ్నలు అయాక పేరయ్య అన్నాడు.

"మరి విశ్వం పరీక్షఅయినాడు కాబోలి! ఏదైనా వుద్యోగంలో పడేయకపోయావా? నాలుగురాళ్లు తెస్తే వేడినీళ్లకు చన్నీళ్లలా కుటుంబం గడిచిపోతుందిగా?"

"అదేవిటిబావా? వాడు డాక్టరుకోర్సు చదవాలనుకుంటుంటేను!" అన్నాడు శేషయ్య. గొంతులో గర్వం గీరపలికింది.

"ఆఁ. అనుకోటానికేమి లే! రాజుగారి కూతుర్ని చేసుకోవాలనుకోవచ్చు! దానికి తాహతుండొద్దూ? మన అంతరాన్నిబట్టి మనకోరికలూ వుండాలి! దూకలేకపోతే మోకాళ్లు విరుగుతయ్. తర్వాత ఏం అనుకుంటే ఏంలాభం!"

శేషయ్య మనసు బాగా వుబ్బించిన రబ్బరు బెలూన్‌లోనుంచి గాలిపోయిన చందమైంది.

"బుద్ధులు భూములేలుతుంటే రాతలు గాడిదలు కాస్తున్నాయని మనకెందుకు యీ అందనిపనులూ! నీమాదిరిగానే వాడూ ఏ తాలూకాఆఫీసులోనో గుమస్తాగిరి దొరికితే హాయిగా బతికిపోతాడు!"

"చెయ్యక చెయ్యక వాడిచేతగూడా గుమస్తాగిరీ చేయించాలా?"

"అవును శేషయ్యబావా! వారసత్వం ఎక్కడికిపోతుంది?" - పేరయ్య మీసాల్లోంచి విషపునవ్వు నాగుపాములా కదిలి మాయమైంది.

"వారసత్వం! గుమస్తాగిరి వారసత్వం!"- శేషయ్య పెదవులు వణికాయి. తన ముప్ఫై సంవత్సరాల గుమాస్తా జీవితం కళ్లముందు కదిలింది-.

గడియారంలో ముల్లు - ఎనిమిదినుండి మళ్లీ ఎనిమిది అంకెమీదకు - డ్రాఫ్టుఫైల్, నోటుఫైల్, పేపర్సు పెన్‌డింగ్ పెండింగ్ - "ఆఫీసర్ పిలుస్తున్నారు సర్" - కాలింగ్ బెల్ - "వస్తున్నా సార్" - "ఏమిటిలా రాశావ్?" కాళ్ళల్లో వణుకు - నోట్లో నుంచి మాటరాదు. "యూ హేవ్ నో బ్రెయిన్స్ - అన్‌ఫిట్ -" "యక్స్‌క్యూజ్ మీ సార్ -" "[illegible] పిల్లలు వస్తున్నాయ్ - [illegible] -" "చిత్తం చిత్తం - పిల్లలుగలవాణ్ని - క్షమించండి -" "నో - నో" - "చిత్తం - చిత్తం - యువర్ మోస్ట్ వొబీడియంట్ సర్వెన్‌సార్" ఆఫీసర్ రూంలోనుంచి చేతులుకూడా కాళ్ళుకాగా-నాలుగుకాళ్ళ మీద పాకిబయటపడటం——

గుండెల్లో రైళ్ల దప్పుడూ - మెదడులో పోటూ - హారిబుల్! ఫైల్స్! ఫైల్స్! పెండింగ్-పెండింగ్-

——శేషయ్య వళ్లంతా చెమటలు కక్కుతోంది. నగ్గతెర ముంచుకొచ్చింది.

నగ్గతెర అణిగాక శేషయ్య స్థిమితంగా కూచున్నాడు నీరసంగా చూస్తూ.

"సరే! బావా? ఆ ముహూర్త మెప్పుడో చూసి మూడు ముళ్ళూ వేస్తే మనపని తీరిపోతుందిగా?" అసలు సంగతి బయటపెట్టాడు పేరయ్య. తన కూతుర్ని విశ్వనాథానికే యిచ్చి చేయాలన్న అభిప్రాయంలో వున్న పేరయ్యకు విశ్వనాథం డాక్టరు కోర్సుకు పోతే తన కూతుర్ని చేసుకోడేమోనని భయం.

"వాడికిప్పుడేం పెళ్ళి? చదువు పూర్తి అయాక డాక్టరు అయి చేసుకొంటాడు" అన్నది రామసుబ్బమ్మ అప్పుడే లోపలకు వస్తూ.

"అంతే! పేరయ్య బావా!" అన్నాడు శేషయ్య.

పేరయ్య బావ ఘూంఘాలాడుతూ లేచి నుంచున్నాడు.


"ఓస్! ఇట్లాంటివి చాలా చూశాములే! గుమాస్తా కొడుకు కలక్టరై ఊళ్లు ఏలతాడుట చూద్దాం! పూటకూటికి గతిలేదు యీయనకు పెద్దచదువులు చదివించి కొడుకుని అందలాలు ఎక్కిస్తాడట! అంతా యీ కళ్లతోనే చూస్తాగా?" అంటూ పేరయ్య చరచరా వెళ్ళిపోయాడు.

శేషయ్య గుండెల్లో ఏదో కెలికినట్టయింది! పేరయ్య మాటల్లో ఏదో దారుణమైన సత్యం వున్నది. అది శేషయ్య మనసును కలచివేసింది.

శేషయ్య స్వప్న జగత్తు కరిగిపోతోంది. డాక్టరు రంగాచారి స్టాట్యూ- విశ్వనాథం భవిష్యత్తు - ఇసుక్కా, మట్టీ, సున్నంగా విడిపోయి రాలిపోతోంది.

"లేదు! విశ్వనాథం గుమస్తా కావడానికి వీలులేదు! డాక్టరవాలి! డాక్టర్ రంగాచారి డాక్టర్ విశ్వనాథం! డాక్టర్ విశ్వనాథం—"

"ఒరే! అబ్బాయ్! తొందరగా రారా నాయనా! మీనాయనకు మతిపోయినట్టుంది! వెర్రిగా అరుస్తున్నారు!" అంటూ కేక పెట్టింది రామసుబ్బమ్మ.



బందరులో ఇటీవల కూచిపూడి నాట్యంచేసిన కిళాంబి రాజకుమారి, వేదాంతం లక్ష్మీ నారాయణగారు, బరోడా విశ్వవిద్యాలయనాట్యాచార్యుడు మోహన్ భోకర్.

★ వారసత్వం ★

శేషయ్య వెర్రిగా చూస్తూ స్పృహతప్పి పడిపోయాడు.

4

"అప్లికేషన్ ఫారం యివ్వాళే పంపాలి నాన్నా! యీ రోజే లాస్ట్ డేట్!" అన్నాడు విశ్వనాథం.

"మరి రామయ్యగార్ని అడక్కపోయావూ? రేపో ఎల్లుండో పెన్షన్ రాగానే యిచ్చే పని!" అన్నాడు శేషయ్య కుడి చేత్తో ఎడమపక్క గుండెను అదుముకుంటూ.

"అదీ అయింది! లేదన్నాడు."

"ఆయనగారి దగ్గర పదిరూపాయలు కూడా లేవన్నాడా? చూస్తే కోటికి పడగ ఎత్తాడు! నిజంగా వీళ్ళదగ్గర లేకుండా ఎప్పుడూ పోతుందో?" అన్నది రామ సుబ్బమ్మ కసి, విచారమూ ఆమె గొంతులో పోరుచుకున్నై.

"ఇవ్వకపోతే మానె! పైగా మాటలు!" అన్నాడు విశ్వనాథం కోపంగా.

"ఏమన్నాడేం?" తీవ్రంగా చూస్తూ అడిగాడు తండ్రి.

"ఏమంటాడు? అందరూ అనే మాటే అన్నాడు! అప్లికేషన్ ఫారం పంపుకోటానికి పదిరూపాయల ఫీజు కట్టలేనివాడివి ఐదు సంవత్సరాల కోర్సు ఎట్లా చదువుతావు అన్నాడు!" విశ్వనాథం నీరైపోయి దిగులుగా "ఇక అసలు ఏవీ చదవను మానుకుంటాను!" అన్నాడు.

"పిచ్చి సన్నాసి! లే! ఎందుకు దిగులు పడతావ్! వెళ్దాం పద! నేను స్వయంగా వస్తే పింఛను డబ్బు యివ్వాళే ఇస్తారు. ఇవ్వాళ ఫస్టుగాదూ! అక్కడే చేలాను పూర్తిచేసి ట్రెజరీలో డబ్బుకట్టి అప్లికేషను పంపుకోందువుగాని!" లేని వోపిక తెచ్చుకొని మంచంమీద కూర్చున్నాడు శేషయ్య.

విపరీతమైన దగుతెర వచ్చింది—శరీరం అంతా చెమటలో ముద్దయిపోయింది.

పదిహేను నిముషాల తర్వాత తెప్పరిల్లుకొని - "రిక్షా పిలువ్!" అన్నాడు శేషయ్య.

"వద్దు నాన్నా! నువ్వు రాలేవు! కదలకూడదు!" అన్నాడు కొడుకు.

"ఫరవాలేదులే! ముందు నువ్వు రిక్షా పిలువ్!" శేషయ్య ముఖంలో ఏనాడూ లేని గంభీరత కనిపించింది.

"అయ్యో రాత! అట్లావుండి, మీ రెట్లా వెళ్తారండీ?" అన్నది భార్య ఆదుర్దాగా.

"నువ్వు ఊరుకోవే! ఊ! పోయి రిక్షా పిలవరా?" శేషయ్య గొంతుక వణికింది. తండ్రి కళ్ళలోని తీవ్రతా, పట్టుదలా చూసి విశ్వనాథం నోరు మెదపలేకపోయాడు.

తల్లీ కొడుకూ సాయంచేసి శేషయ్యను రిక్షా ఎక్కించారు.

రిక్షా సాగింది. చక్రంపక్కనే కొడుకు నడుస్తున్నాడు. రిక్షా మలుపు తిరిగి జిల్లా ట్రెజరీ ఆఫీసుగోడ్డు ఎక్కిపోతూంది.

ముప్పై సంవత్సరాల సర్వీసుచేసి రిటైరయిన శేషయ్య ప్రతి నెలా పెన్షన్ తాలూకు ఏభై నాలుగు రూపాయలు తీసుకోవాలంటే ముందు తను బతికున్నట్టు ప్రతి నెలా ట్రెజరీ ఆఫీసరుముందు రుజావు చేసుకోవాలి. తను స్వయంగా పోయి మొదటి తారీఖున హాజరయి జరిగిన నెలంతా బతికివున్నట్టు చెప్పుకోవాలి! లేకపోతే గవర్నమెంటు గుర్తించిన ఒక డాక్టరుచేత పెన్షనర్ బతికున్నట్టు సర్టిఫికెట్ తీసుకొని కుటుంబం తాలూకు మనిషివెళ్తే పింఛను డబ్బు ఇస్తారు. ఐతే మూడు నాలుగు రోజుల తర్వాతగాని డబ్బు రాదు. ఆ సర్టిఫికెట్ పదిమంది గుమాస్తాల చేతులు మారి నలుగురు ఆఫీసర్ల సంతకం వేయించుకోవాలి. అదంతా యన్. జి. వో.లకు ప్రభుత్వం పెట్టిన పెన్షన్ రూల్సు.

—అవన్నీ శేషయ్యకు క్షుణ్ణంగా తెలుసు! రూల్సు అంటే రూల్సే! మరి గవర్నమెంటుతో పని! మాటలా?

తనుపోయి ట్రెజరీ ఆఫీసరుగారికి అలా కనిపిస్తే చాలు! వెంటనే డబ్బు ఇచ్చేస్తారు. ఒంటిగంటముందే చలానా కట్టుకొని ఫారము పంపుకోవచ్చు.

అదృష్టం బాగుండి సీటు వస్తే, ఆ ఎకరం పొలం అమ్మేస్తే రెండు సంవత్సరాలు చదువుకుంటాడు. ఆతర్వాతి సంగతి తర్వాత చూసుకోవచ్చు! బాగావున్నవాళ్లెవరో ఒకరు పిల్లనిచ్చి, అల్లుడ్ని చదివించుకొంటారు. తనకొడుకు - విశ్వనాథం - డాక్టర్ విశ్వనాథం - ప్రతిభావంతుడైన డాక్టరవుతాడు! గొప్ప సర్జన్.

రిక్షా ఆగినచప్పుడుకు శేషయ్య తన వూహాప్రపంచంలోనుంచి బయటబడ్డాడు.

"నాన్నా! ఆ మెట్లన్నీ ఎక్కి లోపలకు రాగలవా?" అన్నాడు విశ్వనాథం కలక్టరాఫీసు మెట్లు చూపిస్తూ.

శేషయ్య రిక్షా దిగటానికి ప్రయత్నించి గబుక్కున గుండెమీద చెయ్యివేసుకొని మళ్ళీ రిక్షాలోనే కూలబడ్డాడు.

"విశ్వం! బాబూ! ఆఫీసరుగారితో చెప్పు నేవచ్చాననీ! నా పరిస్థితీను! వచ్చి చూస్తారు! ఊఁ. తొందరగా - తొందరగా పో!" శేషయ్య హీనస్వరంతో అన్నాడు. విశ్వనాథం రయ్యిన మెట్లెక్కి ట్రెజరీ ఆఫీసరుగదిలోకి వెళ్ళాడు.

పదినిముషాల తర్వాత ఆఫీసరుగారూ ట్రెజరీగుమస్తా విశ్వనాథమూ బయటికి వచ్చారు.

శేషయ్య కూర్చున్న సైకిల్ రిక్షాదగ్గర కొచ్చి ఆఫీసరుగారు శేషయ్యముఖంలో ముఖం పెట్టి చూసి గాబరాగా వెనక్కి తిరిగి విశ్వనాథంవంక చూశాడు.

విశ్వనాథం వొక్కదూకులో రిక్షాదగ్గర కొచ్చి తండ్రిని రెండుచేతులతోనూ పట్టుకొని వూపుతూ పిలిచాడు -

"నాన్నా!" గావుకేక పెట్టాడు విశ్వనాథం.

ట్రెజరీఆఫీసులోని ఖజానా పెట్టె, కలక్టరాఫీసుభవనమూ విశ్వనాథం పిలుపును ఆలకించి ప్రతిధ్వనించినై. ★

సీరియల్

ఉదయ కిరణాలు

పోతుకూచి సాంబశివరావు

9

ప్రకాశమంటే బంధువులలో అసూయ పెరిగిపోయింది. కారణం అవధాని సొమ్ము అంతా అతని కుటుంబం ఒక్కటే అనుభవిస్తోందని. అవధానికి భార్య చనిపోయాక చేతిలో పుష్కలంగా డబ్బు ఉండేది. కష్టాలలో ఉన్న బంధువులకు తోచినప్పుడు కాస్త ఆర్థిక సహాయం చేసేవాడు. చనిపోయిన భార్య తమ్ముడికి బి.ఏ. దాకా చదువు చెప్పించాడు. సోమయాజులు తమ్ముడి కూతురు పెళ్ళికి ఐదువందలు సహాయం చేశాడు. వీలైనప్పుడల్లా, పాతిక, ఏభయి, రూపాయిలో, చీరలో, సీతమ్మకు ఇచ్చేవాడు. అతని పినతల్లి మనుమడు, ఆంజనేయమూర్తి, తండ్రి చనిపోయి, ఆస్తి ఆట్టేలేక చదువుకోడానికి కష్టపడుతున్నాడంటే జీతం ఇచ్చి ఇంటరుదాకా చదువు చెప్పించాడు. ఆంజనేయమూర్తి కూడా కాకినాడలోనే తన తల్లి సుబ్బమ్మతో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని చదువుకుంటున్నాడు. నరసింహం మరణంవల్ల, జాలి, అభిమానంతో, అతని కుటుంబాన్నంతా పోషిస్తానంటూ కంకణం కట్టుకున్న అవధాని, తన సహాయం ఇకముందు బంధువుల కెవ్వరికీ దొరకదని ఒక ప్రకటన జారీ చేసేశాడు. తన బి. ఏ. చదువుకూడా అవధాని ఆదుకుంటాడని ఆశతో ఉన్న ఆంజనేయమూర్తి కళ్లు తేలేసి, కోపంతో ఆంజనేయస్వామిలా మూతి పెట్టుకున్నాడు. అతని తల్లి సుబ్బమ్మ ప్రకాశమంటే కొరకొర చూడసాగింది. సీతమ్మకు ఏటేటా కొత్త చీరలు లభించవనే నిరాశకల్గి ప్రకాశం అంటే కొంచెం అసహ్యంతో ప్రవర్తించ మొదలిడింది. ప్రకాశం ఒక్కడే అవధాని సొమ్ము తింటూంటే బంధువులు అసూయపడినా అర్థముండేది; అనుకొనేది రాధమ్మ. కాని ప్రకాశం, తండ్రిలేని కారణాన తన కుటుంబానికి పెద్దవాడు కావడంవల్లనే, బంధువుల అసూయ అంతా అతనిమీద కేంద్రీకరించబడుతోంది.

ప్రకాశం, చిట్టిబాబు కలిసి మెలిసి స్నేహంతో చదువుకుంటూ హాయిగా ఉండడం సీతమ్మకు కన్నెర్ర కల్గించింది. తన కసలు సంతానం లేదనే బెంగ, యీ కుర్రాళ్లమీద కలిగిన అసూయవల్ల మరీ ఎక్కువైపోయింది. సోమయాజులతో పోరుపెట్టింది, ఎవరైనా కుర్రాడిని పెంచుకుందామని. ఆస్తిలేక బడిపంతులు ఉద్యోగంవల్ల వచ్చే అరవైరూపాయిలతో సంసారం వెళ్ళబుచ్చుతున్న దంపతులకు మాత్రం ఎవరు తమ పిల్లవాడిని అప్ప చెప్పగలరు? సోమయాజులు ఎరుగున్నవారివద్ద తాను దత్తత చేసుకోవల్సివున్నాననే అభిప్రాయం వెలిబుచ్చినా ఎవరూ ముందుకు రాలేదు. సీతమ్మకూడా తన స్వశక్తి తెలివితేటలు పూర్తిగా వినియోగించి చుట్టుపక్కల బంధుజనంలో కాస్త మంచిగావున్న అయిదారుఏండ్లకుర్రవాడు ఎవరున్నాడా అని పరిశోధన చేసింది. ఒకరిద్దరి యిళ్లకు వెళ్ళి తన ఆశయాన్ని వెల్లడించి, వాళ్ళ చేత తిట్లు తినేటంతపనై జాగ్రత్తగా తప్పుకుని వచ్చేసింది. అనుకున్న ఆశయం ఏదోవిధంగా నెరవేర్చుకోవాలని సీతమ్మ చాలా ఆరాటపడింది.

సీతమ్మకు ఒకరోజు హఠాత్తుగా ఒక ఆలోచన తట్టింది. సర్వేశ్వరశాస్త్రి సంతానంలో తొమ్మిదేళ్ళ కుర్రాడు రామలింగశర్మను పెంచుకుంటే బాగుంటుంది. స్వశక్తితో ఆలోచించే తెలివితేటలులేని సోమయాజులు మూగమనిషిలా భార్య వైపు చూశాడు, 'అలాగే నువ్వే తేల్చే'మని. ప్రకాశంమీద అసూయవల్ల వాడికి పోటీగా నరసింహం అన్నగారి కొడుకు బాగా పనికొస్తాడని సీతమ్మకు గట్టినమ్మకం కలిగింది. ఒకరోజు భార్యాభర్తలు సర్వేశ్వరశాస్త్రి ఇంటికివెళ్ళి తమ అభిప్రాయం చెప్పారు... ఇంతమందిపిల్లలలో ఒకడి బరువు తగ్గినా తగ్గడమే అని సంతోషించి సీతమ్మదగ్గర ఒక అయిదువందలు తన కుటుంబఖర్చులకని తీసుకుని రామలింగశర్మను ఆమె చేతుల్లో పెట్టాడు శాస్త్రి.


రామలింగశర్మను దత్తత చేసుకుందుకు ఒక ముహూర్తం నిర్ణయించారు. అవధాని సెలవు లేదని, తన వైధవ్యంవల్ల కదలకూడదని మాణిక్యం దత్తతకు రాలేకపోయారు. తక్కిన బంధుజనం చాలామందివచ్చి రామలింగశర్మకు ఆశీర్వచనాలు సోమయాజులుకు, సీతమ్మకు ధన్యవాదాలు అర్పించి వెళ్లిపోయారు.

లోలోపలి అసూయ ఒక విచిత్రమైన కార్యరూపం ధరించినా, అది కప్పుకోడానికి సీతమ్మ వీలైనంతవరకు ప్రయత్నిస్తోంది. రాధమ్మ, సీతమ్మ అవసరమొచ్చినప్పుడల్లా ఒకరింటికి మరొకరువెళ్లి సహాయపడుతూనే వున్నారు.

ఒకరోజు చిట్టిబాబు, ప్రకాశం, సీతమ్మ యింట్లో భోజనం చెయ్యవలసివచ్చింది. రామలింగశర్మ అతి గారాబంతో పెరుగుతూండడంవల్ల బాగా పెంకితన మొచ్చింది. చిట్టిబాబు ప్రకాశంలపైని ఏవేవో పితూరీలు తల్లికి చెప్పడం, వాళ్లని అనవసరంగా తిట్టడం, కొట్టడం అంటే వాడికి చాలా సరదా. అటువంటి సరదాలకు సీతమ్మ సాధ్యమయినంతమటుకు దోహదం కూడా యిస్తోంది.

ఆరోజు ప్రొద్దున్న బజారునుంచి కూరలు తెచ్చిపెట్టమని సీతమ్మ ప్రకాశానికి పురమాయించింది. త్వరలో కూరలు తెచ్చి బడికి వెళ్లాలని, గబగబ స్నానాలగదికి వచ్చాడు నీళ్లు పోసుకుందామని. రామలింగశర్మ కూడా నేనూ నీళ్లుపోసుకోవాలంటూ తువ్వాలు కట్టుకుని పరుగెత్తుకుంటూ వచ్చేడు. 'ఏముంది త్వరగా బయటికి వెళ్లాలి?' అన్నాడు ప్రకాశం. 'నాకూ ఏముంది' అన్నాడు పెంకిగా రామలింగశర్మ. వీడితో దెబ్బలాట ఏమిటని, వేడినీళ్లు తొరుపుకుని బిందెలోకి పోసుకున్నాడు ప్రకాశం. 'అమ్మా! చూడవే! ప్రకాశం వేడినీళ్లన్నీ పోసేసుకుంటున్నాడు!' అని అరిచాడు శర్మ. ప్రకాశానికి కోపంవచ్చి 'బోలెడు నీళ్లున్నాయి తెగిపాతో వచ్చిమూసు' అన్నాడు. రామలింగశర్మ చిందులు త్రొక్కుకుంటూ చెంబుతో మరుగుతున్న వేడినీళ్లు తీసి చెంబుసహితంగా ప్రకాశం వడ్డిమీద విసిరేశాడు. ప్రకాశంవడ్డి మరుగునీళ్లతో కాలి, బొబ్బలు లేచాయి. బాధతో గొల్లుమని అరుస్తూ ఇంట్లోకివెళ్లి సీతమ్మతో చెప్పాడు జరిగినసంగతి. 'వాడితో నువ్వు అనవసరంగా దెబ్బలాడడమెందుకూ?' అంటూ సీతమ్మ ప్రకాశాన్నే తిట్టింది. వడ్డిమీద బొబ్బలు మానడానికి వారంరోజులు బాధపడ్డాడు ప్రకాశం.

ఇంట్లో భోజనం పెట్టేటప్పుడు చల్ది అన్నం ప్రకాశానికి, వేడిఅన్నం శర్మకు



వడ్డించేది సీతమ్మ, 'పెద్దవాళ్లు తినకపోతే కుర్రాళ్లుతింటారా చద్దిఅన్నం' అని గుడ్లు ఉరిమేది సీతమ్మ. మంచికూరలు శర్మకు, మాడువస్తువులు ప్రకాశానికి వడ్డించేది. ప్రకాశం ఇవన్నీ చూసి లోలోపల బాధ పడినా, పైకి ఏమీ అనలేకపోయేవాడు. ఎప్పుడైనా తెగించి ఏమన్నా అన్నా 'నువ్వు ఇంతకన్నా మంచికూరలు తిన్న పాపానపోయావా ఎప్పుడైనా? నావంటకే వంకలు పెడుతున్నావేమిటిరోయి' అనేది ఆవిడ. రాధమ్మ ఆ ఊళ్లోనే ఎదురుగా ఉండడంవల్ల చిట్టిబాబునుమాత్రం ఎక్కువగా బాధపెట్టేదికాదు సీతమ్మ.

ఆంజనేయమూర్తి సుబ్బమ్మ ప్రత్యేకంగా ఒక ప్రోగ్రాము వేసుకున్నట్లు రోజుకు ఒక బంధువుయింటికివెళ్ళి తనకు అవధాని సహాయం చెయ్యడం మానేశాడని, అందువల్ల ముందు బి. ఏ. చదువులు ఎల్లా జరుగుతాయా అనే బెంగతో బాధపడు తున్నామని ప్రతీచోట ఒక చిన్న ఉపన్యాసమివ్వజొచ్చారు. ఆ ఉపన్యాసంలో ప్రకాశం అదృష్టం పొగడుతూ, మరోవైపు వాడివల్లే తమసహాయం పోయిందని తిడుతూ ప్రచారం చెయ్యసాగారు. ఆ ప్రోగ్రాము ఒకరోజు రాధమ్మ యింటివైపు మళ్లింది.

ఆడంగినడకతో చేతులు త్రిప్పుకుంటూ ఆంజనేయమూర్తి 'రాధమ్మత్తయ్యా' అంటూ వీధులోంచే పొలికేకలు పెట్టుకుంటూ సిద్ధమయ్యాడు. లోపలినుంచి చిట్టిబాబు ఆంజనేయమూర్తిని చూశాడు. 'ఒరే! పండుకోతి వచ్చేడురోయి' అన్నాడు చిట్టిబాబు ప్రకాశంతో. ఇద్దరూ గొల్లుమని నవ్వుకున్నారు మూర్తినిచూసి. ఈ నవ్వులు విన్నమూర్తి 'చూశావుటే, అత్తయ్యా' వీళ్లు నన్నుచూసి ఎల్లా పళ్లికిలించి నవ్వుతున్నారో! పెద్దవాణ్ణి కనుక ఊరుకుంటున్నాను! రామలింగశర్మలా ఉంటేనా చితక కొట్టేసేవాణ్ణి!!' అంటూ మూతి బూరాలా ఉబ్బించాడు ఆంజనేయమూర్తి. 'పోనిద్దూ! కుర్రాళ్లు! వాళ్లతో నీకేమిటెళ్లి' రాధమ్మ సర్దింది నవ్వుతూ. ఆంజనేయమూర్తి ఎర్రగా, తెల్లగా రాంభాళాపండులా ఉంటాడని సుబ్బమ్మ ప్రతీవాళ్లముందు పొగుడుతుంది. సాగదీసుకుని మాట్లాడ్డం, కిచకిచలాడుతూ నవ్వడం - కాళ్లు చేతులు ఎగరేసుకుంటూ గెంతడం - యీ లక్షణాలున్న ఆంజనేయమూర్తి ఒక పండుకోతిలా కనిపిస్తాడని వాదిస్తాడు చిట్టిబాబు. రాధమ్మ కూకలేస్తూంటుంది.

"ప్రకాశంతో తిరగనీయకండే మీ కుర్రాణ్ని పాడైపోతాడు!" అంది సుబ్బమ్మ జాగ్రత్తగా రాధమ్మముఖం చూస్తూ ఏమంటుందో అని.

సుబ్బమ్మ భావాలను ఎరుగున్న రాధమ్మ లోపల నవ్వుకుని ఎదురుహేళన చెయ్య సాగింది.

'అలాగేలే! రేపటినుంచి వాడిని రామలింగశర్మతో ఆడుకోమంటాను! వాడు చాలాబుద్ధిమంతుడుగా? అని కళ్లు మిటకరించింది రాధమ్మ చమత్కారంగా. సుబ్బమ్మ నిజమనుకుంది రాధమ్మ మాటలు.

'ఈమధ్య రామలింగశర్మ బాగా చదువుతున్నాట్ట! అన్నీ ఫస్టుమార్కులేట!!'

'ఆ! మీవాడిలాగే!!' అంది రాధమ్మ నవ్వుతూ. ఆంజనేయమూర్తి కిచకిచలాడుతూ నవ్వేడు తన్ను రాధమ్మ పొగుడుతోందని.

ఆంజనేయమూర్తి, వీలైనన్నిసార్లు పరీక్ష తప్పుతూ, అయిదవఫారం రెండేండ్లు, స్కూలుఫైనలు రెండేండ్లు, జాగ్రత్తగా చదువుకున్నాడు. పరీక్ష పోయిందేమని ఎవరైనా అడిగితే, "పునాది కట్టుదిట్టం కోసం, నేనే ప్యాసవదల్చుకోలేదు" అనేవాడు. ఇంటరు తప్పకుండా ప్యాసవగలనని ప్రతీవాడితోనూ డంబాలు చెప్పిన మూర్తి, పరీక్ష పోయిందని తెలియగానే, తనమీద కోపంవల్ల లెక్చరర్లు సరిగా మార్కులు వెయ్యలేదని యాగీచేశాడు. 'ఈ పరీక్ష ఎప్పటికి పూర్తవుతుందో, ఏమో, మావాడు అసలు తప్పని సరి అయితే కాని పరీక్ష తప్పడు!' అని సుబ్బమ్మ అందరి దగ్గరా చెప్పసాగింది. ఆ రికార్డే రాధమ్మ ముందు కూడా ఒకసారి త్రిప్పింది.

'పాపం!' అని రాధమ్మ జాలి నటించింది.

'అసలు మావాణ్ణి శనిగ్రహం ఏదో పట్టుకుందే!' అంది సుబ్బమ్మ.

'అవును అత్తయ్యా! మా సందులో ఉన్న వెంకటప్పయ్య జ్యోతిష్కుడు కూడా ఇదే అన్నాడు' అంటూ కాళ్లు చాపుకొని కూర్చున్నాడు ఆంజనేయమూర్తి.

'అరరే! ఎంత కష్టం!' ఓదార్పు నటించింది రాధమ్మ.

'ఆ శనిగ్రహం ఎవరో తెలుసా?' సుబ్బమ్మ రాధమ్మ చెవులో గుసగుసలాడింది.

'ఎవరూ?' ఆశ్చర్యం నటించింది రాధమ్మ.

'ఇంకెవరూ? ప్రకాశంట! వెంకటప్పయ్య చెప్పాడు. వాడి దురదృష్టగ్రహాలు మావాణ్ణి పట్టుకున్నాయట! లేకపోతే అసలు మావాడు అమెరికావెళ్లి, పెద్ద చదువులు

దర వలసినవాడు లే! ఇప్పటికి పాతికేళ్లు వచ్చినా ఇంటరు పూర్తికాలేదు. అంతా ఖర్మ!' సుబ్బమ్మ విచారం వెలిబుచ్చింది.

'మా అమ్మ ఎప్పుడూ ఇంతే అత్తయ్యా! నేను ఎప్పటికైనా అమెరికా వెళ్ళి తీరుతాను చూడు' గంభీరంగా అనేసి ఆంజనేయమూర్తి కిచకిచలాడుతూ నవ్వేశాడు!

'మా బంగారు నాయన! అంత అదృష్టమే ఉండాలి కాని!!' సుబ్బమ్మ విచారంమాని ఒక్కసారి ఫక్కున నవ్వింది.

సుబ్బమ్మ, ప్రకాశాన్ని శనిగ్రహం అన్నందుకు రాధమ్మకి రోషం కలగలేదు. ఆంజనేయమూర్తి, సుబ్బమ్మ కుళ్లుమోతు వెట్టిదద్దమ్మలని ఏనాడో ఆమె తెలుసుకుంది. అటువంటివాళ్లమాటలు పట్టించుకోడం ఆమెకు యిష్టంలేదు. వాళ్లసంభాషణలు వినడానికి చమత్కారంగానూ, ఊసుబోకగానూ వుండడంవల్ల, అప్పుడప్పుడు రమ్మని ఆహ్వానించేది రాధమ్మ.

చిట్టిబాబు, ప్రకాశం, కలిసి సినీమాకు బయలుదేరారు.

'ఎక్కడికర్రా వెడుతున్నారు?' సుబ్బమ్మ వెకిలిగా నవ్వింది.

'సినిమాకి' ప్రకాశంకూడా నవ్వాడు. సుబ్బమ్మ మూతివిరుచుకుంది. కుర్రాళ్లు సినీమాకి వెడుతూంటే, తనకొడుకునుకూడా సినీమాకి పంపించాలని బుద్ధిపుట్టింది. ఒకవేళ తనకొడుకు వెడతానంటే రాధమ్మ వాడికికూడా ఖర్చు పెడుతుందని ఆశించింది.

'నువ్వుకూడా సినీమాకి వెడతావేమిటిరా?' అడిగింది సుబ్బమ్మ.

'ఛ! వెధవ సినీమాలు!' అన్నాడు మూర్తి. ఆశాభంగంకలిగి సుబ్బమ్మ ముఖం చిట్లించుకుంది.

'అసలు నీకు సినీమా అర్థమౌతుందిరా?' చిట్టిబాబు మూర్తిని వేళాకోళం చేశాడు.

"మీరు వెళ్లండోయి! నేను చదువుకోవాలి!" ఆడవాళ్ళముందు అస్తమానూ చదువుకుంటున్నానంటే, మూర్తి ఒక గొప్పగా భావిస్తాడు. అందుకే గంభీరంగా అనేశాడు.

"అందుకేలాగుంది! పరీక్షలు అన్నిసార్లు పోయాయి! ఏమీ చదవకుండా మా ప్రకాశానికి ఫస్టుమార్కులు వస్తాయి." చిట్టిబాబు హేళనగా నవ్వేశాడు.

"నీకెందుకురా వాడిగొడవ! నువ్వు వెళ్లు" రాధమ్మ కూకలేసింది.

"చిట్టిబాబు మంచివాడే అత్తయ్యా! ఇవన్నీ వాడిచేత ప్రకాశంఅనిపిస్తున్నాడు" అంటూ మూర్తి ప్రకాశంవైపు కొరకొర చూశాడు.

ప్రకాశం ముభావంగా మూర్తివైపుచూసి ముఖం చిట్లించి 'పదరా!' అంటూ చిట్టిబాబుతో బయటికి వెళ్లిపోయాడు.

'మాసేవుంటే వాడి పొగరు!' సుబ్బమ్మ గుడ్లు గిర్రుమని త్రిప్పేసి దవడలు నొక్కుకుంది.

'ఆ! అందరిపొగరూ చూస్తూనేవున్నాను' అంది రాధమ్మ, సుబ్బమ్మను దెప్పాలని.

'బాగుందేవ్! మేమేం పొగరుగా మాట్లాడేం? పదరాబాబూ!' అంటూ కొడుకుని తీసుకుని వెళ్లిపోయింది తత్తుణం సుబ్బమ్మ.

రాధమ్మ వాళ్ళవరసమూసి లోలోపల నవ్వుకుంది.

పరంధామయ్య భార్యా బిడ్డలను వెంటపెట్టుకుని ఒకరోజు కాకినాడలో దిగాడు.

రాధమ్మ యింట్లో. నిడదవోలులో తోడల్లుడు ఇంట్లో బారసాలకు ప్రత్యేకం తమ్ముని వ్రాస్తే, భార్యకూడా ప్రత్యేకంగా ప్రోత్సాహమిచ్చిందని, బయలుదేరాడు ఆయన. కాకినాడలో కలెక్టరు ఆఫీసులో తన స్వంత వ్యవహారాలు కొన్ని చూసుకోవాలని అక్కడ దిగేడు. బంధువుల్ని ఒకసారి చూడడానికి వచ్చేనని చెప్పేడు అందరితో.

పరంధామయ్యకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు. పెద్దకొడుకు శ్రీనుకు పదహారేళ్లు, పెద్దకూతురు చామంతికి పదేళ్లు, రెండవ కూతురు పూబంతికి ఏడేళ్ళు ఉంటాయి. తన భార్య పేరు వసంత కనుక, ఆ పేరుతో అనుగుణ్యంగా ఉండే అందమైన పేర్లు తన పిల్లలకు పెట్టాలని, కూతుళ్లకు, చామంతి పూబంతి అని నామకరణం చేశాడు. శ్రీ నాయకుడు కావాలనే ఆశతో కొడుక్కి శ్రీను అని పేరుపెట్టాడు. తల్లిదండ్రులు తనకు పరంధామయ్య అని పెట్టిన పేరు చాలాకాలంనుంచి అతనికే వెగటనిపిస్తోంది. చదువుకున్న భార్య పోరువల్ల నాగరికత మోజువల్ల పి. ధామయ్య అని విచిత్రంగా మార్చుకున్నాడు తన పేరు. ఆఫీసు కాగితాలలోను, లెటర్ హెడ్సులోనూ పి. ధామయ్య అని ఉన్నా, బంధువులు, స్నేహితులుమాత్రం అతనిని పరంధామయ్య అనే పిలవజొచ్చారు. అక్కడికీ వాళ్లు అలా పిలుస్తున్నందుకు కోపం తెచ్చుకుని, తన పేరు మార్పునుగురించి సంభాషణలలో చమత్కరించి యితరులకు తెలియజేశేవాడు. అదివిన్నా విననట్లు కొందరు నటించేవారు. కొందరు లోలోపల నవ్వుకునేవారు. అయినా పరంధామయ్య, తన పేరులాంటి పేర్లు యీ నవనాగరిక కాలంలో మార్చుకోవలసిన ఆవశ్యకతలోని నమ్మకం మాత్రం పోగొట్టుకోలేకపోయాడు.

పరంధామయ్య ఎంత స్వార్థపరుడైనా డబ్బున్నవాడు. నాగరికత తెలిసినవాడు. పిల్లలనుకూడా ఒక అందమైన పంథాలో జాగ్రత్తగా పెంపకం చేసేవాడు. అందువల్ల రాధమ్మకు పరంధామయ్య సంసారంపై కొంతమోజు ఉన్నమాట వాస్తవం. ఆ మోజు మరీ అధికమైంది ఈమధ్య రాధమ్మకు. కారణం చామంతి.

చామంతి, అందంగా, నాజూకుగా, లేడికళ్లతో బాగుంటుంది. పాటలు పాడడంకూడా బాగావచ్చు. అంతకన్న ఆడదానికి కావలసినదేముందని రాధమ్మ ఉద్దేశ్యం. అందువల్ల చామంతిని తన కోడలిగా చేసుకోవాలనే కోరిక రాధమ్మకు ఉంది.

ఇది పరంధామయ్యకు తెలియకపోలేదు. ఒకరోజు మాటల సందర్భంలో సోమయాజులు పరంధామయ్యను కదిపాడు చామంతి పెండ్లిగురించి. సోమయాజులుకు ఇందులో కొంత స్వప్రయోజనం లేకపోలేదు. సీతమ్మ బలవంతమైన సలహా ఒకటి ఆయన చెవిలో దూరింది. పూబంతిని రామలింగశర్మ కిచ్చి పెండ్లి చేయిస్తే బాగుంటుందని. అసలు పెళ్ళి విషయాలు కదిపితే పరంధామయ్య తేలిపోగలడని, సోమయాజులు సంభాషణలో ఇరికించాడు యీ విషయం.

'చామంతికి పెండ్లి ఎప్పుడు చేస్తావోయ్!' నవ్వాడు సోమయాజులు.

'నేనేమిటి చేసేది! అదే చూసుకుంటుంది వదినే!' సోమయాజులు ఉద్దేశ్యం పసికట్టిన పరంధామయ్య ఆయనకన్న ఎక్కువగా నవ్వేశాడు.

'రాధమ్మకు ఒక ఉద్దేశ్యం ఉంది' సీతమ్మ ప్రారంభించింది సమస్య పరిష్కరిద్దామని.

రాధమ్మ పరంధామయ్యవైపు తేరిపార చూసింది.

'ఆఁ – ఏమీలేదు చామంతిని తన కోడలు చేసుకోవాలని' సోమయాజులు భార్య అభిప్రాయం చెప్పేశాడు. ఆమె ప్రసన్నత కోసం చూస్తూ.

భర్తవైపు సంతోషంగాచూసి, తన తెలివి యింక కొంచెం ప్రయోగించింది సీతమ్మ.

'ప్రకాశానికి ఇస్తావేమో చామంతిని.'

వీలైతే ప్రకాశంపై రాధమ్మకు అసూయ కలగచెయ్యాలని సీతమ్మ ప్రయత్నం.

సీతమ్మ మాటలువిని పరంధామయ్య ముఖం చిట్లించాడు.

'తండ్రి చచ్చిపోయి, ఆ స్థితిలేని అనాథుడికి పిల్ల నెలాయిస్తానే' పరంధామయ్య ప్రకాశం గదివైపు చూసి చీదరించుకున్నాడు.

'బాగా చెప్పావు!' అంది సీతమ్మ.

'పిల్లను ఎవరి కివ్వదల్చుకున్నా, ప్రకాశాన్ని అనవసరం మాటలనడం బాగులేదు' రాధమ్మ సలహా ఇవ్వబోయింది.

'ఓహో నువ్వు వాడిని సమర్థించుకు వస్తున్నావే! అయితే నీ కొడుక్కి పిల్లనివ్వడం సంగతి ఆలోచిస్తా!' అంటూ నవ్వేశాడు పరంధామయ్య.

అసలు పరంధామయ్యకు చామంతిని చిట్టిబాబుకు ఇవ్వాలని లోపల అభిప్రాయం ఉంది. పదెకరాల భూమి; కాకినాడ పట్నంలో పదివేలు చేసే పెద్ద స్వంత ఇల్లు, ఉన్న చిట్టిబాబు, కొంచెం నల్లగా వుంటేనేం, చామంతికి తగిన వరుడని అతని ఉద్దేశ్యం. కాని భార్య ఒప్పుదల కూడా కావాలిగా!

'పెళ్ళిసంగతి ఇప్పుడు తొందరేమొచ్చింది పిల్లకు పదేళ్ళు దాటలేదు! చూద్దాం లెండి!' పరంధామయ్య ప్రసంగం మార్చబోయాడు.

సీతమ్మ యిది పసిగట్టింది. తమవిషయం కూడా తేల్చి పరంధామయ్యచేత 'ఊ' అనిపించుకోవాలనుకుంది.

'చామంతి కెంగాని పూబంతిని మాత్రం మా రామలింగశర్మకు తప్పక యివ్వాలిరోయి!' అంటూ సీతమ్మ నిక్కచ్చిగా చెప్పేసింది.

'అలాగేలే' అంటూ తేలిగ్గా తీసి పారేశాడు సీతమ్మమాట పరంధామయ్య.

ఆమాట తమకు వాగ్దానమనుకుని సీతమ్మ, సోమయాజులు లోలోపల ఆనందపడ్డారు.

ప్రకాశం ఈ సంభాషణ అంతా విన్నాడు. చామంతిని చూశాడు. ఎప్పుడో చిన్నప్పుడు ఒకసారి ఆమెను చూసిన జ్ఞాపకమున్నా చామంతి అంటే ఒక అభిప్రాయం లేదు ప్రకాశానికి. ఈ వారంరోజుల్లో చామంతి చాలా అందమైనపిల్ల, మంచిదని ఒక అభిప్రాయం ప్రకాశానికి ఏర్పడింది. అసలు పరంధామయ్యతో ఈ సంభాషణలు జరిగేదాకా ప్రకాశానికి తన పెళ్లి విషయం తట్టలేదు మనస్సుకు. చామంతికూడా బాల్యంలోని అమాయకత్వంతో చిట్టిబాబుతోనూ ప్రకాశంతోనూ సరదాగా ఆడుకుంటోంది. చామంతిని చిట్టిబాబుకుయిచ్చి పెండ్లిచేస్తే బాగుంటుంది అనుకున్నాడు ప్రకాశం.

అలా అనుకోడానికి ప్రకాశంలో విజృంభిస్తున్న వైరాగ్యదృక్పథమే మూలం. రాధమ్మభర్తపోయాక ఒంటరిగా కష్టాలతో సంసారం గడపడం - సోమయాజులుభార్య అధికృతలో అణకువగా బ్రతకడం - తన కుటుంబంలో తండ్రి మరణం ... ఇతర కుటుంబాలలో ఆడవాళ్ల గయ్యాళితనం - వీరందరినీచూడగా ప్రకాశానికి స్త్రీలమీద అసహ్యం కలిగేది. అసలు ఆడవాళ్ళందరూ ఇందులో ఏదో ఒకతరగతికివస్తారని నిశ్చయించుకున్నాడు. కుటుంబాలలో కష్టాలు కలిగిందడానికి ఆడవాళ్ల అనవసర ప్రసంగాలు, కుళ్లు, సంకితనాలు, కారణమనే విశ్వాసం అతనిలో ప్రబలమయింది. అందువల్ల చామంతిని తనకు యివ్వకుండా, చిట్టిబాబుకుయిచ్చి పెళ్ళిచేస్తే సంసారం గొడవ తప్పించుకోగలిగిన అదృష్టవంతుడనే అనుకున్నాడు ప్రకాశం.

తన దృక్పథమటుంచి పరంధామయ్య తన్నుగురించి అన్నమాటలు ప్రకాశంహృదయాన్ని దూసుకుపోయాయి. ఎదిగి జ్ఞానం వస్తున్న పిల్లలపై నిరాదరణచూపిస్తే, దాన్ని సులువుగా మరిచిపోలేరు కుర్రాళ్లు. ప్రపంచాన్ని అర్థంచేసుకుంటున్న ఆ కుర్రాళ్లు నిరాదరణచూపించేవారికి దూరమైపోతారు. పరంధామయ్య పనిపూర్తయ్యాక కాకినాడవదిలి వెళ్లి పోయాడు. రాధమ్మ దృష్టి చామంతిమీద నుంచి యింకా పోలేదు. అసలుకుర్రాడి అభిప్రాయం ఎలావుందో కనుక్కుందామని ఒకరోజు చిట్టిబాబు ప్రకాశం భోంచేస్తుంటే సంభాషణ కదిపింది రాధమ్మ.

'చామంతిని మీ యిద్దరిలో ఎవరు పెళ్లి చేసుకుంటార్రా!'

ప్రకాశం మౌనంగా నవ్వాడు. అంతరంగంలోని నిశ్చయాలు ప్రకాశంకు ఎవరితోటీ చెప్పే అలవాటులేదు. అవి కార్యరూపం పొందేదాకా గుప్తంగా ఉంచాలనే అవధాని సిద్ధాంతం ప్రకాశానికి బాగా ఒంటబడింది.

చిట్టిబాబు ఏ విషయమూ లోపల దాచుకోలేడు. అనుకున్న సంగతి ఢంకా బజాయించి చెప్పేస్తాడు.

'ఇప్పుడు పెళ్లి ఎవడికి కావాలి?' అన్నాడు చిట్టిబాబు తేలిగ్గా నవ్వేస్తూ. తన ఒక్కడి సంగతిగురించి చెప్పినప్పటికీ, ఆమాటల్లో ప్రకాశం ఉద్దేశ్యంకూడా తన కొడుకు చెప్పినట్లు స్ఫురించింది రాధమ్మకు.

'చామంతి బాగులేద్రా!' కోడలు తత్క్షణం రాబోతోందనే స్త్రీ సహజమైన ఆత్రుత చూపించింది రాధమ్మ!

ప్రకాశం తిరిగి మౌనంవహించాడు.

'బాగులేదని ఎవరన్నారు ... మేము బాగులేం?' చిట్టిబాబు వెటకారంగా ఎదురుప్రశ్న వేశాడు. రాధమ్మ వాడి కొంటెప్రశ్నకు నవ్వుకుంది. హాస్యంచేస్తూ తన ఉద్దేశ్యం విస్పష్టంగా చెప్పని పరంధామయ్యకన్న తమకెక్కువ ఆధిక్యత ఉందని చిట్టిబాబు వ్యంగ్యంగా తన మాటల్లోని ఆత్రుతను వెక్కిరిస్తున్నాడా అనిపించింది రాధమ్మకు.

సరేలే! పెళ్లిసమయానికి ఏదో ఒకటి తేలుతుంది అని ఊరుకుంది రాధమ్మ.

ఆవేళకు ఊరుకున్న రాధమ్మ పూర్తిగా అలా ఉండలేకపోయింది. మెరుపులా ఒక ఆలోచనతట్టి జ్యోతిష పండితుడు వెంకటప్పయ్యను తనయింటికి రమ్మని కబురు పంపించింది.

ఆవేళ ఆదివారం. చిట్టిబాబు, ప్రకాశం చదువుకుంటున్నారు. ఆదివారం నాడు పిల్లలు యింట్లో చదువుకుంటూ ఉంటారని రాధమ్మ వెంకటప్పయ్యను ఆరోజేరమ్మంది. అనుకున్నప్రకారం రానేవచ్చాడు వెంకటప్పయ్య.

గంధాక్షతలు ముఖానదిద్ది బలిసిన నల్లని శరీరంతో నిగనిగలాడుతూ, తాంబూలం నములుతూ, తిన్న అన్నం నెమరు వేసుకు త్రేనుస్తూ చంకన పెట్టుకున్న నీరుకావిరంగు అంగవస్త్రాలనుంచి ఏవేవో పాతతాటాకుపుస్తకాలు బయటికి తీశాడు. వెళ్లగోచిపోవతీ సర్దుకుంటూ 'ఏమమ్మోయ్! రాధమ్మా!' అంటూ దర్జాగా వరండాలో ఉన్న పేము కుర్చీలో కూలబడ్డాడు కాళ్లు చాపుకుని భుక్తాయాసం తీర్చుకుంటూ.

'ఆఁ వచ్చా' అంటూ రాధమ్మ గబగబా పరుగెత్తుకువచ్చింది వరండాలోకి.

'పిల్లలేరీ' అంటూనే తొంగిచూశాడు వెంకటప్పయ్య వాళ్లు చదువుకుంటున్న గదిలోకి. 'పెళ్ళిసంగతి' అంటే వాళ్లు రారేమో అనే భయంతో 'ఒరే కుర్రాళ్లు! వెంకటప్పయ్యగారిచేత మీ చేతులు చూపిస్తారండ్రా!' అంటూ పిలిచింది రాధమ్మ.

చిట్టిబాబు ప్రకాశం ఒకరివైపు ఒకరు నవ్వుకుంటూ చూసుకుంటూ వరండాలోకి వచ్చారు.

★ ఉదయ కిరణాలు ★

'చెప్పండి. మా కుర్రాళ్లు కలెక్టర్లవుతారో, జడ్జీలౌతారో చెయ్యిచూసి చెప్పాలి' నవ్వింది రాధమ్మ.

'నేను జడ్జీ అవుతాను' చిట్టిబాబు తన ఉద్యోగం ఏరుకున్నాడు.

'ఇంక మిగిలిపోయిన ఉద్యోగం కలక్టరు నేనుకావాలి' అన్నాడు ప్రకాశం.

కుర్రాళ్ళహాస్యధోరణిచూసి రాధమ్మ ఆనందంతో నవ్వుకుంది.

వెంకటప్పయ్య కుర్రాళ్ల చేతులుచూశాడు. చిట్టిబాబు ప్రకాశం నవ్వుకునేటట్లు వాళ్లు యం. ఏ. లు చదువుతారని చాలా గొప్ప వాళ్లౌతారని పొగిడి ఏవేవో చెప్పాడు వాళ్ల సంతృప్తికోసం.

'ఇవన్నీ నిజమౌతే చూద్దాంలే' అంటూ తేలిగ్గా అనేశాడు చిట్టిబాబు.

తన జ్యోతిషాన్ని చిట్టిబాబు హేళన చేస్తున్నాడా అని లోపల అనుమానించాడు వెంకటప్పయ్య. కాని తాను అసలు విషయాలు వాళ్ళకి చెప్పలేదని ఒకవిధంగా సమాధానం చెప్పుకున్నాడు.

చిట్టిబాబు, ప్రకాశం, చదువుకుందుకు తమగదిలోకి వెళ్ళిపోయాక గంభీరమైన ముఖం పెట్టి "కుర్రాళ్ళ జాతకాలు మీదగ్గర ఉన్నాయా" అని అడిగాడు వెంకటప్పయ్య. తండ్రి చనిపోయాక ప్రకాశం భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసుకోవాలని రాధమ్మ వాడిజాతకం మాణిక్యాన్నడిగి తనగ్గర పెట్టుకుంది. లోపల పెట్లో పదిలంగా దాచిన కుర్రాళ్ళ జాతకాలు రెండుతెచ్చి వెంకటప్పయ్యగారి హస్తాలలో పెట్టింది ఆమె.

ముఖం చిట్లించి, ఏవేవో వేళ్ళతో లెక్కలు వేసుకుంటూ, కొంతసేపయాక జాతకాలు మూసి, నిమీలిత నేత్రుడై తర్వాత కళ్ళు తెరిచాడు జ్యోతిష్కుడు.

వెంకటప్పయ్యకు శాస్త్రం బాగా తెలిసినా ఒక్కొక్కసారి వీలునుబట్టి, లాభసాటి బేరాలు బట్టి జ్యోతిషం మారుస్తూంటాడు. శాస్త్రరీత్యా చెప్పితే ఆయనకు నిజంగా పేరు ప్రఖ్యాతులు బాగా వచ్చేవి. కాని పేరు జీవితంలో లాభించదనే నమ్మకమున్న వెంకటప్పయ్య ధనంమీద, ఎదురుగా ఉన్నవారి మెప్పుమీద, మోజు పెంచుకున్నాడు.

ఆ ప్రకారం జ్యోతిషం చెప్పాడు.

'తప్పకుండా మీ కుర్రాడికి దగ్గర సంబంధం అవుతుందమ్మా! చామంతి నిచ్చి పెళ్లిచేస్తారు' బ్రహ్మవర్చస్సుతో వేదవాక్కులు పలుకుతున్న ఋషీశ్వరుడిలా ముఖం పెట్టాడు వెంకటప్పయ్య.

రాధమ్మ ఆనందానికి మేరలేకపోయింది. గబగబ లోనికివెళ్లి ఒక రూపాయితెచ్చి వెంకటప్పయ్య చేతిలో వేసింది.

'తన ఆశయం సిద్ధించింది కనుక, ఇంక లోన దాచుకున్న జ్యోతిష రహస్యం రాధమ్మకు చెప్పినా పరవాలేదు.' అనుకున్నాడు వెంకటప్పయ్య. కాని తన సందులోనే ఉన్న సుబ్బమ్మ గబుక్కున జ్ఞప్తికి వచ్చింది వెంకటప్పయ్యకు. తళుక్కున ఆయన మెదడులో ఒక మెరుపు మెరిసింది.

ముఖం చిట్లించి, రాధమ్మను దగ్గరకు రమ్మని 'ఒక రహస్యం' అంటూ ఆమె చెవిలో ఏదో గుసగుసలాడాడు జ్యోతిష్కుడు.

'అమ్మో!' అంటూ ఒక్క కేక పెట్టింది రాధమ్మ.

'మరేం భయంలేదు. శివాభిషేకం చేయించు. గ్రహాలు తప్పిపోగలవు! ఎవ్వరితోనూ చెప్పకుసుమీ! యీ రహస్యం!!' అంటూ మళ్ళీ ఒక్కసారి ఇష్టదేవతను ధ్యానించుకుంటున్నట్లు క్షణంసేపు నిమీలిత నేత్రాలతో నిలబడ్డాడు వెంకటప్పయ్య. తరవాత 'మళ్ళీ వస్తా, రాధమ్మా!' అంటూ చకచకా నడిచిపోయాడు.

రాధమ్మ దిగులుతో నిట్టూర్పులతో కూలబడిపోయింది. అనవసరంగా జ్యోతిష్కుణ్ణి పిలుచుకున్నానే అంటూ బాధపడింది. కొరివితో తల గోక్కున్నానని విచారించింది.

రాధమ్మతో రహస్యమని చెప్పినసంగతి, వెంకటప్పయ్య, తను ఎరుగున్న ప్రతివారికి ఏదోవిధంగా ఆరహస్యం చెప్పేశాడు. ఈ రహస్యం నల్గురికి ప్రాకుతున్నట్లు సుబ్బమ్మకు తెలిసింది. వెంకటప్పయ్యనుపిలిచి, ఆయన చేతిలో తనుకూడా ఒకరూపాయి ఖంగుమనిపించింది. సీతమ్మకుకూడా యీ వార్త తెలిసి, వెంకటప్పయ్యచేతిలో తనుకూడా ఒకరూపాయి ఖంగుమని మ్రోగించింది. తెలివితేటలతో డబ్బు సంపాదించడమంటే, ఇల్లా గుండాలి అనుకున్నాడు వెంకటప్పయ్య.

ఈ రహస్యం అందరికీ తెలిస్తే ఎంతో అనర్థమని, తనలో తాను కుమిలిపోతూ కుక్కినపేనులా పడిఉంది రాధమ్మ. ప్రతి నెలా శివాలయానికి వెళ్లి అభిషేకాలు చేయించేది. ఈరహస్యం తెలిసినవాళ్లంతా ఎవరిమట్టుకువాళ్లే లోపల తెలుసుకుని ఊరుకున్నారు.

కాని ప్రకాశం తన చుట్టుప్రక్కలఉన్న జనంలో ఒక వింతప్రవర్తన గమనించాడు. తను కనిపించగానే కొంతమంది గబుక్కున నవ్వుకుంటున్నారు. మరికొందరు 'పాపం!' అని తన వెనకాల జాలిగా నిట్టూర్పులు విడుస్తున్నారు. మరికొందరు 'ఖర్మ!' అంటూ నసుక్కుంటున్నారు. ప్రకాశానికి చాలా చిత్ర మనిపించింది. ఇంకొకరిని గురించి మాటల్లో ఏమైనా అనుకుంటున్నారేమో అని మొదట అనుమానపడ్డాడు కాని, పదేపదే తను కనిపించగానే పెద్దవాళ్లు ముక్కుమీద వేలు వేసుకుని జాలిమాటలలో తన్ను గురించి ఏదో అనుకుంటున్నారని నమ్మాడు ప్రకాశం. కాని ఏమీ ఆరాతియ్యలేక పోనీలే! ఎవడి గొడవ వాడిది!' అని ఊరుకున్నాడు.

10

చిట్టిబాబు, ప్రకాశం స్కూలు ఫైనలులోకి వచ్చారు. అరునెలల పరీక్షలు ఆఖరయ్యాయి. పరీక్షల బడలిక తీర్చుకోడానికి నాలుగైదురోజులు పూర్తిగా విశ్రాంతి

కుతుంటూ వినోదంగా కాలం గడుపుదా మని నిశ్చయించుకున్నా రిద్దరూ.

ప్రకాశం ఆకారంలో చాలా మార్పు కనిపించింది రాధమ్మకు. అసలే వయస్సుకు మించిన ఒళ్ళు. ఈమధ్య లావెక్కుతు న్నాడు కూడా. మునుపు తినే అన్నం కన్న రెండు రెట్లు భోంచేస్తున్నాడు. ముఖమంతా ఉబ్బినట్లుంటోంది. 'ఎదిగే కుర్రాడా! ఒళ్ళు వస్తోంది కాబోలు' అని సమాధానం చెప్పుకుంది రాధమ్మ.

ఒకరోజు ఆటలాడుకుని ప్రకాశం దిగులుగా వంటింట్లో రాధమ్మదగ్గరకు వచ్చే శాడు.

'దొడ్డమ్మా! ఒళ్ళంతా ఇలా లావెక్కి పోతూందేమిటి?' చిత్రంగా ప్రశ్నించాడు ప్రకాశం!

'ఒళ్లు వస్తూందేమోరా!' నవ్వింది రాధమ్మ.

'కాలిమీద, ఒంటిమీద సొట్టలు పడు తున్నాయమ్మా' చిట్టిబాబు ఆశ్చర్యంగా చెప్పాడు.

చెడుగుడు ఆడుకుంటూంటే చిట్టిబాబు ప్రకాశం కాలుపట్టుకుని లాగాడు. లావుగా ఉన్న పాదము హస్తాలలో నలిగి, పచ్చి అప్పడంలా పల్చగాఅయిపోయింది. 'ఏమిటీ తమాషా' అనుకున్నాడు చిట్టిబాబు. మళ్ళీ కాస్సేపటికి పాదం లావుగా ఉబ్బింది.

రాధమ్మ ప్రకాశం ఒళ్లు పరీక్షించింది. 'వాతం పట్టిందేమో! డాక్టరుకు చూపించు కుని మందు తీసుకో!' అంది రాధమ్మ.

'ఈమాత్రందానికి డాక్టరెందుకు దొడ్డమ్మా!' అన్నాడు ప్రకాశం.

చిట్టిబాబుకు చీటికిమాటికి ఏదోరోంప, దగ్గుఅని ప్రక్కనే ఉన్న డాక్టరు అన్న పూర్ణయ్య దగ్గరకు పరుగెత్తుతూండడం అల వాటు. నెలాఖరు కాగానే డాక్టరుబిల్లు చెల్లించడానికి సమయానికి దగ్గర డబ్బులేక రాధమ్మ నానా అగచాట్లు పడేది. ఈ ఇబ్బంది దొడ్డమ్మకు కలుగచెయ్యడమెందు కని ప్రకాశం అశ్రద్ధ చేశాడు.

ఒకనాడు ప్రొద్దున్న వేడినీళ్లు స్నానం చేస్తున్న ప్రకాశం కళ్ళు తిరిగి హఠాత్తుగా మాటలేకుండా పడిపోయాడు. రాధమ్మ కంగారుపడుతూ ప్రకాశాన్ని మంచంమీద పరుండబెట్టింది. చిట్టిబాబు డాక్టరుని తీసుకు రావడానికి పరుగెత్తుకు వెళ్లాడు.

చేతిలో మందుల లెదర్ బాగ్ - బొజ్జకిం దకు వేలాడే పొడుగుకోటు - పాతబడి చివరల దారాలు వేలాడుతున్న సూటు - ఒక పాత హేట్ - డురుక్కు డురుక్కుమని పెద్ద శబ్దంచేస్తూన్న శాతవాహనులకాలంనాటిదా అనిపించే ఒక పాత కారులోంచి ఏదో ఆలోచిస్తూ దిగారు డాక్టరు అన్నపూర్ణయ్య గారు. ప్రకాశం మంచం పక్కనే పేము కుర్చీ ఆయన స్థూలకాయానికి సరిపోక బల వంతముగా ఏదోవిధంగా యిముడ్చుకుని కూర్చున్నాడు.

ప్రకాశం చేతి నాడి చూస్తూనే గుటకలు మింగి గబగబ ఒక ఇంజెక్షను తీసి పొడిచే శారు. శరీరం, గుండె, బాగా పరీక్షించారు. ఇంజెక్షనువల్ల ప్రకాశంలో చలనంకలిగింది.

'ఒంట్లో బాగా లేనప్పుడు, నా దగ్గరకి ఎందుకు పంపలేదమ్మా!' డాక్టరుగారు జాగ్రత్తగా తలఎత్తి కళ్లు పెద్దవిచేస్తూ రాధమ్మ వైపు చూశారు.

'కుర్రాడు అశ్రద్ధ చేశాడండి' రాధమ్మ గోడకు జార్లపడి నీరసంతో కుంచుంది. వెంకటప్పయ్య ఆమెకు చెప్పిన రహస్యం ఆమె ఒంటిలోని శక్తి అంతా పీల్చేస్తున్న ట్లయింది.

'రోగం బాగా ముదిరిపోయింది' డాక్టరు అన్నపూర్ణయ్యగారు పెదవి విరిచాడు.

రాధమ్మ, చిట్టిబాబు డాక్టరు వైపు చూశారు ఆత్రంగా లెక్కలేనిమాటలు కూడా విందామని.

'సంజు రోగము - ఒంట్లో గొత్తురులేదు.' వసిగారు డాక్టరుగారు.


ప్రకాశం ఆయాసంతో మూల్గాడు.

'కుర్రాడు ఎక్కడికీ కదలకూడదు - రెండు నెలలు మంచాన ఉండి విశ్రాంతి తీసుకోవాలి. పొరపాటున కదలి శ్రమతో కూడిన ఏపనైనా చేశాడా చాలా ప్రమాదం' హెచ్చరిక చేస్తూ రాధమ్మ వైపు చూశారు డాక్టరుగారు.

రాధమ్మకు ఏమనాలో తెలియక దిగు లుగా దీనంగా డాక్టరు అన్నపూర్ణయ్య వైపు చూసింది.

'గుండెకాయఉందిచూశావమ్మా! నీటిలో తడిసిన కాగితంలా చీకిపోయింది. ఏమన్నా బరువుపనిచేశాడా, గబుక్కున చిరిగి పోతుంది.' డాక్టరుగారు ఆయాసపడుతూ బొజ్జ నిమురుకున్నారు.

'మరి సేవస్తా. జాగ్రత్త. మందుపంపిస్తా' అన్నపూర్ణయ్యగారు కదిలి గుమ్మంమెట్లు దిగాడు. ఆవీధి అదిరిపోయేటట్లు ఓంద్ర



హృషీకేశమునకు సమీపమున గంగానదిమీద వంతెన "లక్ష్మణఝూలా"
ఫొటో: ఎస్. ఎన్. పెండ్యాల—అవపాడు.

అవధాని ఒక్కడే ఒకసారి చూడ్డానికి వచ్చాడు.

పెట్టగాడిదలా, గందరగోళం చేసింది ఆయన కారు... అన్నపూర్ణయ్యగారి బరువైన శరీరం కారులో పక్కగానే రాదారిపడవలా ఊగుతూ కారు కదిలిపోయింది.

రాధమ్మకు మనోవ్యాకులత హెచ్చయింది. తినయింట్లో భోజనం చేస్తున్న ప్రకాశాన్ని సరిగా చూడకపోవడంవల్ల యీ రోగం వచ్చిందని యితరులు అనుమానపడతారేమో అని బాధపడసాగింది. తన కొడుకుతో సమానంగా ప్రకాశాన్ని చూసింది. ఏలోటూ చెయ్యలేదు. కాని ఈ జబ్బు ఎల్లా ప్రవేశించిందా అని బెంగపెట్టుకుంది రాధమ్మ.

ప్రకాశం మామూలుగా మాట్లాడుతున్నాడు. కాని డాక్టరు సలహా ప్రకారం మంచంమీదనుంచి కదలడం మానేశాడు చిట్టిబాబే మందులు తెచ్చి త్రాగించి సేవ చేస్తున్నాడు. ప్రకాశానికి లోపల ఒక బెంగ పట్టుకుంది. ఇంక సరిగా మూడు నెలలు లేవు స్కూలు ఫైనలు పరీక్షలు. పరీక్షలకు ఈవిడు కూర్చోగలనా లేదా అని దిగులు పెట్టుకోసాగాడు.

ఒకసారి డాక్టరును అడిగాడు సలహా. 'అవసరమైతే పరీక్షలుకూడా మానెయ్యవలసి వస్తుంది. ఆరోగ్యంకన్న ఎక్కువటోయి పరీక్షలు!" అన్నారు అన్నపూర్ణయ్యగారు.

ప్రకాశానికి జబ్బు చేసిందంటే బంధువులువచ్చి చూశారు. వారిలో అదే ప్రవర్తన - ముక్కుమీద వేలువేసుకుని జాలిగా మాట్లాడడం ప్రకాశానికి విసుగెత్తిపోయింది. సీతమ్మ, సుబ్బమ్మ, పైకి విచారం వెలిబుచ్చినా లోలోపల చాలా సంతోషించారు.

రాధమ్మ అవధానికి ఉత్తరం వ్రాసింది.

'కావలసినంత డబ్బు ఖర్చు పెడతా. రోగం మాత్రం నయం చెయ్యండి' అని ప్రాధేయపడ్డాడు అవధాని.


'నేను సర్వశక్తులా ప్రయత్నిస్తాను. ప్రమాదం దాటిపోయిందిలెండి. మీరేమీ బెంగపెట్టుకోనక్కర్లేదు' అని ధైర్యం చెప్పారు అన్నపూర్ణయ్యగారు.

'పోనీ నేను సెలవు పెట్టి కుర్రాడిదగ్గర ఉండనా' అడిగాడు అవధాని.

'అబ్బే ఎందుకండీ మీకంత శ్రమ! రెండు నెలల్లో చూడండి! ఉక్కుమనిషిలా చేసి పారేస్తాను' అన్నారు అన్నపూర్ణయ్యగారు.

అవధానికి కొంత ధైర్యం చిక్కింది. రాధమ్మకూడా వాగ్దానమిచ్చింది 'ఎవరూ ప్రత్యేకం ప్రకాశంకోసం విజయనగరం నుంచి రానక్కర్లేదు. నేను చూస్తా'నని.

'పరీక్షలకోసం బెంగపెట్టుకోకు. ఈ



పరవళ్లు

ఫొటో: కె. నాగలింగేశ్వరరావు—చాటపఱ్ఱు.

ఏడు కాకపోతే వచ్చే ఏడు వెడుదువుగాని' అని ప్రకాశానికి ధైర్యం చెప్పి అవధాని విజయనగరం వెళ్లిపోయాడు.

అవధాని డబ్బు బాగా యిస్తానని చేసిన వాగ్దానంతో మురిసిపోయి, ప్రకాశం విషయంలో చాలా శ్రద్ధ తీసుకున్నారు డాక్టరుగారు. రాధమ్మ బిల్లుఖర్చు చెల్లించడానికి రెండు నెలలు చేసినట్లు తన సొమ్ము ఆలస్యంగా ముట్టదని సంతోషపడ్డారు ఆయన.

తోడు మజ్జిగ, టమాటాలు, పచ్చి కూరలు, దంపుడు బియ్యపు అన్నం రెండు నెలలు పూర్తిగా తినిపించాడు ప్రకాశం చేత డాక్టరుగారు. వింత వింత మందులు త్రాగించారు. రెండు నెలలు కాగానే డాక్టరుగారు, అనుకున్న ప్రకారం ప్రకాశం గుండెకాయ చింప శక్యం కాని దళసరి ఎర్ర కాగితంలా తయారయిందని స్పష్టపర్చుకున్నారు.

ఇంక నెల్లాళ్ళ స్కూలు ఫైనలుపరీక్షలున్నాయని ప్రకాశానికి బెంగ ఎక్కువైంది. తనతోటి కుర్రాళ్లు బాగా చదువుకుని తనకన్న ఒక క్లాసు ముందుకుపోగలరని ఒక విషమైన మాత్సర్యం కలిగింది.

'డాక్టరుగారూ! నేను చదువుకోవాలండి! యీ ఏడు పరీక్షలకు వెళ్ళాలి' అన్నాడు ప్రకాశం దిగులుగా, లోలోపల బాధపడుతూ!

ప్రకాశం తప్పకుండా యీ ఏడు స్కూలు ఫైనలు ప్యాసుకావాలని పట్టుపట్టడానికి మరొక కారణం కూడా వుంది. తనకు స్కూలుఫైనలుకంటె ఎక్కువ చదువు అవధాని చెప్పించడేమో. ఆపక్షంలో ఎక్కడైనా ఉద్యోగం చూసుకుని తల్లిని, చెల్లెలు తమ్ముడిని, పోషించే భారం నెత్తిన వేసుకోవలసి ఉంటుందని గ్రహించుకున్నాడు. ఈ ఏడు పరీక్షకు వెళ్లకపోతే మరొక ఏడు అవధాని మామయ్యపై యింకా ఆధారపడాలి అని బాధపడ్డాడు. బంధువులంతా ప్రకాశానికి స్కూలుఫైనలు దాటి అవధాని చదువు చెప్పించడనే అనుకుంటున్నారు.

'ఏమైనాసరే! యీ ఏడు పరీక్షలకు కూర్చుంటా డాక్టరుగారూ!' ప్రకాశం కన్నీరు కార్చాడు.

'వెఱ్ఱి నాగమ్మా! ఎందుకురా ఏడుస్తావు' అంది రాధమ్మ.


డాక్టరు అన్నపూర్ణయ్యకు ప్రకాశాన్ని చూడగానే జాలివేసింది. అయినా అతడి ఆరోగ్యం మునుపటికంటె బాగా నయం అని ధైర్యం కలిగిన డాక్టరుగారు 'కుఱ్ఱాడు యింక చదువుకున్నా ఫర్వాలేదనుకున్నారు.

'స్కూలుకు వెళ్లకు. ఇంట్లోనే చదువుకోవాలి మెడికల్ సర్టిఫికేటు యిస్తా నువ్వు ఇంకా బడికి రాలేవని' అన్నారు డాక్టరుగారు.

ప్రకాశం చాలా సంతోషించాడు. మునుపే బాగా చదువుకున్న ప్రకాశానికి తిరిగి పుస్తకాలు ముట్టుకోగానే మునుపటి పాఠాలన్నీ గబగబ జ్ఞాపకానికి వచ్చాయి. కాని ఆఖరి క్షణాలలో చదువుకుంటున్న ప్రకాశం పరీక్షలలో తప్పకుండా తప్పుతాడని సుబ్బమ్మ, సీతమ్మ లోలోపల సంతోషించారు. ఎప్పుడూ ప్రకాశంతో ఫస్టుమార్కులకు పోటీ చేస్తున్న అతడి క్లాసుమేటు వెంకటేశం ఈసారి ఫస్టుమార్కులు తనవే అనే ధీమాతో చదివేయసాగాడు.

చిట్టిబాబు, ప్రకాశానికి అట్టే శ్రమ కల్గకుండా సపర్య చేస్తూ, అతడి సలహాలతో తనూ చదువుకోసాగాడు. ప్రకాశమంత తెలివైనవాడు కాకపోయినా, చదువులో సామాన్యమైన తెలివితేటలు చిట్టిబాబుకు ఉన్నాయి అందులో ప్రకాశం సాంగత్యం లభించాక, వాడి సలహాలు, సహాయంతో పరీక్ష తప్పకుండా ప్యాసయిపోతున్నాడు చిట్టిబాబు. ప్రకాశం చదువు ప్రారంభించగానే, కుఱ్ఱాళ్ళిద్దరు యీ ఏడు తప్పక ప్యాసవుతారని రాధమ్మ సంతోషంతో వాళ్ళని ఆశీర్వదించింది.

[ఇంకా వుంది.]



ఇరుగుపొరుగులు

ఇల్లిందల సరస్వతీదేవి

"ఏమయినా సరే-మనము ఇల్లు మారవలసిందే. ఈ ఇంట్లో నేను ఒక్క నిమిషమైనా ఉండలే"నని పట్టుబట్టుతుంది లలిత.

అద్దెకు తగినట్టుగా వసతిగల ఇల్లు ఎంత కాలమో వెదకితే గాని దొరికింది కాదు. అటువంటిస్థితిలో ఇల్లు మార్చమని పట్టు పట్టితే యజమాని ఏం చేయగలడు - విసుగు కోవటము తప్ప?

లలిత మాత్రము ఏం చేస్తుంది? తన సంసారానికి తగినట్లుగా నెలకొకసారి సామానులు తెప్పించుకుంటుంది. అవి బాగుచేసి చక్కగా డబ్బాలలో పోసి పొదుపుగా వాడుకుంటుంది. ఇంట్లో ఎక్కడి సామాను లక్కడ సద్దుకొంటుంది. ఇంటిని శుచీ శుభ్రముగా దిద్దుకొంటుంది.

వాళ్లది మధ్యతరగతి సామాన్య కుటుంబము. భార్యాభర్త లిద్దరూ పొదుపుగా వచ్చిన ఆదాయాన్ని వాడుకొంటారు. ఉన్నదాంట్లోనే వీలయినప్పుడల్లా ఇంటికి కావలసిన చిన్న-చిన్న వనిముట్లు లలిత అమర్చుకొంటుంది. పదిమంది విందుకు వచ్చినా సరిపడ్డ సరంజామా క్రమక్రమంగా కొనుక్కున్నది. ఏ వస్తువకూ ఇరుగుపొరుగులను అర్థించవవసరము లేకుండా చేసుకొన్నది.

లలిత పెనిమిటి అయినా అంతే; కొంతమందికి వారానికి రెండు సినిమాలు చూసే అలవాటు ఉన్నట్లే, అతడికి వారానికి ఒక కొత్త పుస్తకమయినా, మంచిది కొని, తన అలమారీలో పెట్టుకొనే అలవాటు. ఏరి ఏరి మంచి గ్రంథాన్ని కొంటాడు; దానిని జాగ్రత్తగా చదువుతాడు; అలమారీలో భద్రపరచుకొంటాడు. పత్రికలను కూడా అంతే. చదవగానే రోజువారీగా అమర్చి భద్రపరుస్తాడు. వాటిలో మంచిమంచి వ్యాసాలేవైనా ఉంటే, కత్తిరించి ఫైలుల్లో పెట్టుకొంటాడు. వీటినన్నిటినీ ఆస్తిగా ఎంచుకొంటాడు.

"నేను నెలకని తెప్పించుకొన్న సామాన్లు మధ్యలోనే అయిపోయాయి." అని లలిత అంటుంది. "నా పుస్తకాల అలమారీ అంతా క్రిందు మీదులయింది. పాతిక రూపాయలు పెట్టికొన్న పుస్తకమంతా పిచ్చి గీతలతోను, సగము చినిగిన పేజీలతోనూ మణిగిపోయింది. నిన్నటి పత్రికలో పడ్డ వ్యాసము చూద్దామంటే ఆ పత్రిక యథాస్థానము లోనే కాదు—ఇంట్లోనే లేదు. పదిరోజుల క్రింద తీసుకొని పోయిన పుస్తకము ఇంకా ఆయన వాపసు ఇవ్వలేదు. ఇస్తాడో—ఇవ్వడో!" అని లలిత పెనిమిటి సాంబశివ రావుకు దిగులు.

"చూడండి ఆ కాఫీ మెషీను ప్రూక్కు అంతా పాడయిపోయింది. కత్తెరకు మొనలు విరిగిపోయాయి. సూది దారము అవసరానికి మన యింట్లో ఉండదు. పైగా మంచిమాటలతో జాకెట్లు, పరికిణీలు కుట్టించుకొని పోవటము - అవతలికి వెళ్లి వంకలు పెట్టటమూ బాగుందా? ఇటువంటి పొరుగున నేను ఉండలేనండీ!" అని అంగలారుస్తుంది లలిత.

సాంబశివరావు మాత్రము ఏం చేస్తాడు? ఏ బస్తీకి పోయినా, ఏవాడకు పోయినా, ఇట్లాగే ఉంటుందాయెను వ్యవహారము! ఇరుగు పొరుగుల ఒత్తిడి!

ఉదయము పనిపందడిలో ఉండగా "పిన్నిగారూ! ప్రొద్దున్న ఆయన బజారుకు వెళ్లేటప్పుడు చెప్పటము మరచిపోయాను; ఇప్పుడు వెళ్లమంటే వెళ్లరు - పైగా కోపము చేస్తారు. ఈ పావుతో వేరితమక్క ఇస్తారూ? మావారు తీసుకొనివచ్చినతరువాత ఇస్తాను" అంటూ క్రొత్తగా కాపురానికివచ్చిన గృహిణి అడిగితే ఏయిల్లాలయినా విసుక్కొని త్రిప్పి పంపుతుందా?

"అల్లాగా అమ్మా! దానికేం భాగ్యము? ఒకపావు కాదు - నాలుగుపావులు తీసుకొని వెళ్లు. నిదానంగా ఇవ్వచ్చు" అని అడిగిన

దానికి ఇబ్బేడుఇచ్చి పంపుతుంది ఎంతో ఆహ్లాదముతో.

మొదట రెండుమూడుసార్లు ఎంతో ఆప్యాయంగా అడిగినదే మహాభాగ్యముగా - అందరికీ అవసరాల నేవి ఉంటాయనిగుర్తించి ఇస్తుంది. కాని నాలుగోసారి అడగటానికి వచ్చిన గృహిణిని చూడగానే "అమ్మాయీ! చూడమ్మా ఏవస్తువైనా రేపటికి అయిపోతుందనగా ఈదినమే జ్ఞాపకముంచుకొని తెప్పించుకోఅమ్మా. మాదయినా నలుగురు గల ఇల్లుకదూ - అన్నివేళలా చేతినిండా ఉంచేవు" అని అడిగినదానిలో సగముకూడా యివ్వలేకపోతుంది.

ఇటువంటి సంఘటనలు మూడు నాలుగైన తరువాత ఇరుగుపొరుగులకు ఏమనిపిస్తుందంటే "వాళ్ళయింటికి వెళ్ళటమంటేనే అసహ్యము. ఏదో పొరుగునఉన్నారుకదా - అని బదులడిగితే, ఆవిడ - అడగనిసలహాలను నోటినిండా చెప్పటమెందుకేమిటి? అంతమాత్రం మనకు తెలియదా ఏమిటి? అయిపోకముందే సామాన్లు తెప్పించుకోవాలని తినకేనా - మనకూ తెలుసు!" అని విరసముగా అనుకుంటూ మూతి విరుస్తారు. నోటికి వచ్చినట్లల్లా ఆడిపోసుకొంటారు.

ఒక్కొక్క ఇల్లాలికి సమయము తప్పి అడగవలసిన అవసరము వస్తుంది. బంధుమిత్రుల రాకపోకలతో వంటయింటి సామాను ముందుగానే అయిపోతుంది. తీరా సమయానికి బజారుకువెళ్లి తెచ్చేవాళ్లు ఉండరు. ఇంటికి బజారు దూరముగా ఉండటముకూడా ఆటంకముగానే ఉంటుంది. ఈ సమయములో ఇరుగు పొరుగులను అర్థించటము ఆక్షేపణీయముకాదు. కాని ఒక్కొక్క ఇల్లాలు నెలలో సగము ఇరుగు పొరుగులమీదనే ఆధారపడటము గృహిణుల అనుభవములోనిదే. "ఆఁ! ఇప్పుడు బజారునుంచి తెప్పించుకోకపోతే ఏమి? కాస్త ఎవరింటికయినా వెళ్లితే, ఇవ్వకపోతారూ?" అనుకుంటారు. ఈ రకమువారిది 'అవసరముకంటె, అలవాటుగా బదుళ్లకువెళ్లే స్వభావమని మనము గ్రహించుకోవచ్చు. తెచ్చిన వస్తువులను తిరిగి ఇవ్వటములో, కొంతమంది విచిత్రముగా ప్రవర్తిస్తారు. 'ఈ కాస్త దానికి మళ్ళీ పంపితే నా ళ్ళేమనుకుంటారు? పోనీలే' అని కొందరు ఇవ్వటమే మానుకోవటము కూడా ఉన్నది. కొందరు 'తెచ్చినంతా ఇవ్వకపోతే కొంప మునిగిపోతుందా? కాస్త తక్కువైతే మాత్రము ఏం?' అనుకుని తగ్గించి ఇస్తూఉంటారు. కొందరు మేలురకం తెచ్చుకొని, సామాన్యమైనవి యివ్వాలని చూస్తే - ఇచ్చేటప్పుడు ఎట్లాఉన్నా, తీసుకొనేటప్పుడు మాత్రము 'మేలురకము కావాలని కొందరు కోరుకుంటారు. కొంతమంది మధ్య, మంచిచెడ్డలలో అభిప్రాయభేదము వచ్చి, తగాదాలు బయలుదేరితే, కొంతమందికి కొలతలలో తగాదాలు వచ్చి ముఖాలు చూసుకోకుండా మాట్లాడుకుంటారు.

కొంతమందికి వార్తాపత్రిక చదవనిదే నిద్రపట్టదు, కాని కొనకుండా పని గడుపుకోవటానికి ప్రయత్నిస్తారు. పత్రిక తెప్పించుకొనేవారింటికి పని పెటుకొని బయలుదేరివెళ్ళి చదువుకొని వస్తారు. సరిగా ఆసమయానికే, ఆ యింటి యాజమాని కూడా ఆ పత్రికను చదవాలనుకోవటము సహజము. పత్రిక రాగానే కాఫీ త్రాగుతూ మడత విప్పుతాడు. తాను చదివిన తరువాత ఇంకెవరు చదివినా, ఆయనకు అభ్యంతరము లేదు. కాని మర్యాదకు, ఎవరైనా పెద్దమనుష్యులు వచ్చి, పత్రిక కావాలంటే, తాను చదువుతున్నా, కొన్ని కాగితాలను తీసి ఇవ్వగలడు. కాని-ఈ మర్యాదను, సర్దుబాటును, ఆయన ప్రతినిత్యమూ చేయలేకపోవచ్చు. ఇటువంటివి రైలుప్రయాణములోనే చికాకనిపిస్తాయి చాలామందికి. ఆ స్థితిలో ఇంట్లో ప్రతినిత్యమూ ఏమి ఓర్పుకోగలుగుతారు?

సాధారణముగా ఏ ఒకరింటికయినా పత్రిక వస్తే, ఆ చుట్టుప్రక్కల నలుగురయిదుగురయినా, కనీసము చదివి దాని ఉపయోగము పొందుతూ ఉంటారు. వార్తాపత్రికను చదవాలన్న తహతహ ఆ రోజు మటుకే ఉంటుంది. మరునాటికి దానిని తలచుకునేవారు లేరు. ఆ ఒక్క రోజులోనే, తాము ఉపయోగించుకొన్న తరువాత, ఇతరులకు ఇవ్వటములో ఔదార్యము అందరికీ ఉండవలసినదే. కాని అడిగేవారు సమయాసమయాలు గమనించటమువల్ల సభ్యతను కాపాడుకున్నవారవుతారు. ఈ రోజుల్లో పఠనాలయాలు అనేకంగా స్థాపింపబడి, వార్తాపత్రికలు అందరి అందుబాటులో ఉన్నప్పటికీ, ఇక్కడ అక్కడ పత్రికలను అడిగి తీసుకొని, చదివేవారు మనకు ప్రత్యక్షమవుతూనే ఉన్నారు.

గ్రంథాల విషయము కూడా అంతే. 'పుస్తకం, వనితా, విత్తమ్' ఇతరులచేతబడి తిరిగి రావటము సాధారణముగా జరగదు - ఒకవేళ జరిగినా పుస్తకము చినిగి, నలిగిపోయి ఉంటుంది; వనిత శంకితగాను, విత్తము కిస్తీలలోను చేరుతుందని ప్రసిద్ధి. పురుషులలో తీసుకొని వెళ్లినవారు ఇవ్వటము తటస్థించితే మంచి స్థితిలో ఇస్తారు. కాని స్త్రీలలో చాలామంది మంచి స్థితిలో పుస్తకాన్ని తిరిగి యివ్వలేరు. చదువుతూ చదువుతూ, ఎక్కడ బడితే అక్కడ, పుస్తకాన్ని పెట్టడము చాలామందికి అలవాటు. ఆ సమయాలలో పిల్లల చేతులుపడి, పేజీలు తుంపులయిపోవటము సర్వసామాన్యము; అట్టలు ఊడిపోవటము నిత్యసత్యము. ఆ స్థితిలో వాపసుతీసుకొన్న ఇల్లాలి ముఖము జేవురిస్తుంది. అందులో ఆ యిల్లాలు కాస్త జాగ్రత్తకలది అయితే ఇటువంటి వాటిని అసలే ఓర్చుకోలేదు.

★ ఇరుగుపొరుగులు ★

ఇలాగే, డబ్బు విషయము కూడా. నెలాఖరు వచ్చేసరికి చేతిలో డబ్బు తక్కువవుతూ ఉంటుంది చాలా మందికి. చిల్లర ఖర్చుల కోసము బదుళ్ళకు బయలుదేరక విధి లేదు. 'ఒక పదిరూపాయలు ఉంటే సర్దు. నా చేతిలోకి రాగానే యిస్తా'నంటే దగ్గర పెట్టుకొని ఇవ్వనని ఎవరో గాని అనలేరు. కష్టసుఖాలు సంసారాలలో సామాన్యమే ననుకుంటారు. కాని కొందరికి, మనిషిని చూస్తేనే అనుమానము. ఉండికూడా యివ్వలేక పోతారు. కొందరి అదృష్టము అదేమిటో గాని, జాలిగుండెతో అడగగానే యిస్తారు. కాని తిరిగి వారి చేతిలోకి రావటము అరుదైపోతుంది. చాలామందికి బదులు తెచ్చి అవసరము గడుపుకొన్న తరువాత, తిరిగి ఇవ్వడమంటే అశ్రద్ధ—అలసత కలుగుతూ ఉంటుంది. తిరిగి యిచ్చేవరకు కొందరి విషయంలో నమ్మటము కష్టము. ఇటువంటి సందర్భాలలో మర్యాద పోగొట్టుకుంటారు చాలామంది. కొంతమంది ఇచ్చినా నాలుగైదు కిస్తీలలో—బిచ్చము యిచ్చినట్టుగా యిస్తారు.

స్త్రీలలో కొత్త పరిచయము ఎక్కువ కాగానే వారే వీరు వీరే వారుగా మెలగే సంభవము ఎక్కువగా ఉంటుంది. వారి చీరెలు రవికలు వీరు, వీరివి వారు వాడుతూ ఉంటారు. పెళ్ళిళ్ళకు పేరంటాలకు వెళ్ళేటప్పుడు చీరలే కాకుండా నగలుకూడా ఎరువు తెచ్చుకోవటము సామాన్యమే. ఒంటి నిండా నగలు పెట్టుకొని పెద్ద పట్టుచీర కట్టుకొంటే, మర్యాద, గౌరవము ఇనుమడిస్తాయన్న విశ్వాసము సంఘములో పాతుకొని పోయింది. ఈ బాధకోసము ఎరువు తెచ్చుకొన్న వస్తువులలో కొన్ని, సందడి సమయాలలో పోవటముకూడా సంభవమే. ఎరువుసొమ్ము బరువు చేటే కాకుండా-అప్పుల చేటవుతూ ఉంటుంది. అందుకే మగవాళ్ళకు ఆడవాళ్ళ అలంకరణ అంటే మనసులో పెద్ద భయము. ఇలా నగలు చీరెలు అడగగానే ఇవ్వకపోతే కొంతమందికి కోపము వస్తుంది. కొంతమందికి ఈవిధముగా తమ వస్తువులు నలుగురికంటబడి తమకు ఘనతను చేకూరుస్తాయని నమ్మి అడిగినదే చాలని యిస్తారు. సామాన్యులకు ఇవ్వటములో లేని ఘనత, గొప్పవాళ్ళకు ఇవ్వటములో కొంతమందికి కనబడుతుంది. ఇది మెరమెచ్చులకే అయినా, తిరిగి రావటములో సందేహము ఉండదు. కొంతమంది స్త్రీలకు, తమ వస్తువులు బట్టలు ఇంకొకరు ఉపయోగించటము ఇష్టము ఉండదు. దీనిని ఒంటెత్తు గుణముగా చాలామంది భావించినా - బట్టల విషయములో ఆరోగ్యదృష్ట్యా అంతమంచిది కాదు.

కొంతమంది స్త్రీలను ఇటువంటి చిన్న చిన్న కోరికలు ఊరికే పీడిస్తూ ఉంటాయి. వీటిని తీర్చుకొనే అవకాశము లభించకపోవటముతో నైరాశ్యానికి లోబడిపోతారు. మనోనిగ్రహము లేనివారు ఇతరులవి కాసేపు ఉపయోగించి తమ మనసులను తృప్తిపరచుకోవాలని చూస్తారు. ఇది దురభ్యాసము క్రిందికే వస్తుందికాని ఈ మాటంటే చాలామందికి కోపము.

కొన్ని వస్తువులు ఇచ్చేవాళ్ళకు ఇవ్వాలని ఉన్నా, మాట దక్కటము కష్టమనిపిస్తుంది. గ్రామఫోను ప్లేట్లు, గాజుసామాను, ఐస్క్రీము మెషీను, కుట్టుమెషీను, కాఫీగింజల మర సామాన్యముగా మాట దక్కనీయవు. గాజుసామాను పగిలిపోతే కొందరు ఊరికే కొనియివ్వకుండా - 'వాళ్ళేమనుకుంటారోనని కొనియిచ్చాము'ని చెప్పుకుంటారు. దీనిలో అవతలివారు అసాధ్యులన్న అర్థము వస్తూనే ఉంటుంది. 'కాని ఇవ్వకపోతే ఏమిలెండి' అని కొంతమంది సర్దుకొంటారుగాని, కొందరికా పట్టింపు లేదు.

అందరి స్వభావమూ ఒక్కమాదిరిగా ఉండదు. కొంతమందికి ఎవరికైనా పని చెప్పటమంటే మనసు కటకట పడుతుంది. గత్యంతరము లేకపోతే దానికి పాల్పడుతారు. కొందరికి ఆ యిబ్బంది లేదు. ముఖమాటముకూడా తక్కువగానే ఉంటుంది. "ఏమండీ! మీదగ్గర బట్టలు కుట్టే మెషీను ఉన్నట్లుందే నాకు నాలుగు రవికలు కుట్టిపెడుదురూ! దర్జీవాడు సరిగా కుట్టటము లేదు; పైగా నెలకన్నా ఇవ్వడు' ఈ మాటలు చాలామంది స్త్రీల నోటివెంట దొర్లుతూ ఉంటాయి. దర్జీవాడు సరిగా కుట్టకపోవటమూ, వేళకు ఇవ్వకపోవటమూ అన్ని వేళలలో, అందరి విషయములో నిజమవటానికి వీలు లేదు. ఎదటి ఆమె దగ్గర మెషీను ఉండటమూ, ఆమె చేతిలో పనితనము ఉండటము, అన్నిటిని మించి ఆమెతో పరిచయము కలగటమూ వల్ల వాటి లాభాన్ని తాను పొందేవరకూ - అందులో ఉచితముగా - మనసు ఊరుకోదు. పండుగ రాగానే, నాలుగు బట్టలు ఆమెమీద పడేసి, పిల్లలకు తెల్లవారేసరికి కావాలని పురమాయించేవారుకూడా ఉన్నారు. పాపము - మెషీను కొనుక్కున్న పాపానికి - ఆ పొరుగున ఉన్నందుకు, పనులన్నీ మానుకొని, ఆ బట్టలు ముందర వేసుకొని గంటలకొద్దీ కాలము గడపేవారున్నారు. ఆ బట్టలన్నీ తొందరగా కుట్టటమే కాదు—దర్జీకంటే బాగా కుట్టి, గుండీలు పెట్టి, ఇస్త్రీ చేసి అందించాలి. వీటిలో దేనిలో లోపము వచ్చినా, ఆమెకు కుట్టటము రానట్లే లెక్క. ఒకవేళ ఆమె కృతార్థురాలైనదా - మరొక పండుగకు మళ్ళీ మోపెడు సిద్ధము. కొంతమంది ఇరుగు పొరుగులచేత 'మంచి' అనిపించుకోవాలని. ఇంటిపనులన్నీ వదలిపెట్టి, ఆ పనులే చేస్తూ ఉంటారు. చివరకు వాళ్లు, 'మంచి' అనకపోతే విచారపడేవాళ్లు చాలామంది ఉన్నారు.

ఎవరింట్లో అయినా, పూలచెట్లు చెట్లు పాదులూ ఉన్నాయంటే వాళ్లకు మంచిపేరు రావటము కష్టము. కూరగాయలను, పూలను తమకు లేకపోయినా, ఆ వాడవాడా, పంచిపెట్టితే గాని మంచిపేరు రాదు. ఒకవేళ ఆ యింటిలోనే పదిమంది పిల్లలు పెద్దలు ఉండటము తటస్థించి, ఇతరులకు పంచే అవకాశము లేకపోయినా - 'పిల్లికయినా బిచ్చము పెట్ట'రని పేరు పడుతుంది. వాళ్ళ మంచితనానికి లోపము ఏర్పడిన దన్నమాటే. ఈ విధముగానే పాడి ఉన్నా, పంట ఉన్నా ఈబాధలు తప్పవు.

ఇతరులకు లేనివి ఏవి తమకున్నా దృష్టి తగులుతుందనే భయము చాలామందికి ఉంటుంది. ఏది చెడిపోయినా ఆ కారణాన్నే బలబరుచుతూ ఉంటారు. పొరుగింటివాళ్ళకు సహనము లేకపోవటము దీనికంతకూ కారణమనుకుంటారు. ఈ విషయములో పిల్లలు గల యిల్లాండ్రు కొందరు సంతానములేని దంపతుల విషయములో ఎక్కువగా అనుకుంటారు. పిల్ల ఏడ్చినా, తుమ్మినా, జ్వరము తగిలినా 'ఆ పొరుగింటివాళ్లదృష్టే' ననుకుంటారు. పాడికుండను, పూలచెట్లకు, చెట్లపాదులకు 'పాపిష్టికన్ను' పడకుండా కాపాడుకోవటానికి ఎన్ని బాధలో పడతారు. కొంతమంది ఇతరుల అదృష్టానికి ఓర్వలేక ప్రయోగాలు చేయించాలని వాటిని సాధన చేసేవాళ్ళని వెదకుతూ ఉంటారు. నిజముఉన్నా లేకపోయినా అనుమానాలతో బాధపడేవారు చాలామంది. కర్తవ్యాన్ని మరచి వాటిని పట్టుకునే జన్మ అంతా సాధించేవాళ్లు లేకపోలేదు. ఇతరులమీద అనుమానాలు అపోహలు అనుశ్రుతముగా కొందరికి అబ్బుతూ ఉంటాయి.

కొంతమందికి తమకువచ్చినవిద్య ఏది గాని ఇతరులకు చెప్పటానికి ఇష్టముండదు. కుట్టుపని నేర్పమని ఎంత వెంటబడ్డా ఇరుగు పొరుగులను తప్పించుకొని తిరుగుతూనే ఉంటారు. రకరకాల స్వెట్టర్లు అనేకరకాల కుట్టుపనులు తమదగ్గరఉన్న వాటిని ఇతరులు చూసి ఆనందించి తమను అభినందించుచూ ఉండాలి;

కాని వాళ్ళుకూడా నేర్చుకోవటము గిట్టదు. వాళ్లు నేర్చుకుంటే తమ ప్రత్యేకత ఏముంటుంది గనుక! సామాన్యమైపోరూ?

కొంతమంది తమ పిల్లలు తమ ఇంట్లో అల్లరి చేయకపోతే చాలనుకుంటారు. తమ యింటి వరకే తమ బాధ్యతగా భావిస్తారు. ఆ పిల్లలు ఇంట్లో ఉన్నంతసేపూ ప్రాణాలను బిగబట్టుకొని, బయటికి రాగానే అల్లరి ప్రారంభిస్తారు. ఇరుగు పొరుగు పిల్లలను అగుపు చేయడానికి — ఏమయినా అనటానికీ అందరికీ నోరు రాదు గా! అల్లా అని ఓర్చుకోలేరు. పెట్టుకొన్న వస్తువులన్నీ తీసి పడవేస్తే ఏ ఇల్లాలు భరించగలదు?

ఇరుగు పొరుగు పిల్లలతో సతమత మవుతూ తన అమూల్యమైన సమయాన్ని వృధాగా గడపటానికి కొందరు ఇష్టపడరు. పిల్లలలో అనేక రకాలు. తోడు దొరకగానే కొంతమంది పిల్లలు విపరీతమైన అల్లరి చేస్తారు. అది కలయికవల్ల కలిగే మార్పు - సందలనమూ గాని ఇద్దరి తప్పూ కాదు. 'మా వాళ్లు మంచివాళ్ళే గాని - వాళ్ళ పిల్లలు నేర్పుతున్నార' నే మాటలు అన్నివేళలా నిజాలు కావు. కొందరు పిల్లలు చేతికందినవి పట్టుకొనిపోయే స్వభావము కలవారు ఉంటారు. ఎంత జాగ్రత్తగా ఉన్నా ఏదో జరుగుతూనే ఉంటుంది. పిల్లలు పిల్లలు తగాదాలు పడుతూ ఉంటారు - పెద్దవాళ్లు మనస్తాపాలు పెంచుకొంటారు. పిల్లల తగాదాలలో పెద్దవాళ్లు మాట్లాడుకోవటము మానుకోవలసి వచ్చిన పరిస్థితులు కూడా ఏర్పడుతూ ఉంటాయి.

మన మెంత మంచిగా ఉన్నా ఎవరి దృష్టి కెటువంటి అభిప్రాయమేర్పడుతుందో చెప్పటము చాలా కష్టము. కొంతమందికి పొరుగింటి ఆమెను పొగడటము మంచి అనటము గిట్టదు. అందులో తాను తప్ప ఇతరులు అనటము అసలే గిట్టదు. ఎవరు కాస్త పొగడినా కర్ణకఠోరమయి - ఏ నేరమయినా వెదకి ఆమెమీద ఆరోపిద్దామనిపిస్తుంది. ఇలా కొంతమంది నిరపరాధులు ఇతరుల దృష్టిలో చెడ్డవారవుతూ ఉంటారు.

ఇరుగు పొరుగులతో ప్రవర్తించటము ఎటువంటివారికీ కత్తిమీద సాము గానే ఉంటుంది. కొంతమంది లౌకికముగా ఏ వస్తువయినా అడగటానికి వచ్చినవాళ్ళతో 'మాపెండి. దీపము పెట్టితే ఇవ్వగూడదండీ. ముఖ్యముగా కొచ్చు, సున్నము, ఉప్పు ముట్టుకోకూడదండీ' అంటారు. శుక్రవారం డబ్బు ఎవరికీ ఇవ్వరు. కాని తీసుకోవటములో అభ్యంతరము లేదు. డబ్బు కూడా దీపము పెట్టిన తరువాత ఇవ్వకూడదు — ఇత్యాది నియమాలను ఏర్పరచుకుంటారు. ఏ వస్తువయినా ఇవ్వటము ఇష్టము లేకపోతే, తియ్యటి మాటలతో సర్ది చెప్పుతూ 'లేదండీ - ఉంటే ఇవ్వనూ?' అంటారు. కొంతమంది లేదనటానికే మనసు ఎంతో నొచ్చుకొన్నట్టు మాట్లాడుతారు. ఆ కారణముచేత ఇరుగుపొరుగుల మాటలలో ఉన్న సత్యములో ఎంత నిజము ఉన్నదో తేల్చటము కష్టము. ఈ కష్టాలు పురుషులకంటె స్త్రీలకు ఎక్కువ. కనుక స్త్రీలు ఇతరుల మాటలను వెంటనే నమ్మరు.

ఇరుగు పొరుగుల సంఘర్షణలు స్త్రీలలో వ్యాపకము తక్కువయినకొద్దీ అధికమవుతూ ఉంటాయి. ఇది ఏ ఒకరిద్దరు సంస్కరింపబడిన మాత్రాన సర్దుకొని పోయే సమస్య కాదు — సామూహికముగా సంస్కరింపబడవలసిన సమస్య. ఆ స్థితిలో లలితవంటి వనితలు ఇల్లు మార్చినంత మాత్రాన సమస్య పరిష్కారము అవుతుందనటానికి వీలుందా తప్పించుకొని ఎవరికి వారు మసులుకోవటము తప్ప? ★

వనితాలోకం:

శిశువులపై పరిసరాల ప్రభావం

గుడిమెళ్ళ బాలా త్రిపురసుందరి

పిల్లలకు విద్యాబుద్ధులు గరపి వారిని గొప్పవారినిగా చేయుట ఒక కళ. మాటలురాని పసిపాపలు కూడ వాతావరణమువలన ప్రభావితులౌతారు. మనలో చాలామంది చంటిబిడ్డలు ముద్దులొల్కు జంతుసమానులని ఊహిస్తూ ఉంటారు. ఎత్తుకొంటే ఏడ్పు మాని, క్రిందకి దింపితే ఏడ్చే స్వసుఖానికి పసికూనలు పాకులాడుతారని సాధారణంగా అనుకుంటూ ఉంటారు. కాని ఇది పొరపాటు అభిప్రాయము. వారి వారి జీవితములను మార్చగల ముద్రలను మనుష్యులు శైశవావస్థయందే గ్రహిస్తారు. అర్థాలలోని శిశువుపై గృహవాతావరణ ప్రభావము ఎక్కువగా పడుతుంది. ఇంటిలో తల్లిదండ్రులు సామరస్యము కల్గియుండి మృదువుగా, మధురముగా మాట్లాడుకొంటూ ఉంటే ఆ యింటిలో పెరిగిన శిశువు సాధు స్వభావుడు, ఓజస్వి, అమృతరూపుడు ఔతాడు. ఇంటిల్లపాది పెద్ద పెద్ద అంకెలు, బొబ్బలు, పొలికేకలు తరచుగా వేస్తూఉంటే, ఆ వాతావరణంలో పెరుగు శిశువు దురహంకారుడు, క్రోధ స్వభావుడు, డాంబికుడు అవుతాడు. ఏ ఇంటిలో తరచుగా స్త్రీలు ఏడుస్తూ ఉంటారో, ఆ ఇంటిలో పెరుగు పిల్లలు బహుధా నీరసులుగాను, గుండెదుడుకుగలవారుగాను ఉంటారు. ఎల్లప్పుడు ప్రేమపూర్వకమగు మాటలు, కోమలమైన ధ్వనులు వినుచుండు శిశువులు పెరిగిన తరువాత కోమలస్వభావులవుతారు. భక్తి, ప్రేమ, విశ్వాసము మొదలగు ఉదాత్త భావాలు వారి హృదయాలలో బాగుగా నాటుకొంటాయి.

పిల్లలు దుర్వృత్తులలో తగులుకొంటే దానికి చాలావరకు తల్లిదండ్రులదే బాధ్యత. పిల్లలు సచ్చరిత్రులగుటకు తల్లి దండ్రులు సన్మార్గంలో నడవాలి. మృదువుగ, నెమ్మదిగా మాట్లాడాలి. తల్లిదండ్రుల సంస్కారాలే చాలవరకు పిల్లలకు సంక్రమిస్తాయి.

తల్లిదండ్రులు మంచివారైనా, ఒక్కొక్కప్పుడు పిల్లలు చెడ్డవారౌతూఉంటారు. దీనికి కారణం చెడు సాంగత్యం. గడపదాటలేని వయస్సున మంచి ప్రవర్తన గల్గిన కొందరు శిశువులు, ఆటలు మరిగి తోడివారితో చేరగానే చెడిపోతూ ఉంటారు. ఈ కాలంలోనే బీడీలు, చుట్ట, సిగరెట్ కాల్చడం, పేకాట ఆడడం, అబద్ధాలు ఆడటం, బొంకడం పిల్లలకు అలవాటవుతాయి. అందుచే 4-10 ఏళ్ళ వయస్సులో పిల్లలను ఎక్కువ శ్రద్ధగా చూడాలి.

పిల్లలయందు ఎంతమక్కువ మనకి ఉన్నప్పటికి, చెడు అలవాటు మనకు కంటికి అగపడగానే పిల్లవానిని సరిదిద్దాలి. అంటే ఇంటిల్లపాదీ వానిని తిట్టి కొట్టాలని కాదు. దీనివలన పిల్లవాడు అందరికీ అలుసు ఔతాడు. వాని ఆత్మ గౌరవం నశిస్తుంది. ఏ పరిస్థితిలోనూ పిల్లవాని ఆత్మగౌరవం నశించేటట్టు చూడకూడదు. కాని చెడు అలవాటును మనం గర్హించాలి. దీనికి కొంత నేర్పరితనం ఉపాయం అవసరం. పిల్లవాడు అబద్ధమాడాడనుకోండి. వెంటనే పిల్లవానికి అబద్ధమాడుటవలన వాని నోరు పాడైపోయినదనే భావం మనం కల్గించాలి. వెంటనే వానిని ఎత్తుకొని 'మావాడు అబద్ధమాడాడు. నోరు పాడైపోయినద'ని నోటిని కడిగి, 4, 5 సార్లు పుక్కిలించి ఉమ్మి వేయించాలి. దీనివలన అబద్ధమాడితే నోరు పాడైపోతుందనే భావం చిరుతని హృదయంలో మొలకెత్తుతుంది. ఇది క్రమంగా హృదయానికి హత్తుకొనిపోతుంది. అల్లా హత్తుకొనిపోయిన తర్వాత జీవితంలో అతడు అబద్ధమాడుటకు వెరుస్తాడు. ★

వనితాలోకం:

లోకులంటే ఎవరూ?

"అక్కోయ్! సరోజ వాళ్ల పాపని అమ్మేసిందిలాగుందే! మామ్మతో ఎవరో చుట్టాలింట్లో దిగబెట్టేనని చెప్తోంది. ఇన్నాళ్ళూ లేని చుట్టా లిప్పుడెక్కణ్ణించి ఊడిపడ్డారో!" అంటూ వగర్చుకుంటూ ఒక్కగుక్కలో చెప్పేసింది మా చెల్లి. నేను అల్లుతున్న స్వెట్టరు క్రింద పడేసి "ఉమా! రావే! చూద్దాం!" అంటూ మా చెల్లి చెయ్యి పట్టుకుని పరిగెత్తేను. ఇద్దరం సరోజ ఇంటి గోడప్రక్క నిలబడి చెవు లప్పగించేము.

"అయితే అమ్మాయీ! వాళ్లింట్లో దిగబెట్టేనంటున్నావు కదా! పసిబిడ్డ పాలకేడవదమ్మా! అప్పుడే నువ్వొచ్చి రెండుగంటలవుతోందా మరీ. అయినా అదేం పోద్యమమ్మా? కొన్పుకి ప్రాణంమీదికొచ్చినా ఊఁ ఆఁ అనని చుట్టా లిప్పుడెలాగ ఊడిపడ్డారమ్మా! అంతా విచిత్రంగావుందికానీ ......" అంటోంది మామ్మ.

"మరేం లేదండీ మామ్మగారూ! మరి... మా...పిన్న...మ్మకి నేనంటే తగని ప్రేమండీ ... పాపని చూసి వదల్లేనంటే నమ్మండీ. ఆయన రాగానే మే...మిద్దరం కలిసి వాళ్ళింటికి వెళ్ళిపోతాము" అంటూ సన్నగా నూతులోంచి వినబడినట్లు సరోజ గొంతు వినబడింది.

'దీని శార్ధ మేమీకాదూ! పిన్నమ్మట... సిగ్గులేన్ది ... పదవే! ఏమిటి వింటావూ? ఇలాంటివి వింటే పాపంకూడా వస్తుంది. పద' అంటూ గోడదగ్గరే చెవిపెట్టివింటున్న మా చెల్లెలిని బరబరా ఈడ్చుకెళ్ళేను. దీనికసలే బుద్ధిలేదు. ఆ సరోజ అలాంటిదని తెలిసినా ఇంకా దానివెంటే తిరుగుతుంది. వద్దంటే వినదు. సావాసదోషం. మునిగిపోయేవాడు తనకి సహాయంచెయ్యడానికి వచ్చినవాణ్ని ముంచెసినట్లు...

సరోజ నిజంగానే పాప నమ్మేసిందా?

"ఏమే ఉమా! పాపని ... అమ్మేసిందంటావా?" అన్నాను నెమ్మదిగా.

"నిజమే అక్కయ్యా! నిన్న గట్టిగా ఏడుస్తోందిగా అమ్మననీ. కానీ వాడు అమ్మితేనేకాని వీల్లేదు; అమ్మకపోతే నిన్ను విడచి వెళ్లిపోతున్నానని గట్టిగా చెప్పేసేడు. పాపం!" అంది. నాకాశ్చర్యం వేసింది. దీని కివన్నీ ఎలాగ తెలిసేయీ? దీని చదువు పాడుగానూ. అందుకేనా? నిన్న సరోజ ఇంటివైపునున్న కొట్టుగదిలో చదువు వెలగబెత్త! అనుకున్నాను.

ఇంతలోకి మామ్మ రుసరుసలాడుతూ సావిట్లోకి వచ్చింది. "ఏమిటి మామ్మా" అన్నా.

"ఆఁ ఏముందే? రాక్షసుల్లో పుట్టవలసిన ఛండాలురాలే అది. మనుష్యుల్లో తప్పబుట్టిందీ. చుట్టాలింట్లో దిగవిడిచిందట, చుట్టాలింట్లో. ఆమాట అనడానికైనా సిగ్గుండక్కర్లే! ... బంగారంలాంటి పిల్లాడ్నే, ఎలాగ చేతులొచ్చేయో అమ్మడానికి"...

"ఏమిటండీ మామ్మగారూ!" అనుకుంటూ సీతమ్మగారు వేంచేసింది. మా చెల్లి విసుక్కుండా అసలు సంగతంతా వివరించేసరికి "ఆఁ నేను చెప్పలేదుటండీ! నిన్నరాత్రి

యస్. గాయత్రి

ఒంటిగంటవరకూ హోరున దెబ్బలాడుకుంటూనేవున్నారాయనూ. అతను పిల్లాణ్ణి ఇచ్చేయమనీ, అది ఇవ్వననీనూ. అయితే ఆఖరికి వాడిమాటే నెగ్గిందన్నమాట! ఆఁ అయినా ఏం చేస్తుందీ ఆడకూతురొక్కర్తీనూ? వాడూ వదిలిపెట్టిపోతే దీని గతేం కానూ?" అంది జడ్జిలాగ తీర్పు చెప్తూ.

నాకు ఒళ్లు మండుకొచ్చింది. "ఏమండీ అయితే నాలుగు వందల రూపాయిలకోసం కన్నబిడ్డని అమ్ముకుంటారా? మళ్లీ ఏమిటో తల్లిప్రేమా...అదీ ఇదీ అని చెప్తారూ" అని నేననడమే తడవుగా "ఆఁ ఏమిటమ్మా ఊరికే అమ్మకుం దమ్మకుందని పదిసార్లు ఆడిపోసుకుంటున్నారూ. పెంపకమివ్వడానికీ దీనికీ తేడా ఏవిఁటి? కడుపుకక్కుర్తికొద్దీ నాలుగొందలు తీసుకోగానే అమ్మడమైపోయిందా ఏవిఁటీ? నెలరోజులబట్టీ పిల్లాడికి పాలూ అవీ లేక వాళ్లనీ వీళ్లనీ అడుక్కోవడంతోనే సరిపోతోంది. దాని దగ్గర మాత్రం పాలా దిబ్బా!! ఎన్నాళ్లనీ? చేతులారా పిల్లాణ్ణి చంపుకుని — వాళ్ళు చావడంకన్నా శుభ్రమైన చోట పిల్లాణ్ణి పడేసి ఆ నాలుగొందలతో నాలుగు నెలలపాటు కడుపునిండా తిండితింటే తప్పయినదా? హుఁ మనలాంటివాళ్ళందరినీ ఉద్ధరించింది. దీనికి అప్పు ఇవ్వలేకా మానలేకా చస్తున్నాము" అంటూ ఒక పెద్ద ఉపన్యాసం దంచేసింది. మే మెవరమూ మాట్లాడకపోవడం చూసి ఏమనుకుందో ఏమిటో "కాస్త నిప్పెడతారా? అబ్బాయికి కాఫీ పెట్టాలి. మాటల సందడిలో మరిచేపోయాను!" అని అడగడంతో మా మామ్మ ముందూ—ఆవిడ వెనకాల గరిటతోనూ—వంటింటివైపు నడిచేరు.

"కానీ పాపం చాలా బాధపడిందే ఆ పిల్లాడికోసం. నెల్లాళ్ళనుంచి ఒకటే పోరు! ఒకరోజు పాపం పాపని ముద్దెట్టుకుంటూ 'నా తండ్రికీ నాకూ ఇఁక ఎన్నాళ్లోకదా ఈ ఋణం!' అంటూ కంటతడిపెట్టుకుంది. నేను 'అదేవిఁటండీ?' అంటే 'ఏముందమ్మా! నాలాగే పెద్దవాడయ్యాక అమ్మనీ నాన్ననీ వదిలిపెట్టి వెళ్లిపోతాడేమోనని' అంది. నా కప్పుడా మాటలు అసందర్భంగా తోచినా ఏమీటో నమ్మేసేను. పాపం! ఇక కొన్నాళ్లలో కన్నబిడ్డని అమ్ముకోవలసివస్తుందని కాబోలు!" అని నా మొహంకేసి చూసి కాస్సేపు ఆగి మళ్ళీ మొదలెట్టింది ఉమ.

"అదివరకొకసారి మామ్మతో అందిట. ఏదో తన మొగుడు తననీ తన పాపనీ వదిలి వెళ్లిపోతే తనకూ బిడ్డకూ మన మామ్మే దిక్కని. మామ్మ ఆవిడ మాటల్ని సరిగా అర్థం చేసుకోకుండా తప్పుడుమాటలనకూడదని చెప్పి ఆవిడకే పాతివ్రత్యాన్ని బోధించి బుద్ధి చెప్పిందట. అంటే...ఒకవేళ పిల్లాణ్ణి అమ్మేయక ఆ మొగుణ్ణే వదులుకొని మన ఇంటిపంచని కాలం గడుపుకుందామనుకుందేమో! పాపం! మనంకూడా ఆశ్రయం ఇవ్వమని తెలిసి అమ్మేసిందేమో!"

ఇంకా ఇలాగే మా చెల్లెలి ధోరణి సాగిపోతోంది. ఇదెప్పుడూ ఇంతే. అస్తమానం దానిపక్షమే మాట్లాడుతుంది. మును పెప్పుడైనా ఇలాగ అనివుంటే నేను తప్పకుండా దానిమీద లేచేదాన్నే! కానీ సరోజ ఎంత బాధపడిందో కదా ఆ పాపని అమ్మడానికి, అనిపించింది నాకూనూ.

మొట్టమొదటిరోజు దీనవదనంతో సరోజ నిలబడ్డ దృశ్యం జ్ఞాపకమొచ్చింది. వచ్చినదగ్గరనుండీ ఆమె ముఖంలో చిరునవ్వన్నది ఎన్నడూ కనబడలేదు.

* * *

ఆరోజు మా చెల్లెలికి తెలుగు పరీక్ష. అరుగుమీద కూర్చుని గట్టిగా మనోరమా వృత్తాంతంలోని పద్యాలు రాగయుక్తంగా

ంచేస్తోంది. మామ్మ ప్రక్కింటి సీతమ్మగారూ అరుగుమీద బియ్యం బాగుచేసుకుంటున్నారు. నేను కొంచెం లోపలగా సావిడి గుమ్మంలో కూర్చుని జాకెట్టు కుట్టుకుంటున్నాను. మా ఉమ "మట్టెలు మ్రోయంగ" అని మొదలుపెట్టగానే నాకు పకాలున నవ్వు వచ్చి "అకేమిటే? పెళ్ళికాని మనోరమకి మట్టెలెలా మ్రోగేయే!" అన్నాను. మా ఉమ "అది పెద్దనగారి పొరపాటుట. దీన్ని మనం అంతగా విమర్శించకూడదని మా టీచరు చెప్పేరు" అని అందో లేదో ఈ సీతమ్మగారు "ఆఁ ఇప్పుడు పెళ్ళికాని పిల్లలంతా నల్లపూసలూ, కుంకం బొట్టూ మొదలెట్టేరండోయ్!" అని అందుకుంది. మా మామ్మ మాత్రం ఊరుకుంటుందా? "అంతటితో సరిపెడితే బాగానే వుండును. కర్మ" అంది. అంతలో దబదబమని ఎవరో వీధి తలుపు కొట్టేరు. ఉమ తలుపుతీసి వచ్చి నాదగ్గర నిలబడింది. బిళ్ళుమని తలుపు తోసుకొని ఒక నల్లటి శిలావిగ్రహం ప్రత్యక్షమైంది. "వీ డెవడేవ్! మనోరమావృత్తాంతంలోని రాక్షసుడిలాగ వున్నాడు" అంది ఉమ నా చెవిలో. నేనూ అదే ఆలోచిస్తూ చూస్తున్నాను. "ఈడ ఇల్లు అద్దెకిస్తారంట. ఇంటోర్ని కేకేస్తారా?" అన్నాడు వాడు. "చచ్చేంరా దేవుఁడా! వీడి కళ్ళు చూస్తేనే భయమేస్తోంది. వీడికా ఇల్లివ్వడం?" అనుకున్నాను మనస్సులో.

మా మామ్మ వివరాలన్నీ అడిగి తెలుసుకొని "బాబూ చుట్టూ బ్రాహ్మణ పొరుగు. మీరు మాంసం అవి తింటే......" అని అంటోంది. "మేము అవేవీ తినమండీ! నేను బ్రాహ్మలలో పుట్టినదాన్నే" అంటూ ఓ కిన్నెర కంఠం మ్రోగింది. అంతా అటు చూసేం. పచ్చని శరీరచ్ఛాయ, మెళ్లో నల్లపూసలూ, తెల్లని ఎలిగివ చీరా, నల్లని రవికా, చేతిని వెలిసిపోయిన రబ్బరుగాజులూ, నుదుట ఎఱ్ఱని బొట్టూ, రేగిన జుట్టుతో ఒక ఇరవై ఏళ్ళ గర్భవతి పొడగట్టింది మా కళ్ళకి. మా చెల్లి నాకేసి చూసింది, ఈ మనోరమ ఈ రాక్షసుడి కేమౌతుందో అన్నట్లు. మా భావం గ్రహించిందిలాగుంది ఆవిడ "నే నీయన భార్యనండీ" అంది కొంచెం విసుగ్గా. మా మామ్మ తెల్లబోయిందిలాగుంది. కొంచెం సంబాళించుకుని "రేపు ఏ సంగతీ చెప్తానమ్మా! అయినా ఇల్లు చూసి వెళ్ళండి. ఉమా! వీరితో వెళ్ళి ఆ ఇల్లు చూపించమ్మా!" అంది.

"మామ్మా! కొంపతీసి వీళ్ళకి ఇల్లిస్తావా ఏమిటి?" అన్నాను నేను వాళ్లను వెళ్ళనిచ్చి. "వాడు ఏ కులమో, అది బ్రాహ్మలదిట...అదేం చోద్యమండీ బాబూ! లేచి వచ్చేరేమో" అంది సీతమ్మగారు. అంతలో చిరునవ్వుతో మా ఉమ వచ్చేసింది. "ఏమిటే" అన్నా. "వాళ్లద్దరూ స్వరోచీ మనోరమలేనే" అంది. "మామ్మా ఇంతకీ ఇల్లిస్తానంటావా ఇవ్వనంటావా?" అంది ఉమ మామ్మతో.

"మామ్మోయ్! వాళ్లు లేచివచ్చినవాళ్ళలాగ వున్నారు. సంసార్ల మధ్య ఉండవలసినవాళ్ళు కారు...అదీకాక...వాళ్ళ తల్లీ తండ్రీ కేసులూ గీసులూ పెడితే మనం సాక్ష్యాలకి వాటికీ కోర్టుఎక్కవలసివస్తుంది. కర్మ! మన కెందుకీ లేనిపోని గొడవలు. ఇవ్వకు మామ్మా" అన్నాను నేను, ఎటూ చెప్పలేక ఆలోచిస్తున్న మామ్మతో.

"ఆఁ. నా కొమాత్రం తెలియదుటే. ఇవ్వనులే. అయినా బంగారబొమ్మలా వుంది. వాణ్ణి పట్టుకుం దేవిఁటో? అయినా ఈ సినిమాలు చూసి ఇలాగ చెడిపోతున్నారమ్మా" అంది మామ్మ.

"ఏమిటో మామ్మా! సినిమాలు చూస్తే మాత్రం చెడిపోతారా? మంచివాళ్లు దాంట్లో మంచిని తీసుకుంటారూ, చెడిపోయేవాళ్ళు చెడుని తీసుకుంటారు" అంటూ నేను ప్రతివాదం చేసేను.

* * *

ఆ మర్నాడు వాళ్ళు మళ్ళీ వచ్చేరు. మా మామ్మ ముందు ఇవ్వననే చెప్పింది. కాని సరోజ (ఆవిడ పేరు సరోజట) "మామ్మగారూ! మిమ్మల్ని చూస్తే మా అమ్మని చూసినట్లుంది" అని ఏడ్చేయగానే మా మామ్మ మనస్సు కరిగి ఇల్లిచ్చేసింది.

నేను రుసరుసలాడితే "నువ్వేకదూ! మంచివాళ్ళు మంచినీ, చెడ్డవాళ్ళు చెడునీ తీసుకుంటారని చెప్పేవూ? ఆ పిల్ల ఓ మూల పడివుంటే నీకేం బాధా? నీ కంతగా ఇష్టం లేకపోతే ఆ పిల్లతో మాట్లాడకు" అని నా నోటికి తాళం వేసేసింది.

మర్నాడు మా కొళాయిదగ్గర సీతమ్మగారు మహాలక్షుమ్మగారితో "ఆఁ. అంత జాలైతే ఏదో రెండు రూపాయలిచ్చి పొమ్మనాలిగానీ ఇంట్లో పెట్టుకుంటారా? పోనీ మనమాట వదిలేసేయండి. ఇంట్లో ఎదిగిన ఆడపిల్లలని పెట్టుకుని లేచొచ్చిన దానికి ఇల్లిచ్చుకుంటారా? ఏమోనమ్మా.." అంటోంది బుగ్గని వేలేసుకుని, బహుశా మా మామ్మ వినాలనే అయివుంటుంది. మహాలక్షుమ్మగారు "ఉష్. ఊరుకోండమ్మా! మన కెందుకొచ్చిన గొడవ. ఎవరంతటి వాళ్లు, వాళ్ళు!" అని అంటూంటే నా చెవిని బడింది.

ఇలాగే కొళాయిదగ్గర వ్యంగ్యంగా లేచొచ్చినదానికి మా మామ్మ ఇల్లిచ్చిందని నాలుగైదుసార్లు అమ్మలక్కలు వర్ణించుకున్నారు. కానీ మామ్మ ఏమీ లెక్కపెట్టలేదు.

సరోజ ఎన్నాళ్లవరకో ఇల్లు విడిచి ఇవతలికి వచ్చేదికాదు. అది డివతలికి వచ్చినప్పుడల్లా మా ఉమ తొంగితొంగిచూసేది. ఆవిడ కూడా ఇరుగు పొరుగువాళ్ళతో ఆట్టే జోక్యంచేసుకునేదికాదు. ఇలాగ అనడంకంటే ఇరుగుపొరుగులే ఆవిడతో మాట్లాడడానికి ఇష్టపడేవారు కాదంటే బాగుంటుంది. కానీ సీతమ్మగారు మాత్రం "వాళ్ళింట్లో వంటా దిబ్బా ఏమీ లేవులా వుంది. హోటేలునుంచి క్యారేజీ తెప్పించుకుంటారేమో!"అని ఒకరోజూ "ఇవాళ వాడింటికే రాలేదమ్మా. అదికూడా ఏమీ వంటా పెంటా వెలగబెట్టినట్లు కనబడదు" అని మరొకరోజూ, "ఏం తింటారో? ఎన్నడూ పెరుగుకానీ పాలుకానీ కొన్నట్లే కనబడదూ" అంటూ సరోజావాళ్ళింట్లో ఏంజరుగుతోందో సి. ఐ. డి లాగ గమనించి మా అందరికీ చెప్తూ వుండేది.

* * *

ఓరోజు మా ఉమ నాతో "అక్కయ్యా! ఓవిషయం చెప్తానుకాని కేకలెయ్యవుకదా" అని ముందుగా అభయం అడిగింది. "మరేం, సీతమ్మగారి కొడుకు ఇవాళ రోడ్డుమీద నిలబడి సరోజ ఇవతలికి రాగానే కన్నుగీటుతున్నాడేవ్. ఈలవేస్తూ పాటలుకూడా పాడుతున్నాడు" అంది నెమ్మదిగా. నేను నమ్మలేకపోయాను. పాపం! ఆయనెంతో మర్యాదస్తుడనే! మమ్మల్ని తన చెల్లెళ్ళలాగ చూస్తాడు. ఇదేవిఁటి? ఖర్మం చాలక ... ఆ సరోజకానీ ... ఇతన్ని బుట్టలో వెయ్యడానికి చూడ్డం లేదుకదా! "మరి అతను కన్ను గీటుతూవుంటే ఆ సరోజ ఏంచేసింది? ఏమైనా మాట్లాడిందా?" అన్నాను.

"ఛా! లేదే పాపం! తలొంచుకుని లోపలికెళ్లిపోయి గడియ పెట్టేసుకుంది"

నాకు అనుమానం వేసింది. "అవునుకాని ..ఇదంతా నువ్వెలాగ చూసేవూ"అన్నాను.


మా ఉమ కొద్దిగా ఖంగారుపడి "ఇందాకా బత్తాయిపళ్లవాడిని పిలవడాని కెళ్లేనుగా? అప్పుడు చూసేను" అని కాస్సేపాగి నేనేమీ అనకపోవడంచూసి "మరేం, ఇదివరకు రెండుమూడుసార్లు నేను స్కూలునుంచి వస్తూ చూసేను; సీతమ్మగారబ్బాయి సరోజావాళ్లింటి గుమ్మంముందు తచ్చాడుతూ వుంటే ... నన్ను చూసి గబగబా వాళ్ళింటి అరుగుమీది కెళ్లిపోయాడు. ...అలాగ వుంటాడు కానీ ఈ సీతమ్మగారబ్బాయి ఎంతవాడనుకున్నావూ" అంది ఉమ.

ఆ మర్నాడు సీతమ్మగారి కోడలు మా కొళాయిదగ్గర బట్టలుతుక్కుంటోంది. నేను మా వరండాలో స్తంభాన్ని ఆనుకుని నుంచున్నాను. సరోజ నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ కొళాయిదగ్గర!

(30-వ పేజీ చూడండి)



సూర్యోదయము



ఫొటో : పి. సుందరమూర్తి—మద్రాసు.

వచ్చింది. సాధారణంగా సరోజ అందరూ నీళ్లు పట్టేసుకున్నాక మేము తలుపు వేసుకుని భోజనాలు చేసే సమయంలో వచ్చి ఓ బిందెడు నీళ్లు పట్టుకెళ్లేది. ఎప్పుడొచ్చి తీసికెళ్ళేదో ఒకొక్కప్పుడు మాకు కూడా తెలిసేది కాదు. అలాంటిది ఇవాళ ఎనిమిదిన్నరైనా కాకుండా అందరూ వచ్చే వేళ, అందులో సీతమ్మగారి కోడలు పంపు దగ్గర వుండగా రావడం నాకు నిజంగా వింతే అనిపించింది. నేను సరోజని చూసి వరండాలోంచి లోపలికెళ్లిపోయి కిటికీలోంచి చూస్తున్నాను. సరోజ "ఏమండీ" అని సీతమ్మగారి కోడల్ని పిలిచింది. నా ఆశ్చర్యానికి అంతు లేకపోయింది. సీతమ్మగారి కోడలు కూడా నిర్ఘాంతపోయి మాటామంతీ లేక సరోజ మొహంకేసి చూస్తూ నిలబడిపోయింది. అంతలో ఎక్కణ్ణించి చూసిందో సీతమ్మగారు! రౌద్రావతారం దాల్చి ఊరంత నోరెట్టుకుని కోడల్నీ, సరోజనీ, ఇద్దరినీ కలిపి తిడుతూ గబగబా కొళాయి దగ్గరికి వచ్చేసింది. సరోజ ఈవిడని చూసి భయపడిపోయి బిందుచ్చుకుని చల్లగా జారుకుంది. సీతమ్మగారి కేకలకి మామ్మా, ఉమా, సుహాలతమ్మగారూ, కాంతమ్మగారూ, కూరలది, అంతా మూగేరు. "వెధవ మొహమూ నువ్వూను. ఇంటికి తగలడు" అన్న సీతమ్మగారి గాండ్రింపుకి ఆవిడ కోడలు గుడ్లనీళ్లు కుక్కుకుంటూ వాళ్లింటికి వెళ్లిపోయింది.

అవాళ రాత్రి సీతమ్మగారు కొడుకు రాగానే ఏం చెప్పిందో ఏమిటో మేము భోజనాలు చేస్తూవుంటే వాళ్లింట్లోంచి "పశువా! ఒళ్లు దగ్గర పెట్టుకొని బ్రతుకు. చీరేస్తా. మరొకసారి ఆ లంజతో మాట్లాడు మరి... పీక నొక్కి అవతల కీడ్చేయకపోతే చూడూ" అని సీతమ్మగారబ్బాయి అరుస్తున్నాడు. మేమంతా కంచాల్లో చేతులు పెట్టుకొని నిశ్చేష్టులమైపోయాము. ధబదబమని దెబ్బలూ ఒకొక్క దెబ్బ వెంటనే "అయ్యో!" "నాయనోయ్" "నే నేపాపం ఎఱగనరోయ్!" "అమ్మ బాబోయ్" "చచ్చిపోతున్నానరోయ్!" అన్న ఆర్తనాదాలూ వినబడ్డాయి. నేను గబగబా లేవబోయాను. మామ్మ "ఎక్కడికే..... వద్దు కూర్చో!....మన కెందుకొచ్చిన గొడవ" అని కేకలెయ్యడంతో మళ్లీ కంచందగ్గర చతికిలపడ్డాను.

మర్నాడు ప్రొద్దున్నే నేను లేచి కళ్లు నులుపుకుంటూ సావిట్లోకి రాగానే సరోజా వాళ్ళింట్లోంచి వస్తున్న మామ్మ కనబడింది. సావిట్లోకి వచ్చి మామ్మ నన్ను చూసి చూడడంతోనే "పాపం! ఎందుకు చెప్పేనా అనిపిస్తోందే! అయినా ఏం చెయ్యనూ! ఇంత రాద్ధాంతం అయ్యేక ఇంకా ఊరుకుంటే బాగుంటుందా?" అంది.

"ఏమిటి మామ్మా?" అన్నాను.

"ఆఁ. ఏముందిలే! సరోజతో 'నువ్వు ఈ కొళాయిదగ్గరికి రాకమ్మా. వీధి కొళాయిలో పట్టుకో' అని చెప్పేను...పాపం ఏదో చెప్పబోయింది కానీ మళ్లీ తలదించేసుకుని కళ్లమ్మట నీళ్లు కారుస్తూ 'అలాగేనండీ' అంది...నిజమే అనుకో. ఎనిమిది నెలల కడుపుతో వీధి కొళాయినుంచి నీళ్లు తెచ్చుకోవడం కష్టమే! అందులో ఇంట్లో కొళాయి వుందాయె..." అని ఊరుకొని "ఆఁ. నేనుమాత్రం ఏం చెయ్యగలనూ. నిన్న సీతమ్మగారందిలే. నలుగురైదుగురు సంసారి కొంపలవాళ్లు నీళ్లు పట్టుకొనే చోట. దాన్ని కూడా పట్టుకోనివ్వడమేమిటని.....పైగా నువ్విల్లుచ్చుకుంటే ఇచ్చుకో. ఆ విషయం నిన్నెవ్వరూ అడగరు. అంతే కానీ నీళ్ళుమాత్రం దానిక్కూడా ఇచ్చేరంటే నేనూ నా కోడలూ కూడా వీధి కొళాయినుంచో, లేకపోతే గోదావరినుంచో తెచ్చుకుంటామని... అయినా ఈ సీతమ్మతో విరోధం పెట్టుకోవడం ఆట్టే మంచిపని కాదులే! అందుకే... పోనిలే...ఆ పిల్ల నొచ్చుకుంటే నొచ్చుకుంది గానీ మంచిపనే చేసేను" అనుకుంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది మామ్మ.

* * *

మరొకసారి సీతమ్మగారింట్లో వాళ్ళ మనవడికి భోగిపళ్ళు పోస్తూ మమ్మల్నీ పిలిచేరు. నేనూ మా ఉమా వాళ్ళింటికి పేరంటానికి వెళ్ళి తిరిగి వచ్చేస్తూవుంటే కిటికీలోంచి పేరంటం జరుగుతూవున్న సీతమ్మగారింటివైపే చూస్తున్న సరోజ కనిపించింది. మా ఉమ నా వైపు చూసి "పాపం! అవిడని పిలవలేదు గాబోలు" అంది. నేను "ఆఁ. అదొక్కటే తక్కువైంది. ఇంకా నయం. మునుపటి రోజుల్లో ఐతే ఊళ్లో ఉండనివ్వక వెలివేసేవాళ్లు. మన మామ్మ కనక ఇల్లిచ్చింది" అన్నాను.

మరొకసారి నేనూ, మా ఉమా, సీతమ్మగారి కోడలూ మరికొందరమూ కలిసి సినిమాకి వెడుతూవుంటే సరోజ మావైపు అలాగే కిటికీలోంచి చూసింది. నా మనస్సులో అప్పుడు అయ్యో పాపం! అనిపించింది కాని మళ్ళీ తప్పుడు పనులు చేస్తే ఏమౌతుందీ అన్న చులకనభావం ప్రవేశించింది. లోపల ఏదోలాగవున్నా పైకి మేము ఆనందంగా వుండగా సరోజ చూడాలని మరింత గట్టిగా కబుర్లు చెప్తూ, నవ్వుకుంటూ నడిచేను.

ఒకరోజు సీతమ్మగారు మా ఇంటికొచ్చి "ఏమండోయ్. ఇవాళేం, అది కాఫీ పౌడరు అప్పుకోసమని దాసీదాన్ని మా ఇంటికి పంపిందండోయ్! అయినా ఇలాంటి వాళ్లకి ఒకసారి అప్పు ఇస్తే అదే అలవాటైపోతుంది. నేను లేదు పొమ్మన్నాను" అంది. ఇలాగే మరికొందరమ్మలక్కల నోటమ్మట విన్నాము.

ఒకరోజు మా ఉమ మామ్మతో "మామ్మా! ఆ సరోజేం, ఇవాళ దాసీదాన్తో ఒక్క ఆవకాయముక్క దానీది అడిగినట్లు ఎవరినైనా అడిగి పట్టుకురమ్మంటోంది" అని చెప్పగానే మా మామ్మ జాలిపడింది. "అయ్యో! కడుపుతోవున్న పిల్లేమ్మా!" అనుకుంటూ ఓ చిన్న జాడీలో ఆవకాయ పెట్టి తను స్వయంగా సరోజావాళ్లింటికి వెళ్ళి ఇచ్చివచ్చింది. అప్పటినుంచి నెలలు దగ్గరపడుతున్నాయి, ఎవ్వరూ దిక్కులేరన్న జాలితో మా మామ్మ అప్పుడప్పుడు ఊరగాయలూ, పచ్చళ్ళూ అవీ ఇస్తూ 'అమ్మాయీ అమ్మాయీ' అని పిలుస్తూ ఆదరంగా చూడ్డం మొదలెట్టింది.

* * *

ఒకరోజు నేనూ, మామ్మా, చెల్లీ భోజనం చేస్తున్నాము. మామ్మ చెల్లితో "ఉమా! ఈ పచ్చడిజాడీ సరోజకిచ్చిరామ్మా" అంది. మా ఉమా నేనూకూడా తెల్లబోయాము. మామ్మ నవ్వి "చిన్నప్పుడేదో తెలియక తప్పు చేసిందే అనుకోండి. కానీ ఇప్పుడందరిలాగ కాపరం చేస్తోందికదమ్మా! మనిషి కోసం మొహం వాచిపోయింది. పాపం! ఫరవాలేదులే! ఇచ్చేసి వెంటనే వచ్చేసేయి" అంది.

పరిగెట్టుకుంటూ వస్తున్న మా ఉమని సావిట్లో ఆపి "ఏమిటే విశేషాలూ?" అన్నాను నేను. "అన లేమైందంటే... వెళ్ళేనే...జాడీ క్రిందపెట్టి 'మా మామ్మ ఇచ్చిరమ్మంది' అని చెప్పి తలొంచుకుని నిలబడ్డానే" అంది. "నువ్వెందుకే తలొంచుకోవడం, అది వంచుకోవాలి కాని" అని నేనంటూవుంటే "అలా అడ్డుప్రశ్నలెయ్యకూడదమ్మా మరీ... నే నక్కడ జరిగిన ఘట్టమంతా తూ. చా. తప్పకుండా చెప్తాను. వింటే విను. లేకుంటే మానేయ్" అంది ఉమ. "ఆఁ. చెప్పవే బాబూ" అన్నాను.

"ఎవ్వరూ లేని నాకు మా అమ్మ దగ్గరవున్నట్టే వుంది. మీ మామ్మగారి ఋణం ఎలాగ తీర్చుకోగలనో?" అంటూ కృతజ్ఞతా వాక్యాలుపలికింది. నే నేమీ మాట్లాడకుండా 'వెడతాను' అని వెనక్కి తిరగబోయాను. "మీ పేరేవిఁటి?" అంది. 'ఉమ' అన్నాను. "ఏం చదువుతున్నారూ?" అంది. 'ఫిఫ్త్ ఫారం' అన్నాను. "మీ అక్క?" 'మా అక్క ఎస్. ఎస్. ఎల్. సి పేసయి మానే

నింది, అన్నాను. భారంగా నిట్టూర్చి "మీరు మాలాంటివాళ్ళతో మాట్లాడరనుకుంటా" అని గొణిగింది. నే నింతసేపటికిగాని తలెత్తి ఆవిడ మొహంకేసి చూడలేదు. నేను తలెత్తగానే తను తల దించేసుకుంది. నేను "ఛా! అలాంటివేమీ లేదండీ" అన్నాను. కానీ అక్కయ్యా! మన మనస్సులోని మాటే సరోజ పైకి అనేస్తే అది అబద్ధమని ఏమాత్రమూ జంకూగొంకూ లేకుండా ఎలాగ అనేసేనే? మొహమాటంవల్ల అలాగ అన్నానంటావా?" అంటూ మా ఉమ ఇంకా ఏదో అనబోయింది.

"సరేలేవే! నీ ఆత్మ పరిశోధన తర్వాత చేసుకుందువుగాని ముందు ఏమైందో చెప్పు" అన్నాను.

"ఏమైంది! 'నాకెవ్వరూ లేరమ్మా! అప్పుడప్పుడు వస్తూవుండు' అంది. అంతే! నేను వచ్చేసేను.

"బాగానేవుంది. 'మీర'ల్లా 'నువ్వు'లోనికి దిగిందన్నమాట!" అన్నాను.

"అహఁ. నేనే అన్నానులే, నేను చిన్నపిల్లనేకదా నన్ను మీ రనక్కర్లేదని" అంది మా ఉమ. దీనికి కోపం వచ్చింది లాగుంది. అంతా సరిగ్గా చెప్పడంలేదు. అవాళ్కి అంతటితో మా సంభాషణ నిలిచిపోయింది. తర్వాత మా మామ్మ మధ్యాహ్నం నిద్రపోతున్నప్పుడు మెల్ల మెల్లగా మా ఉమ సరోజా వాళ్ళింటికి వెళ్ళేది.

ఒకరోజు సరోజ అందిట "మీ అక్కని చూస్తే మా చెల్లెల్ని చూసినట్లే వుంటుంది. మీ అక్క ఇవతలికి వచ్చినప్పుడల్లా చూడాలనిపిస్తుంది. కానీ ఆవిడకి నేనలాగ చూడ్డం ఇష్టంలేదనుకుంటాను" అని. ఆనాడు నాకెంతో కోపం వచ్చింది. "దీని నెత్తేమీ కాదూ! నా ఖర్మం కాలి నేనటా దీని చెల్లెలినట..." ఈ మాటే పైకి అనేస్తే మా ఉమ అందికదా "పాపం! బాధకొద్దీ అలాగ అనుకుందేమో! దానికంతగా అనుకోవాలిటే" అని. నా కప్పుడా కోపంలో ఆ మాటల నిజం తెలియలేదు కానీ...పాపం! ఆవిడ తన చెల్లెలిని చూసుకుని ఎన్నాళ్ళయిందో!

*   *   *

ఒకనాడు మా మామ్మ త్వరగా పడుకోకపడంవల్ల మా చెల్లి సరోజావాళ్ళింటికి త్వరగా వెళ్ళి ఎంతిసేపటికీ రాలేదు. రెండున్నర అవుతోంది. మా మామ్మ ఎక్కడ లేస్తుందో, లేస్తే చంపుతుందేమో భయం! పోనీ నేవెళ్ళి పిలిస్తే? "దానింటికి 'నేను' వెళ్ళడమా? ఛా!!" అనిపించి మానేసేను. అంతలో పరిగెట్టుకుంటూ మా ఉమ వచ్చింది. "ఏమే! ఇంతసేపూ దానింట్లో నే కూర్చున్నావా? మామ్మకి తెలిస్తే ఏమౌతుందో కాస్త ఏమైనా ఆలోచించేవా?" అంటూ నాలుగు చీవాట్లూ పెట్టి "ఐతే



మైనపువత్తులతో తాజమహాలు;
(శిల్పకారిణి హిందూపురం మునిసిపల్ కౌన్సిలరు హెచ్. గోద వరిబాయి)

ఉమా! ఎందుకే ఇంతలేటైంది?' అన్నాను నెమ్మదిగా.

"ఇవాళ తనకథంతా చెప్పుకొచ్చిందే! చూడూ. మనం సినిమాల్లో చూస్తాం అలాగ వుంది." అంది. "ఊహుఁ. ఏమందేవిఁటి?" అన్నానో లేదో మొదలెట్టింది మా ఉమ :-

ఇవాళ మామూలు వేళకంటే ముందుగా వెళ్ళేను కదూ! తలుపు తీసి పెట్టలేక దగ్గరగా జేర వేసివుంది. తలుపుతోసుకుని నెమ్మదిగా లోపలికెళ్ళేను. ఓమూల చాపమీద సరోజ పడుక్కుని వుంది. నిద్రపోతోందేమో మళ్లీ వద్దామనుకుని వచ్చేయబోతూ వుంటే అడుగుల చప్పుడు వినబడింది కాబోలు తలెత్తిచూసి "రామ్మా!" అంది. కళ్లు ఎఱ్ఱగా ఉబ్బివున్నాయి. ఏడ్చిందేమో! నే నాశ్చర్యపోతూ కూర్చున్నాను. "ఏం అలాగ తెల్లబోతున్నావు తల్లీ! ఏస్థితినుంచి ఎలాంటి గతికొచ్చేనో తలుచుకుని ఏడుస్తున్నానమ్మా" అంది నిట్టూరుస్తూ! నా కావిడ కథ వినాలని చాలా రోజులబట్టీ వున్నా ఏమని అడగాలో తెలియలేదు. "మీ అమ్మా నాన్నా మంచి స్థితిపరు లనుకుంటాను" అని మాత్రమన్నాను. "ఆఁ నేనూ మా చెల్లీ అంటే ఎంతో గారాబం. మా అమ్మ మరీ మీరబెట్టడంవల్ల ఎక్కడా మంచీచెడూ తెలియక ఇలాగ అధోగతిపాలైనాను. నా కథంతా చెప్పాలంటే...హు.. ఎందుకమ్మా నువ్వు చిన్నపిల్లవి..." అంది. నేను అప్రయత్నంగా "ఫరవాలేదండీ, మీ మనస్సులో బాధైనాకొంచం తగ్గుతుంది. చెప్పండీ!" అనేసేను. ఆవిడ కొద్దిసేపు మౌనంగా కూర్చుని భారంగా నిట్టూర్చి "అవునమ్మా! అంతేకాదు. మీలాంటివాళ్లు అలాంటి స్థితికి రాకుండా ఉండడానికి కూడా పనికొస్తుంది. చెప్తానమ్మా" అంటూ మొదలెట్టింది తన గాథ...

"ఈ ఉపోద్ఘాతమంతా ఏమిటే బాబూ! అసలు కథేదో చెప్పేయక" అనుకున్నాను మనస్సులో. కాని ఇలాగ అంటే మా ఉమ ఎక్కడ మానేస్తుందో నని ఊరుకున్నాను.

"సరోజావాళ్ల నాన్న బెజవాడలో ఒక పేరుపడ్డ లాయరు. ఆయన పేరేమిటో సరోజా చెప్పాలేదూ, నేనడగాలేదూ. సరోజా, వాళ్ల చెల్లెలూ ఇద్దరే ఆయనకి సంతానం.

బాగా స్థితిపరులు కావడంవల్లా, కావలసినంత మంది నౌకర్లూ, చాకర్లూ వుండటంవల్లా సరోజావాళ్ళకి రాజభోగాలే జరిపించింది వాళ్ళమ్మ. చిన్నప్పటినుంచి తనకెంతతోస్తే అంతా చేసేసేవటకూ నిద్రపోయేది కాదు సరోజ! ఎవరెన్ని చెప్పినా, నయాన్న నచ్చజెప్పినా భయాన్న బెదరించినా తను పట్టిన కుందేటికి మూడే కాళ్ళనేది. కాని ఇంట్లో ఎంత భాగవతం జరుగుతూవున్నా లాయరుగారు వచ్చేసరికి ఇల్లంతా శాంతినికేతనం అయిపోయేది. ఆయనకూడా ఇంటి విషయాల్లో ఆట్టే జోక్యం కలుగజేసుకొనేవారు కాదు కనుక వీళ్ల విపరీతపు గారాబా లాయనవరకూ వెళ్ళే అవకాశం కలుగలేదు. చిన్నప్పుడు సరోజ స్కూలుకి వెళ్ళనేనేదట. ఇది చూసి వాళ్ళమ్మ సరోజావాళ్ళ నాన్న కొర్టు

★ లోకులంటే ఎవరూ? ★

ళ్ళకుండానే నౌఖరు నిచ్చి సరోజని స్కూలుకి పంపేదట. వాళ్ళ నాన్న భయంవల్ల ఎలాగో స్కూలు కెళ్ళినా, పదకొండయ్యేసరికి ఆ నౌఖర్ని ముప్పై తిప్పలూ పెట్టి ఇంటికి తీసికొచ్చేవరకూ మూడు చెరువుల నీళ్లు త్రాగించేదట. ప్రైవేటు మాష్టరుని పెట్టినా -ఆయన తిప్పలాయనకి పెట్టడంలోవున్న సరదా చదువు నేర్చుకోవడంలో లేకపోయింది సరోజకి" అంది మా ఉమ.

"ముప్పో నీకు ఉండి ఏడిసింది. మరోక్కొని అనమాకు రెడీ..." అన్నాను నేను నవ్వుతూ. "ఇదుగో అక్కా!! నే నొకటి చెప్తాను వినుకో! నేను సరోజ నా కెలాగ చెప్పిందో అలాగే నీకు చెప్తాను. అంటే ఆవిడ మాటల్ని రిపీట్ చేస్తానన్నమాట. అంతే కానీ ఇవన్నీ ఏమిటో నా స్వంత కల్పనలని మాత్రం నువ్వనుకోకూడదు" అంది మా ఉమ సీరియస్ గా.

"అలాగైతే ఉత్తమ పురుషలో ఆవిడ నీ కెలాగ చెప్పిందో అలాగే చెప్పు మరి" అన్నాను నేను ఉత్సాహంగా. "ఐతే విను. సరోజ ఇలాగ అందన్నమాట..." అంటూ మా ఉమ సరోజ తనతో చెప్పినట్లు చెప్పడం మొదలెట్టింది.

"హైస్కూల్లోకూడా నా చదు విలాగే గడిచింది. కాని లాయరుగారమ్మాయిని కదూ! పరీక్ష వ్రాసినా వ్రాయకపోయినా ప్రతీక్లాసూ గట్టెక్కి పోతూ వచ్చేను. పరీక్షల్లో నా తెలివితేటలు చూపించక పోయినా, డిబేట్లు ఏవైనా వచ్చేయంటే మాత్రం ఓ వెలుగు వెలిగిపోయేదాన్ని. అందరినీ ఎదిరించడమూ, ఎదుటివాళ్ళ ఉద్దేశ మేమిటో సరిగ్గా అర్థం చేసుకోకుండా గట్టిగా అరవడమూ మనకి మొదటినుంచీ ఉన్న అలవాటే కనుక కొస్త డిబేటు ముందు కష్టపడి ఊళ్ళఊళ్ళనుంచి వచ్చిన విద్యార్థులందరినీ ఓడించేసేదాన్ని నా వాదనతో!! నా ప్రతిభ ఎంతవరకూ ప్రాకిందంటే "లాయరుగారమ్మాయి వస్తుందా? ఐతే మనపని వట్టిదన్నమాటే" అని ఆ ఊరు పిల్లలేకాక చుట్టుప్రక్కల ఊళ్ళవాళ్ళు కూడా అనుకునేంతవరకూ...మా నాయన నాకీర్తిచూసి పొంగిపోయేవారు. ఆయనకేం తెలుసూ అసలు విషయం? ఏ టీచరు చెప్పినా డిబేటలో నా వాగ్ధాటినిగురించే గాని మా నాయనముందు నా చదువు విషయం ఒక్కరూ ఎత్తేవారేకారు. అది కూడా నా దురదృష్టమే నేమో!

నేను కొంచం పెద్దపిల్లనయ్యేటప్పటికి మా అమ్మ పట్టుపట్టి నన్ను ఆడపిల్లలస్కూల్లో జేర్పించింది. కానీ...తల్లీ! చెడిపోయేవాళ్ళని అంతఃపురాల్లో పెట్టినా వాళ్లు బాగుపడరు. నాకర్మ! ఒక్క మగపురుగు అడుగు పెట్టడానికి వీల్లేని ఆడపిల్లల స్కూల్లో ఉండికూడా నేను ఈయనతో స్నేహం చేసేను" అంది సరోజ పాపం నిట్టూరుస్తూ" అని మా ఉమ నాకేసి చూసింది. దక్కనిపట్టులో ఉన్నప్పుడు ఆపేసే వేమిటో అన్నట్లు నేను ఉమకేసి చూడగానే మళ్ళీ మొదలెట్టింది.

"టీచర్లని ఎదిరించడమూ, క్లాసుపిల్లలెవరితోనూ కలిసి మెలసి వుండకపోవడమూ, చదువు సున్నాఅయినా వస్నెల విసనకఱ్ఱలాగ తయారై రావడమూ చూసి నేనంటే టీచర్లకి పిలలకికూడా గిట్టేది కాదు. మొదట్లో టీచర్లు నన్ను ముందు సీటులో కూర్చోబెట్టిబాగుచేద్దామని చూసేరు. కానీ...నాకర్మ ఇలాగ రాసిపెట్టి వుండగా నేను బాగుపడతా నా అమ్మకి? ఇంట్లో నా మొరటుదనం చూసి మా అమ్మ ఏదైనా మాట అన్నదో లేదో ఆవిడ మళ్ళీ నోరెత్తకుండా ఇష్టం వచ్చినట్లు ఎదిరించేదాన్ని. నాకంటే మా చెల్లి అన్నివిధాలా అణకువైనది, చదువుమీద శ్రద్ధగలది కావడంవల్ల ప్రతీవాళ్లు మాటకిముందు దాన్ని నన్నూ పోల్చి తిట్టడం మొదలెట్టేసరికి నాకు నా స్వంత చెల్లెలిమీద అసూయ, ద్వేషం కలిగాయంటే ఆశ్చర్యంగా లేదూ! లోకమంతా నన్ను ద్వేషించేవాళ్ళేనని అనుకునేదాన్ని.

అవి నేను ఫిఫ్త్‌ఫారం చదివే రోజులు. మా క్లాసులో నిర్మల అని ఒక్క అమ్మాయి వుండేది. పేరుకి మాత్రమే నిర్మల. చాలా అసహ్యంగానూ మురికిగానూ వుండేది. ఆ అమ్మాయిని గురించి క్లాసులో ఏవేవిటో చెప్పుకునేవారు. ఆ పిల్లతోకూడ ఎవరూ అట్టే కలిసేవారుకారు. ఒకే పరిస్థితుల్లో వున్న ఇద్దరికి నిముషాలమీద స్నేహమైపోతుంది. నాకూ ఆ నిర్మలకీ పరిచయమైంది. మొదట ఆ పిల్ల ప్రక్కన కూర్చోడానికి ఇష్టపడకపోయినా ఆ అమ్మాయి తమాషాగా మాటాడే మాటల్ని వినాలన్న కుతూహలంకొద్దీ ఆ అమ్మాయి ప్రక్కనే కూర్చున్నాను. నేను ముందు కూర్చుందామని ఆ అమ్మాయి వెనక కూర్చుందామని కాస్సేపు వాదులాడుకున్నాము. ఆఖరికి ఆ అమ్మాయి మాటే నెగ్గింది. క్లాసులో టీచరు పాఠం చెప్తూవుంటే ఆ నిర్మల బెంచీ క్రింద ఏదో బొమ్మల పుస్తకం పెట్టుకొని చదువుతోంది. నా కెంతో ఆశ్చర్య మేసింది. అంతవరకూ క్లాసులో అల్లరి చెయ్యడమూ, పాఠం వినకపోవడమూ, మాట్లాడడమూ తప్ప నే నెప్పుడూ బొమ్మల పుస్తకాలు చదవలేదు. ఆ బొమ్మ తమాషాగావుంది. ఒక అమ్మాయి మేడమీద కిటికీలోంచి రోడ్డుమీద నిలబడ్డ అబ్బాయికి ఏదో సౌజ్ఞ చేసి చెపుతున్నట్లుంది. నేను నిర్మలని "ఇదేం పుస్తకం?" అని అడిగేను. "ఇదో పత్రిక" అని చెప్పింది నిర్మల. "కథ లుంటాయా?" అని అడిగేను. "ఆఁ మంచి మంచి కథలుంటాయి. ఈ అమ్మాయీ, ఈ అబ్బాయీ ప్రేమించుకుంటారు. కాని ఈ అమ్మాయి తల్లిదండ్రులకి ఇష్టం వుండదు. కనుక ఈ అమ్మాయి ఓ అర్ధరాత్రివేళ ఈ అబ్బాయివేసిన నిచ్చెనమీదనుంచి మేడదిగి వచ్చేస్తుంది. ఇద్దరూ ఓ బోటులో ఈనదిదాటి అవతలగట్టునవున్న ఊళ్లో రిజిష్టరుమేరేజి చేసుకుంటారు" అని కథ టూకీగా చెప్పింది. అంతేకాక తనకి కూడా ఎందరో ప్రేమలేఖలు వ్రాసారనీ, తను వాళ్ళ నేడిపించి సంతోషిస్తుందనీ, తన అన్నయ్యకికూడా ఎంతమందో ఆడపిల్లలు ప్రేమలేఖలు వ్రాస్తారనికూడా చెప్పింది. నా కెంతో ఆశ్చర్యం వేసింది. "ఏమిటీ? ఈ కుట్లు నిర్మలకి ప్రేమలేఖ లొస్తాయా?" అనుకున్నాను. వాళ్లన్నయ్యకూడా ఈఅమ్మాయిలాగే వుంటాడేమో నని నవ్వులాటకి "మీ అన్నయ్య... నీ లాగే వుంటాడా?" అన్నాను. "మా అన్నయ్య నాకంటే చాలా బాగుంటాడు. నీ అంత తెలుపు కాదు కానీ ... చామనచాయే!" ఉంగరాలజుట్టు నుదుటిమీద ఆడుతూవుంటే చక్కని చిలిపి కళ్ళతో చూస్తూ మనోహరంగా వుంటా"డని మాఅన్నయ్యని వర్ణిస్తూ ఒక ఆడపిల్ల వ్రాసిందితే. నా కింకా సరిగ్గా చెప్పడం రాదు కానీ...మాఇంటికొస్తావా? చూద్దువుగాని" అని నిర్మల ఇంకా ఏదో అనబోతోంది.

"సరోజా! నా ప్రశ్న ఏమిటీ?" అని టీచర్మగారి అరుపు వినబడగానే ఉలిక్కిపడి లేచి నుంచున్నాను. అప్పటికప్పుడే ఐదుగురు నిలబడివుండడం చూసి తెలుసుకున్నాను. "ఏం వెనక్కి శ్శవ్వా? ముందు కూర్చుంటే ప్రశ్నలేస్తామనా? చెడిపోతున్నావుసుమీ...జాగ్రత్త...ముందుకురా!" అని నన్ను ముందుసీటులో కూర్చోబెట్టారావిడ. అక్కడే కూర్చున్నానన్నమాటే కాని నా ఆలోచనలన్నీ "ఈ మురికిపిల్లకే అన్ని ప్రేమలేఖలొస్తే నా కెన్ని రావాలో" అనుకొని లెక్క వేసుకోవడంలోనూ, నిర్మలావాళ్ళన్నయ్య చక్కగా ఉంగరాలజుట్టు నుదుటిమీద పడుతూవుంటే చిలిపిగా చూస్తున్నట్లు ఊహించుకోవడంలోనూ సాగిపోయాయి. ఆ పుస్తకంలోని కథ మీదికి పోయింది దృష్టి. తల్లిదండ్రుల నెదిరించి నది దాటి అవతలి ఒడ్డున పెళ్ళి చేసుకుని సుఖపడ్డారనే భ్రమించేను గానీ తిండికి కూడా కష్టమైపోయి దిక్కులేక అష్టకష్టాలూ పడతారన్న సత్యాన్ని ఏమాత్రమూ తెలుసుకోలేక పోయాను" అని

సరోజ ఏడవడం మొదలు పెట్టిందో! పాపం!" అంది మా ఉమ. "ఐతే ఏమైంది! అనిర్మల సరోజని పెడదారి త్రొక్కించిందా?" అని అప్రయత్నంగా అనేసేను. మా ఉమ "అలాగ ఖంగారు పడతావేం 'పూర్తిగా వినూ...ఆ తర్వాత గాద్గదిక స్వరం వల్ల కాస్సేపు మాట్లాడలేక పోయింది. నాకూ ఓదార్చాలనే అనిపించింది. కానీ ఏమని ఓదార్చాలో తెలియక ఊరుకోనూ లేక మానాలేకా బాధపడుతూ వుంటే నావైపు అదోలా చూసి ఏమనుకుందో ఏమిటో ఆ తర్వాతదంతా చాలా టూకీగా చెప్పేసింది.

"ఏముందమ్మా. నేనుకూడా అలాంటి పుస్తకాలు చదవటం మొదలు పెట్టేను. రెండు మూడుసార్లు నన్ను ముందు కూర్చోపెట్టుకుని టీచర్లు బాగుచేద్దామనే చూసేరు.

★ లోకులంటే ఎవరూ? ★

కాని నాకా యోగ్యత వుండదూ!...కాని ఆశ్చర్యం! నన్ను ప్రశ్నలు వేసీ తిట్టీ ఇన్నీ చేసేవారా; నా ప్రక్కనే కూర్చున్న నిర్మల నేమీ అనేవారుకాదు. కొన్నాళ్ళ తర్వాత నా విషయంకూడా అట్టే పట్టించుకోవటం మానేశారు. క్లాసు ఎగ్గొట్టి నిర్మలా వాళ్ళింటికి వెళ్ళేదాన్ని. నిర్మలా వాళ్ళ అన్నయ్య ఆ అమ్మాయి వర్ణించినంత అందముగా లేకపోయినా నా పాడు కళ్ళకప్పుడు అందంగానే కనిపించేడు. వాళ్ళింట్లో అదుపూ ఆజ్ఞలలో పెట్టే పెద్దవాళ్ళెవ్వరూ లేకపోవటం వల్ల మా ప్రేమలన్నీ నిరాఘాటంగా సాగిపోయాయి. అందరూ అసహ్యించుకొనే నన్ను ఎంతో మెచ్చుకొని పొగిడే అతని దగ్గిర అస్తమానూ గడపాలనిపించేది..., అలాగే చేసేను కూడా.... వాళ్లు బీదవాళ్ళు. కనుక అప్పుడప్పుడు ఇంట్లోంచి డబ్బు తీసికెళ్లి వాళ్లకి సర్దుబాటు చేసేదాన్ని. నాలుగయ్యే సరికి స్కూలు నుంచి రావటం వల్ల మా ఇంట్లో నా విషయం ఎవ్వరూ పసికట్టడానికి అవకాశం కలుగలేదు.

కాని మా అమ్మ మాత్రం నా పరధ్యాన్నం అవీ చూసి "పెళ్ళీడు కొచ్చిన పిల్లకి పెళ్ళి చెయ్యండోయ్" అని మొరపెట్టేది. మా అమ్మ అలాగ అన్నప్పుడల్లా నా గుండెలు కొట్టుకొనేవి, అక్కడితోనైనా ఈ భాగవతం మానేదామన్న ఊహ మనస్సులో మెదిలినా తెల్లవారేసరికి మామూలు అలవాటుకే మనస్సు పురికొల్పేది. పూర్తిగా నాకు కనువిప్పు కలిగేసరికి పరిస్థితి చెయ్యి దాటిపోయింది. నాకు నెల తప్పింది. ఎంతో గాబరా కలిగింది. నిర్మలా వాళ్ళన్నయ్యతో నా పరిస్థితంతా చెప్పి ఏడిస్తే "మీ ఇంట్లో చెప్పేసెయి. ఇద్దరం పెళ్లిచేసుకుందా"మన్నాడు. కానీ రోజూ చెప్దామనుకోవడమూ సిగ్గుచేతా భయంచేతా రేపు చెప్దామని వాయిదా వేసుకోవడంతో రెండు నెలలు గడచిపోయాయి. నిర్మలా వాళ్ళింటికి వెళ్లడం తగ్గించేసి స్కూలుకి మామూలుగా హాజరవటం మొదలెట్టేను. అప్పటికి వారంరోజులున్నాయి పెద్ద పరీక్షలు. నిర్మల ఎన్నోసార్లు వాళ్లన్నయ్య నన్ను రమ్మన్నాడనీ, ఇంట్లో కష్టంగా వుండడంవల్ల కొంత డబ్బు పట్టుమనీ బ్రతిమాలింది. కాని నాకా నిర్మల మీద కూడా కోపంవచ్చి ఆ పిల్లతో మాట్లాడడం తగ్గించేసేను.

పరీక్షలయ్యాయి. నాకేదైనా వస్తేగా వ్రాయడానికి. ఇన్నాళ్ళ లాగ కాదు. ఎస్. ఎస్. ఎల్. సి క్లాసువాళ్లని పై పరీక్షకి కూర్చోబెట్టాలికదూ! ప్రమోషన్సు కాస్త కఠినంగా జరిగేయి. నేను ఫెయిలవటం మా నాయన కెంతో తలవంపైంది. డిబేట్లలో కీర్తి గడించుకున్న నేను ఫెయిలవటం చూసి ఆశ్చర్యపోయారాయన. "ఫలానాది కష్టంగా వుందని నాతో ఒక్కమాట చెప్పలేక పోయావామ్మా!" అని మాత్రమన్నారు. నాలాంటి దుశ్చరాలి నింకా అంతగా గౌరవించటంతో నా హృదయం బ్రద్దలైంది. కన్నీటి స్రవంతి తప్ప మరో జవాబు రాకపోవటంతో మా నాయన అసలు సంగతేమిటో కనుక్కోడానికి స్కూలుకి వెళ్లేరు. పరిస్థితి ఇలాగ పరిణమిస్తుందని నే నూహించుకోలేదు. ఆ సమయంలో నాస్థితి ఏమని చెప్పకోనూ?

మా హెడ్ మిస్ట్రెస్ నా స్టాండర్డ్ గురించీ, ప్రవర్తన గురించీ చెప్తూ నేను నిర్మలతో స్నేహం చెయ్యటమూ, క్లాసు ఎగ్గొట్టి వాళ్ళింటికి వెళ్ళడమూ చెప్పి నా మార్కుల లిస్టూ, అటెండెన్సు రిజిస్టరూ చూపించేసరికి మా నాయన అగ్గి అయిపోయాడు. "ఆ ధండాలుడి ఇంటికెడుతున్నావా? వాడు చదువు సంధ్యాలేని తాగుబోతు. రౌడీ వెధవ. ఇలాంటి బుద్ధు లెలా పట్టుబడేయి" అంటూ ఛడామడా తిట్టి కొట్టినంతపని చేసేసరికి, అసలువిషయం తెలిస్తే ఇంకా ఏం చేస్తారో అన్న భయంతో నాకు ఒళ్లు తెలియని ఫిట్టు ఏదో వచ్చేసింది. అంతటితో చాలక ఆరాత్రికి ఒళ్లు సలసలా కాగిపోయే జ్వరం వచ్చేసింది. డోకులు వెళ్ళటం మొదలెట్టేయి. మా అమ్మ ఎలాగో మా నాయనని బ్రతిమాలి డాక్టరుని తీసుకురమ్మని చెప్పి ఒప్పించేసరికి తాతలు దిగొచ్చేరట. నాకు ఒంటిమీద తెలివివచ్చి కళ్లు తెరిచేసరికి ఎదురుగుండా ఒక డాక్టరు యమధర్మరాజులాగ కనిపించేడు. ఆ క్షణంలో గుండె ఆగిపోయి చచ్చిపోతే బాగుండు ననిపించింది. కాని మనం అనుకున్నవన్నీ జరుగుతాయా తల్లీ!

ఏముందమ్మా! డాక్టరు నాగుట్టు కాస్తా బయట పెట్టేసేరు. ఇక చూడు నాగతి... అబ్బ!! తలుచుకుంటే ఇప్పటికికూడా, భయమేస్తుంది. మా నాయన ఒళ్లు తెలియని పిచ్చికోపంతో జ్వరంతో వున్నాననైనా లెక్క పెట్టక నన్ను కఱ్ఱతో చావగొట్టి బయటికి ఈడ్చి అర్ధరాత్రి వేళ వీధులోకి నెట్టి తలుపేసేసేరు. పాపం ... తల్లిప్రాణం కాదూ! ఎలా తీసికొచ్చిందో మా అమ్మ!! రెండువందలరూపాయలు నా చేతికిచ్చి అవి తీసికొని నిర్మలా వాళ్ళింటికెళ్ళి వాళ్ళన్నయ్యతో తెల్లారేలోపుగా ఏదైనా ఒక ఊరుకి పోయి బ్రతకమనీ, ఇంకా అక్కడేవుంటే కోపంలో నాయన చంపేస్తారనీ, కనుక త్వరగా వెళ్లమనీ చెప్పి ఏడుస్తూ లోపలికెళ్ళిపోయింది" అని పాపం గట్టిగా ఏడ్చేసిందే!" అంటూ మా చెల్లి నాకేసి చూసింది. దాని కళ్లనిండా నీళ్లు నిండుకొని ఉన్నాయి. పిచ్చి మొద్దు!!...నాకూ కళ్లనీళ్లు కమ్ముతున్నట్టు అనిపించింది. కాని వెంటనే నా మనస్సందుకు వ్యతిరేకించింది. కాని మా ఉమ కథ నెంత చక్కగా చెప్పగలదూ! నిజంగా సరోజ ఇలాగ చెప్పివుంటుందా? ఊహుఁ ఇదంతా మా ఉమ నేర్పే నేమో అనిపించింది నాకాక్షణం! అంతలో మా చెల్లి మళ్లీ మొదలెట్టింది.

"నీకు ఈ ఇంటితో ఇక సంబంధం లేనట్లు తలుపులు మూసుకున్నాయి. ఆగడప మీదే పడి ఎంతో సేపు ఏడ్చేను. కాని అంతలో అమ్మ మాటలు జ్ఞాపకమొచ్చి గబగబా నిర్మలా వాళ్లింటివైపు నడిచేను. అర్ధరాత్రి ఒంటరిగా వచ్చిన నన్ను చూసి తెల్లబోయాడతను. అంతా చెప్పి "పదపోదాము. ఇక ఈ ఊరిలో ఒక్కక్షణంకూడా ఉండవద్ద"ని బలవంతం చెయ్యడంతో అతనేమీ ఎదురు చెప్పలేక పోయాడు. డబ్బులేదన్నాడు కాని నా దగ్గరున్నదంతా ఇచ్చి అతన్ని బలవంతంగా రైలుస్టేషను వైపు నడిపించేను. పన్నెండు గంటల బండిలో మేమిద్దరమూ బెజవాడ వదిలేసేము. అప్పటినుండి ఇంతవరకూ మళ్ళీ బెజవాడ మొహం చూడలేదు నేను.

మొట్టమొదట్లో ఆయన నన్నెంతో ఆదరించేవారు. నాకే కష్టమూ కలగకుండా చూడాలని ప్రయత్నించేవారు. నాకూ ఇక లోకంలో సర్వమూ ఆయనే అయ్యారు. అస్తమానమూ ఆయన ఎదుటే కూర్చునేదాన్ని.

కానీ తల్లీ! ఆడదాని జన్మ పువ్వులాంటిది. పువ్వు అందంగా ఉన్నంతసేపూ తలమీద పెట్టుకుంటారు. ఎండిపోగానే తీసి కాలితో రాసేస్తారు...నామీద ఆయనకి మోజు తగ్గటం ప్రారంభించింది. ఆయన ప్రవర్తనలో కూడా మార్పురావడం మొదలెటింది. నా ఎదుటే తన ప్రియురాండ్రకి ఉత్తరాలు వ్రాసేవారు. నేను దాని కిష్టపడక పోట్లాడితే "నువ్వు నాకు తెలియనిముందు నీలాంటి స్నేహితురాళ్లు నాకెందఱో! నువ్వు అట్టే అల్లరి చేసేవంటే నేను పోతా"నని బెదిరించేవారు. పెద్దవాళ్లు వంశగౌరవం, సాంప్రదాయం పిల్లవాడి గుణగణాలూ అన్నీ తెలుసుకొని చేసిన భర్త తప్పుడుదార్లు త్రొక్కితేనే ఆడది ఏమీ చెయ్యలేక పడివుండవలసి వస్తున్నప్పుడు, తల్లిదండ్రుల ప్రమేయం ఏమాత్రమూ లేకుండా తెలిసీ తెలియని వయస్సులో చదువు సంధ్యలు లేని అన్యకులస్థుని

(48 వ పేజీ చూడండి)



పాప రహస్యం

బి. వి. సింగరాచార్య

పాప! నీకు బొమ్మలు కొని
వచ్చినపుడు తెలిసె నాకు.–

గగనవీథి మేఘమాల,
కడలిదారలు తరంగాల,
పూల తోట వేల రంగు
లేల గారడీ సలుపునో!–

పాప! నీకు బొమ్మలు కొని
వచ్చినపుడె తెలిసె తల్లి!

తీయ తాయిలములు నీకు
తెచ్చినపుడు తెలిసె తల్లి!–

పూలగిన్నెలను తేనియ
పూరించిన దెందులకో
పండ్లలోన మధుర రసము
పదిలపరచు టెందులకో–

తీయ తాయిలములు నీకు
తెచ్చినపుడె తెలిసె తల్లి!

పాప! నిన్ను లాలింపగ
పాడినపుడు తెలిసె తల్లి!–

తోటలలో ఆకులేల
పాటలేల పాడెదునో
కడలి తరంగాలు బృంద
గాన మేల సలిపెదునో–

పాప! నిన్ను లాలింపగ
పాడినపుడె తెలిసె తల్లి!

నిను నవ్వింపగ నీ మో
మును ముద్దిడ దెలిసె తల్లి!–

సంజకాంతి పుంజము వెద
జల్లుటలో ఆనందము,
చేనవి రే పైరు గాలి
వీచుటలో ఆనందము.–

నిను నవ్వింపగ నీ మో
మును ముద్దిడ దెలిసె తల్లి!

(రవీంద్రుని గీతం ఆధారంగా.)



గాడిద బ్రతుకు

"పుట్టినదాదిగ
గిట్టెడువరకును
బానిసగానే
బ్రతుకవలెనొకో?

మూటలు, బరువులు
మోయుట తప్పని
గాడిద బ్రతుకిది
బూడిదకాదా?

ఎందుకు పుట్టుదు
నెందుకు బ్రతుకుదు
నెందుకు చత్తునొ
ఎవరికి తెలియును?

ప్రభువుల సేవే
పరమావధియా?
స్వేచ్ఛ లేని ఈ
జీవిత మేలా?"

అని యొక గాడిద
ఆలోచించుచు
ఊరికి వెలుపల
నుండిన పొలమున
కసవును మెల్లగ
మెసవుచునున్నది.

కనుకుచు దాపున
కూర్చుండియుండిన
వాడొక రజకుడు,
గాడిద కధిపతి,

అంతట దూరము
నం దరుదెంచెడి
చోరులమూకను
చూచెను చాకలి.

గడగడ భయమున
ఒడలు వడకగా
"గాడిద! గాడిద!
దౌడు తీయుమా!
అరుగో దొంగలు!
అరుగో చోరులు!
తృటిలో వారలు
ఇట కేతెంతురు.
వచ్చినచో నిను
ముచ్చిలి పోదురు.
పరుగున నింటికి
"పారిపో" మ్మనుచు
చాకలి ఎన్నో
కేకలు వేసెను.

కదలలేదు ఆ
గాడిద మాత్రము.
కదలక మెదలక
కసవును మెసవుచు
పొలమున నిలబడి
పలికెను గాడిద:

"వెంగలివాడా!
దొంగలు వచ్చిన
నాకా నీకా
నష్టము కలుగును?
నీకడ చేసెడి
చాకిరి యంతయు
వారి కొసర్పగ
వలె నంతేకద?


నీ వద్దను నే
బావుకొంటినా?
దొంగలకడ నే
భంగ పడుదునా?


ఇప్పటి యూడిగ
మెంతకష్టమో
అప్పటియూడిగ
మంతే కష్టము?

స్వేచ్ఛలేని జీ
వచ్ఛవమునుకద!
ప్రభువెవడైనను
బానిసనే కదే!"

ఈసప్ కథలు 7:

నండూరి రామమోహనరావు





16

మార్గరెట్ బ్లాకనీ ఫిషర్ మన్ రెస్ట్ చేరేసరికి రాత్రి పదిగంటలు కావచ్చింది. ఆ వేళప్పుడు అనుకోకుండా ఆమె ఊడిపడేసరికి జెల్లీబాండ్ మొదలయిన వాళ్లంతా విస్మయం పొందారు. అప్పుడే నిద్ర కుపక్రమించిన శాలీ కళ్లు నులుముకుంటూ లేచి మార్గరెట్ కు పరిచర్య చేయటానికి బయలుదేరింది.

జెల్లీబాండ్ గబగబ దీపం వెలిగించాడు. సెగడు అంటించాడు. ప్రక్కనే ఒక మంచి కుర్చీ వేశాడు. మార్గరెట్ కూర్చున్నది.

"ఈ రాత్రికి ఇక్కడనే ఉంటారా?" అని అడిగింది శాలీ.

"లేదు. లేదు. రాత్రంతా ఉండను. ఒకగంటో, గంటన్నరో. నాకు ప్రత్యేకంగా గది ఏమీ అక్కర్లేదు. ఈ అల్పాహారశాలలోనే ఉంటానులే."

"అలాగే, అలాగే, మీ యిష్టం." అన్నాడు జెల్లీబాండ్.

"నేను ఛానెల్ దాటిపోవలసి ఉన్నది. గాలి అనుకూలం అయిన మరుక్షణం బయలుదేరాలి. కాని నా కోచివాడు, తక్కిన సేవకులు ఇక్కడనే కొన్నాళ్లు ఉంటారు."

"అవశ్యం. వారికి ఏ లోటూ లేకుండా చూస్తాను. మీకు తినటానికి ఏమయినా..."

"ఏదో ఒకటి తెమ్మను. చూడు. సర్ ఆంద్రూ వస్తారు. రాగానే ఇక్కడికి తీసుకురా."

"అలాగే" అన్నాడు జెల్లీబాండ్ ఆముదం త్రాగినవానిలా ముఖంపెట్టి. సర్ పెర్సీ బ్లాకనీ అంటే జెల్లీకి మహాగౌరవం. ఆ పెర్సీ భార్య అర్ధరాత్రప్పుడు ఇలా సర్ ఆంద్రూతో కలిసి ఛానెల్ దాటిపోతూఉండటం అతనికి బొత్తిగా నచ్చలేదు. అయితే దానితో అతనికేమి సంబంధం? నోరుమూసుకొని, ఆమె ఇచ్చే డబ్బుమాట గుర్తుతెచ్చుకొని బయటికి పోయినాడు. శాలీకూడా ఆమెకు ఆహారము అమర్చి వెళ్లిపోయింది.

మార్గరెట్ మళ్ళీ ఆలోచనలో పడింది. సర్ ఆంద్రూ ఎంతసేపటికి వస్తాడో ఏమో. తనకు దారిలో ఎక్కడా షావలిన్ వాసన తగలలేదు. కాబట్టి తాను డోవర్ చేరకముందే అతడు అక్కడికి చేరిఉండాలి. ఎక్కడ ఏ హోటలులో బసచేశాడో! ఫిషర్ మన్స్ రెస్ట్ కుమాత్రం ఇక జన్మలో రాడు. కాని అతని గూఢచారులు చాలామంది ఉన్నారు. ఎక్కడపడితే అక్కడ ఉన్నారు. కనుక కొంచెం జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఒకవేళ అతడు ఈపాటికే నావ ఎక్కి ఛానెల్ దాటుతున్నాడేమొ! ఈ ఆలోచన వచ్చేసరికి ఆమె ఆపాదమస్తకం కంపించిపోయింది.

జెల్లీబాండ్ సర్ ఆంద్రూకోసమని పోర్టికోలో కాచుకొని కూర్చున్నాడు. అతడు అక్కడ కాచుకొని కూర్చున్నట్లు గుర్తుగా, మార్గరెట్ కు గుఱక విని పిస్తున్నది.

ఆనాటి ప్రొద్దున చక్కగా ఎండ కాసింది. ఎంతో హాయిగా ఉన్నది. కాని సాయంత్రమయ్యేసరికి కొంచెం ఈదురుగాలి ఆరంభమైంది. క్రమంగా అది తుపాను గాలికిందికి దిగింది. అల్పాహారశాల కిటికీ రెక్కలు కొట్టుకుంటున్నాయి. బయట చెట్లు తలలు ఊపి నాట్యం చేస్తున్నాయి. ఈ తుపానుగాలిలో బయలు దేరటానికి వీలుంటుందో, ఉండదో అని మార్గరెట్ భయపడసాగింది. తుపానుగాని, ప్రళయంగాని బయలు దేరిపోవలసిందే అని నిశ్చయించుకున్నది.

సర్ ఆండ్రూ గుఱ్ఱం మేఘాలమీద తేలిపోతూ వచ్చి, హోటలుముందు ఆగింది. జెల్లీ బాండ్ లేచి చిరునవ్వుతో స్వాగతం చెప్పాడు.

"అమ్మయ్య! వచ్చాడు." అని సంతోషించింది మార్గరెట్. అప్పుడు తట్టింది ఆమెకు, తాను ఆ అర్ధరాత్రి సమయంలో మారువేషంలో ఉన్న సర్ ఆండ్రూతో బయలు దేరిపోతున్నందుకు నలుగురూ ఏమనుకుంటారోగదా అని. తనలో తాను నవ్వుకున్నది. గుండెలతరబడిగా పడుతున్న బాధలో ఆమె ఇంతసేపు నవ్వటం ఎలాగో మరిచిపోయింది పాపం!

గుర్తుపట్టటానికి వీలు లేకుండా ఉన్నాడు ఆండ్రూ మారువేషంలో. జెల్లీ యిదంతా చూసి లోపలలోపల చిరాకుపడుతున్నాడు. మాట్లాడకుండా పానీయాలు అమర్చాడు.

"లేడీ బ్లాకెనీ! ఈ రాత్రికి మనం ఇక్కడే ఉండవలసి వచ్చేటట్లుంది." అన్నాడు ఆండ్రూ.

"ఎందుచేత?" అని అడిగింది ఆమె. "ఉండటం, గిండటం ఏమీ కుదరదు. భూమి తల్లక్రిందులయినాసరే ఈ పూట పోయి తీరాలిసిందే."

"అదిక్కాదు. గాలి మనకు చచ్చే ఎదురుగా ఉన్నది ఒక్క అడుగుకూడా పోలేము. గాలితిరిగేదాకా ఆగక తప్పదు."

మార్గరెట్ ముఖం తెల్లగా పాలిపోయింది. "అయ్యో! భగవంతుడా!" అన్నది. పెర్సీ ఫ్రాన్సుకు బయలు దేరిపోయినాడు. దారిలో తుపాను తగిలిఉంటుంది. ఏమైనాడో, ఎట్లా ఉన్నాడో అనుకొని దుఃఖించింది. "ఏమైనాసరే పోదాంపద!" అని ఆండ్రూను హెచ్చరించింది.

ఆండ్రూ తలకాయ అడ్డంగా తిప్పాడు. "ఏమన్నా వీలుంటుందేమో చూద్దామని నేనే స్వయంగా వెళ్ళి చూసివచ్చాను. ఒకరిద్దరు నావలవాళ్లతో కూడా మాట్లాడాను. ఎంతమాత్రం వీలులేదన్నారు. ఇంకో మాట చెప్పనా? ఈ రాత్రి 'ఎవ్వడూకూడా' ప్రయాణం చెయ్యలేదు." అన్నాడు.

మార్గరెట్‌కు అర్థమైంది ఎవ్వడూ అంటే షావలిన్ కూడా నన్నమాట. "సరే జెల్లీ బాండ్! ఈ పూటకు ఉంటాను మరి." అన్నది సంతోషంగా.

"అలాగే, మీ యిద్దరికీ చెరొక గది సిద్ధంగా ఉన్నది. దయచెయ్యండి." అన్నాడు జెల్లీ,

"భలే అలా ఉండాలి ఇదుగో వస్తున్నాము. లేడీ బ్లాకెనీకి ఈ వేళ నీవు చేస్తున్న సదుపాయాలకు, సర్ పెర్సీ నీకు మంచిబహుమతి యిస్తారు చూస్తూఉండు." అంటూ జెల్లీవీపు తట్టాడు ఆండ్రూ. జెల్లీ అప్పటిదాకా చిన్నబుచ్చుకునిఉన్నవాడు కాస్త ముఖం విప్పారాడు. గదులు తాళాలు తీసి పక్కలు వేయించటానికి పోయినాడు.

జెల్లీ వెళ్ళగానే మార్గరెట్ ఆండ్రూవంక తిరిగి, "ఆఁ! చెప్పు చెప్పు ఏమి జరిగిందో?" అని ఆదుర్దాగా అడిగింది.

"జరిగిందేముంది? కాని తుపాను మనకు మంచి మేలు చేసిందనుకోండి. మనము ఎలా ఫ్రాన్సు పోలేక పోతున్నామో, షావలిన్ కూడా అలాగే పోలేడు."

"తుపాను ఆరంభం కాకముందే బయలు దేరి పోయినాడేమో! అప్పుడెట్లా?"

"అలా పోయిఉంటే—తస్సదియ్య — దేవుడు మేలు చేశాడన్నమాటే! ఈ తుపానుగాలికి "నట్టనడి సంద్రాన—నావలో ఉన్నాను." అని పాడుకుంటుంటాడు. లేదా హాయిగా సముద్రం అట్టడుగున సుఖంగా పవ్వళించిఉంటాడు. అయితే అలాంటిదేదో జరిగిఉంటుందని మనం అశ్రద్ధ చెయ్యకూడదు. అక్కడ చాలామంది చెప్పారు ఈ పూట ఇంతవరకు ఒక్కనావ కూడా పోలేదని. పైగా ఎవరో ఒక ఆయన వచ్చి నాకు మళ్లేనే నావ కుదుర్చుకోవటానికి బేరాలాడాడని కూడా తెలిసింది.

"అయితే షావలిన్ ఇంకా డోవరులోనే ఉన్నాడేమో."

"ఉండక చస్తాడా? పోనీ, ఒకపని చెయ్యమంటారా? పని సులువుగా జరిగిపోతుంది." అంటూ చిటిక వేశాడు ఆండ్రూ.

"ఏమిటది?"

"వాడెక్కడ ఉన్నాడో వెళ్ళిచూస్తాను. చూసి —నా బాకుంది చూశారా?..."

"మంచివాడివేలే. అటువంటిపనేమీ చెయ్యకు నీ పుణ్యముంటుంది!"

సర్ ఆండ్రూ మారు చెప్పలేదు. ఆమెను బ్రతిమాలి కొంచెం ఆహారం తినిపించాడు.

పన్నెండుగంటలసేపు ప్రతిక్షణము యుగంగా ఇద్దరూ ఆ హోటలులోనే పడిఉన్నారు. మార్గరెట్ మనస్సుకు శాంతి లభించేటందుకు ఆండ్రూ ఎన్నెన్ని కబుర్లో చెప్పాడు. బ్లాకెనీ ఫ్రాన్సులో ఎలా తమాషా తమాషా వేషాలు వేశాడో, ఏమేమి చేశాడో చెప్పి ఆమెను నవ్వించాడు.

ఈ తుపానుభయం పెర్సీకి లేదు. డేడ్రీమ్ చాలా గట్టి నావ. సముద్రాలలో విహరించటానికిగాను కట్టినది అది. అయినా తుపాను ప్రారంభమయ్యేసరికి పెర్సీ ఫ్రాన్సు చేరిఉంటాడు. అనుకుంటూ మార్గరెట్ కొంతసేపు కళ్లుమూసి విశ్రాంతి తీసుకున్నది.

17

ఎలాగో ఆ రాత్రి వేగించింది మార్గరెట్. మళ్ళీ ఏ ఆటంకమూ రాకముందే త్వరపడి ప్రయాణం కానివ్వాలని తలచింది. ఆమె అల్పాహారశాలలోకి వచ్చి చూచేసరికే, ఆండ్రూ లేచి ప్రయాణమకు వీలుపడుతుందేమో కనుక్కోవటానికి తీరందాకా వెళ్లి విచారించి వచ్చి కూర్చున్నాడు.

అప్పటికికూడా గాలితీవ్రత తగ్గలేదు. డోవరు నుండి ఫ్రాన్సు ప్రయాణంచెయ్యటానికి వీలుకావటం లేదు. ఇంకా పది, పదిహేనుగంటలసేపు ప్రయాణం ఆపుకోవలసిందే అని అక్కడివారు చెప్పారు.

ఈ మాటలకు ఆమె పూర్తిగా క్రుంగిపోయింది. ఎలాగైనా సర్ పెర్సీని చూచితీరాలనే గాఢకాంక్ష లేకపోతే, మార్గరెట్ అక్కడే పడి ప్రాణాలు విడిచేదేమో! సర్ ఆండ్రూకూడా మనసులో కొంచెం ఆందోళన పడుతున్నాడు. ఎంత దాచుకోవాలన్నా, అది దాగటంలేదు. కాళ్లు చేతులు కట్టిపడవేసినట్లు, ఇలా పడిఉండటం ఇద్దరికీ కష్టంగానే ఉన్నది.

షావలిన్ గూఢచారులెవరైనా చూస్తారేమో అని మార్గరెట్ ఉన్నంతసేపు గదిలో కూర్చొని గడియ వేసుకున్నది. బయలుదేరే ఘడియ అంటూ ఒకటి ఎప్పటికైనా వస్తుందా రాదా అనుకుంటూ ఆలోచిస్తూ, ఊహిస్తూ, అప్పుడప్పుడు కాస్త ధైర్యం తెచ్చుకుంటూ చాలాకాలం కూర్చున్నమీదట, సర్ ఆండ్రూ ఆమెదగ్గరకు వచ్చి సంతోషవార్త చెప్పాడు. "ప్రయాణానికి అంతా అనుకూలమైంది." అని.

నావ ఎక్కినతరువాత ఆమె మనస్సు మళ్లా తేరుకున్నది. చల్లటిగాలికి ప్రాణం లేచివచ్చింది. సూర్యాస్తమయ సమయానికి నావ డోవరునుండి చాలాదూరం పోయింది.

క్రమంగా ఫ్రాన్సు తీరం సమీపించింది. దూరాన ఒకటి రెండు దీపాలు కనిపించసాగినాయి.

మరొక అరగంటలో మార్గరెట్ బ్లాకెనీ తన మాతృదేశంలో అడుగుపెట్టింది. ఎక్కడ మానవులు తోటిమానవులను నిర్దాక్షిణ్యంగా, మూకఉమ్మడిగా వధిస్తున్నారో, ఆ దేశం ఇదేకదా! అనుకుంటూ మార్గరెట్ ఒకసారి భయంతో, అసహ్యంతో, కనుపించినంతవరకు దేశాన్ని చూసింది.

ప్రజలందరూ ఎర్రటోపీలు పెట్టుకొని తిరుగుతున్నారు. కాకపోతే ఒకడిటోపీకి మరొకడిటోపీకి తేడా ఎందులోనంటే అది మాసిపోవటంలో కనిపిస్తున్నది. బాగా మురికిగా ఉన్నది - కొన్నాళ్ళక్రిందట కాస్త శుభ్రంగా ఉండి ఉండవచ్చునని చెప్పటానికి వీలయినవి —తక్కినవాటినిబట్టి శుభ్రంగానే ఉన్నాయిలే అని సంతృప్తిపడతగినవి - ప్రతిటోపీకి ఎడమప్రక్క త్రివర్ణపతకం ఉన్నది. ఇదివరకు నవ్వుతూ, తుళ్లుతూ, ఉల్లాసంగా ఉండే ప్రతివాడు ఇప్పుడు ప్రక్కవాడిని ఒకకంట్ల కనిపెట్టిఉంటూ, మూతిబిగింపులతో ఉండటం చూచి మార్గరెట్ జలదరించిపోయింది.

సర్ ఆండ్రూ, మార్గరెట్ వీధులవెంట నడుస్తుంటే, ప్రజలు వారిని అసహ్యంతో చూస్తూ, "తలకు మాసిన ధనవంతులున్నా తలకు మాసిన ఇంగ్లీషు వాళ్లు" అని నిరసిస్తూ, గొణుగుతూ పోవటం మొదలు పెట్టారు.

ఆ రోజులలో ఇంగ్లాండుకు ఫ్రాన్సుకు మధ్య దొంగవ్యాపారం జరుగుతూనేఉన్నది. అందుచేత ఇంగ్లీషువర్తకులు అడపాతడపా కనిపిస్తూనేఉంటారు. ఫ్రెంచి ప్రజలకు ఇంగ్లీష్ ప్రభుత్వమన్నా, చక్రవర్తి

అన్నా తెగనికోపం, అసహ్యం. ఈ వ్యాపారులను ప్రోత్సహిస్తే ఆ ప్రభుత్వపు ఆదాయం కొంత లోటు అవుతుందిగా! ఇది వారి ఆలోచన.

మార్గరెట్ ను వీధులవెంట, సందులవెంట త్రిప్పి త్రిప్పి తీసుకుపోతున్నాడు ఆంద్రూ. చాలా భాగం సందులన్నీ మురుగువాసన కొడుతున్నాయి. చీలమండల లోతున బురదనీళ్లు. అక్కడక్కడ ఏ యింట్లోనుంచో ఖడే గుడ్డిదీపం వెలుతురు తప్ప వీధులన్నీ

చీకటిమయంగా ఉన్నాయి.

కలే పట్టణమంతా దాటి, అవతల ప్రక్కన ఉన్న కేప్ గ్రిస్‌నెజ్ దాపుకు పోయినారు. ఇద్దరూ పోయి ఒక యింటిముందు ఆగారు. "ఇదే గ్రిజ్ కోటలు. ఇక్కడే ఉంటారు ఆయన." అని చూపించాడు ఆండ్రూ. చీకటిలో ఆ ఇల్లు ఎలా ఉన్నదో మార్గరెట్‌కు తెలియలేదు.

ఆండ్రూ తలుపుతట్టాడు. లోపలినుండి రకరకాల చీదరింపులు, విసుగుదలలు, శాపనార్థాలు వినిపించినాయి. ఆండ్రూ ఇందాటికంటె ఎక్కువగా తలుపుతట్టాడు. లోపల చీదరింపులజోరు ఎక్కువైంది. కాళ్ళీడ్చుకుంటూ ఎవరో వచ్చి తలుపు తీశారు.

గాలి వెలుతురూ లేని, ముక్కులు పగిలే మురుగు కంపుకొడుతున్న ఒకానొక గుహ మార్గరెట్‌కు ప్రత్యక్షమైంది. జన్మలో ఎప్పుడూ అటువంటిది ఆమె చూడలేదు.

గోడలకు అంటించిన కాగితాలు సగం సగం ఊడి వ్రేలాడుతున్నాయి. ఇది కుర్చీ ఇది బెంచీ అని చెప్పకోతగ్గది ఒకటీ ఆ గదిలో లేదు. ఒక కుర్చీకి ఆనుకొనేది లేదు. కొన్నింటికి కూర్చునే పీఠంలేదు. ఒక మూల టేబులుకు ఒక కాలు విరిగిపోయినందున అది పడిపోకుండా, ఒక కట్టెపుల్ల పోటీపెట్టాడు.

ఆ గదిలో ఒకమూల నెగడు మండుతున్నది. దానిసెగనే వయిన ఒక బాన వ్రేలాడుతున్నది. ఇంకొక

యూల దొడ్డికాళ్లలాగా వంకరలు పోయిన కొయ్య మెట్లు ఉన్నాయి. ఆ మెట్లు ఎక్కి పైకి పోతే అక్కడ బూడిదరంగు దర్వాజాగుడ్డ కనిపిస్తున్నది. ఒకగోడ మీద మాసిపోయి వెలవెలలాడుతున్న అక్షరాలు వ్రాసిఉన్నాయి - స్వాతంత్ర్యము - సమానత్వము - సౌభ్రాతృత్వము." అని. వంకర తిరిగిఉన్న ఒక ఓకు దూలంనుండి ఒక నూనెదీపం వ్రేలాడుతూ, గదిలో గుడ్డివెల్తురు ఇస్తున్నది.

సర్ ఆంద్రూ మామూలుగా లోపలికి పోయినాడు. కాని మార్గరెట్ అంత ధైర్యం చెయ్యలేక పోయింది.

"ఇంగ్లీషువాళ్ళము మేము." అని ఫ్రెంచిలో చెపుతూ లోపలికి వచ్చాడు ఆంద్రూ. హోటలుగది కంపు చాలదన్నట్లు, పొగాకుకంపు కొట్టుకొంటూ వచ్చిన ఆ హోటలుయజమాని ఇద్దరిని ఎగాదిగా చూసి, "వట్టి తలకుమాసిన ఇంగ్లీషువాళ్లు!" అని నసిగాడు. తన కున్న స్వాతంత్ర్యము సరిగా వినియోగించుకోక పోతే కాలక్రమేణా మురిగిపోవచ్చునుగా! అందుకని ఓపికగా, తన అసహ్యం తెలిపేటందుకు తపుక్కన ఉమ్మేశాడు కూడా.

"హరి పరమాత్ముడా!" అంటూ మార్గరెట్ ముక్కుకు రుమాలు అడ్డుపెట్టుకొన్నది. "ఇదేదో బిలంలాగా ఉన్నది. ఇక్కడే నంటావా? పొరపాటు పడలేదుకదా?" అన్నది.

"లేదు లేదు. ఇదే" అంటూ ఆంద్రూ అక్కడ ఉన్న ఒక కుర్చీ దుమ్ముదులిపాడు. తప్పనిసరిగా లోపలికి వచ్చి మార్గరెట్ కూలబడింది.

హోటల్ గ్రిక్ యజమాని బ్రోగార్డ్ వచ్చిన వారి సంగతి విచారించకుండా లోపలికి పోయినాడు. తాను స్వతంత్ర పౌరుడు. వారిముందు వినయ విధేయతలు చూపించవలసిన అవసరంకాని, వారిలో సాదరంగా మాట్లాడి ఏమి కావాలో కనుక్కోవటంగాని తన పరువుకు తగినది కాదన్నట్లు అతడు భావించాడు.

బ్రోగార్డ్ భార్య ఒక ప్రక్కన పొయ్యిదగ్గర కూర్చొని కుండలో ఉన్న దేదో కలియబెడుతున్నది. ఆంద్రూ బిగ్గరగా కేక పెట్టాడు. "ఏమయ్యోయ్! మాకు ఆకలి వేస్తున్నది. అదుగో! ఆమెగారు ఫస్టు క్లాసయిన సూప్ తయారు చేస్తున్నట్లున్నది. కాస్త తెచ్చి పెట్టుదూ!"

బ్రోగార్డ్ కు ఈమాటలు వినిపించినతరువాత, తాపీగా లేచి నసుగుకుంటూ, విసుగుకుంటూ ఇంత తెచ్చి వారి మొహాన పడేశాడు.

ఆ గ్లాసులు, ఆ పళ్లెములు, ఆ ఏర్పాట్లు చూస్తుంటే మార్గరెట్ ప్రాణాలు పైవి పైన పోతున్నాయి. తన అవసరంకొబట్టి అక్కడ పడిఉన్నది కాని, లేకపోతే ప్రాణభీతితో పారిపోయేదే.

మార్గరెట్ పడుతున్న భయాందోళనలు గమనిస్తున్న సర్ ఆంద్రూ ధైర్యం చెప్పాడు. "వారి తరహాయే అంత. మీరు గాభరాపడకండి. ఇదంతా ఎలా ఉన్నా ఆహారపదార్థాలుమాత్రం బాగా రుచిగా నే ఉంటాయి."

"ఎలా ఉన్నాసరే. మనము ఇక్కడికి అందుకోసం రాలేదు కదా?" అన్నది మార్గరెట్.

సర్ ఆంద్రూ ముందు జాగ్రత్తపడి ప్రతిగ్లాసు, ప్లేటు వాడబోయేముందు స్వయంగా తుడిచాడు. మార్గరెట్ భోజనానికి ఉపక్రమించింది. సేవకునిపాత్ర నటిస్తున్న ఆంద్రూ, ఆమె వెనుకగా నిలబడ్డాడు.


సూపు, రొట్టె అన్నీ ఏదో ఒక మోస్తరుగా బాగానే ఉన్నాయి. మొదటినుండీ హోటలుమీద యజమానిమీద సదభిప్రాయం లేక పోబట్టి కాస్త ఇబ్బంది పడిందిగాని.

"ఆంద్రూ! నీవూ నాలాగానే కష్టపడ్డావు పాపం. ఎందుకలా నిలబడటం? నీవుకూడా కాస్త ఎంగిలిపడు; సరిపోతుంది. వాడేమన్నా అనుకుంటాడనా? ఏడిచాడులే. రా! రా! కూర్చో."

ఏమన్నా అనుకోవటానికి బ్రోగార్డ్ అక్కడ ఉంటేనా? కావలసినవేవో అమర్చి, అమాంతం లోపల దూరాడు.

కొంతసేపటికి బ్రోగార్డ్ మళ్ళీవచ్చి ఖాళీప్లేట్లు సర్దటం మొదలుపెట్టాడు. చేతిలోఉన్న పైపయినా అవతల పెట్టలేదు. పొగ మరీ మార్గరెట్ ముఖాన వదలసాగాడు. అదిచూసి ఆంద్రూ నిలువు ఎత్తున మండిపడ్డాడు. ఇంగ్లీషులో "పట్టుకు చావబాదితేసరి మడ్డి మృగం!" అని తిట్టాడు.

మార్గరెట్ భయపడింది. ఇంగ్లీషులోనే సమాధానం చెప్పింది. "కొంచెం ఊరుకో బాబూ! నీకు పుణ్యముంటుంది. ఇది ఫ్రాన్సు-ప్రజల యుగం!"



"బాజా"

ఫొటో : ఉప్పలూరి వెంకటశ్రీనివాసరావు—విజయవాడ.

ఆంద్రూ ఈమాటలు పట్టించుకోలేదు. "పోడినా? నిలువునా చీల్చిపారెయ్యమంటే...!"

మార్గరెట్ ఆంద్రూను బ్రతిమాలి చెప్పింది. "మనము అనేకవిశేషాలు తెలుసుకోవలసిఉన్నది వీడిద్వారా. మంచిచేసుకోకపోతే ఎలా?"

ఆంద్రూ శాంతం తెచ్చుకున్నాడు. ఫ్రెంచిలో మొదలుపెట్టాడు. "ఏమయ్యా! మావాళ్లు ఎవరైనా ఇక్కడికి వస్తుంటారా ఏమిటి? అదే - మావాళ్ళంటే -ఇంగ్లీషువాళ్లు."

బ్రోగార్డ్ సమాధానం చెప్పేముందు ఒకసారి చుట్టూ చూశాడు. రెండుసార్లు పొగపీల్చి వదిలిపెట్టాడు. మూడుసార్లు విసుగుతో ముక్కాడు. గొంతు సవరించుకొని "ఏదో అప్పుడప్పుడు." అన్నాడు.


ఆంద్రూ ఆసక్తిగాని, అమితశ్రద్ధగాని చూపించకుండా ఏదో ఉబుసుపోకకు అడుగుతున్నట్లు అడిగాడు.

"అవునులే. చెప్పొద్దూ! మా ఇంగ్లీషువాళ్లు మాంచి సారా అంటే పడిచస్తారు. అందుకే ఊళ్లో ఇన్ని హోటళ్లున్నా ఇక్కడికి వస్తారు. సరేగాని. మా అమ్మగారి స్నేహితుడొక ఆయన - ఇంగ్లీషువాడే లే -అప్పుడప్పుడు వ్యాపారపు పనులమీద కలే వస్తూ పోతూనే ఉంటాడు- పొడుగుగా ఉంటాడు. నిన్ననో మొన్ననో పారిస్ పోవాలని బయలుదేరాడుట. మా అమ్మగారితో నేమో- కలేలో ఉంటాను, ఈపూట రమ్మని చెప్పాడుట"

మార్గరెట్ ఏమి సమాధానం వస్తుందో అని తహతహలాడిపోతున్నది. తల ఎత్తితే తన ముఖకవళికలను బట్టి బ్రోగార్డ్ ఆ విషయం పోల్చుకుంటాడేమోనని, వంచుకు కూర్చున్నది. బ్రోగార్డు యథాప్రకారం కొంతవ్యవధి తీసుకొని అన్నాడు.

"పొడుగాటి ఆయనా? అవును - ఇవ్వాళ..."

"ఓహో! ఇవ్వాళనా? చూశానంటావు అయితే..." అన్నాడు ఆంద్రూ మహా నిర్లక్ష్యంగా.



కోడె త్రాచులు ఫొటో : ఐ. ఇ. కోటేశ్వరరావు—నిడమానూరు.

"అదేగా చెప్తున్నది. ఇవ్వాళే చూశాను. కనిపించాడు." అంటూ బ్రోగార్డ్డు ఈ ప్రక్కనుండి ఆ ప్రక్కకు తిరిగివచ్చి, ప్రక్కకుర్చీలో ఉన్న ఆండ్రూ టోపీ తీసి, తన నెత్తిన పెట్టుకున్నాడు. సర్ పెర్సీ వేసుకున్న ఖరీదయినదుస్తులను వర్ణించాడు.

ఇంత ఆందోళనలోను మార్గరెట్ అది చూసి నవ్వింది. మారువేషమైనా వేసుకోకుండా తిరుగుతున్నందుకు ఆమెకు పెర్సీపైన కోపంవచ్చింది. "ఆండ్రూ! తొందరగా కనుక్కో ఎక్కడికి వెళ్లారో!" అన్నది.

"ఓహో! అలాగా! అవును లే! ఆయన ఎప్పుడూ అలాంటిదుస్తులే వేసుకుంటారు లే! నీవు చెప్పిన ఆయనే మా అమ్మగారికి కావలసింది. ఊఁ! అయితే ఆయన మరి వెళ్ళిపోయినాడంటావు. అంతేనా?" అని అడిగాడు ఆండ్రూ బ్రోగార్డ్ ను.

బ్రోగార్డ్ పరధ్యానంగా "ఊఁ!" అన్నాడు. "ఆఁ! వెళ్ళిపోయినాడు... అసలు వెళ్ళిపోలేదు. బయటికి ఎక్కడికో పోయినాడు లే. మళ్ళీ వస్తాడు. రాత్రి భోజనానికి వస్తాను. తయారుగా ఉండమని చెప్పి వెళ్లాడు."

మార్గరెట్ వెంటనే ఆనందంతో నోరువిప్పి కేక వెయ్యబోయింది. సర్ పెర్సీ ఇప్పుడు వస్తాడు. కలుసుకోవచ్చు. ప్రమాదంగుర్తించిన ఆండ్రూ ఆమె నోటికి చెయ్యి అడ్డుపెట్టాడు. ఆమె కన్నులవెంట ఆనందాశ్రువులు రాలినాయి.

"ఓహో! చెప్పివెళ్లాడా? అయితే వస్తాడు లే!" అన్నాడు సర్ ఆండ్రూ.

"వస్తాడు! ఎందుకు రాడు? తలకుమాసిన ఇంగ్లీషువాళ్లు!" అని బ్రోగార్డ్ అక్కడే తుప్పుక్కున ఉమ్మివేశాడు.

మార్గరెట్ కుతూహలం ఆపుకోలేక "ఆయన ఇప్పుడు ఎక్కడ ఉంటారో చెప్పగలవా?" అని అడిగింది.

"గుఱ్ఱపుబండికోసం పోయినాడు."

"ఎంతసేపయింది వెళ్ళి?"

బ్రోగార్డ్ ఇంతవరకు తలతిక్కలేకుండా సమాధానాలు చెప్పటమే గొప్పవిశేషం. తనవంటి స్వతంత్రపౌరునికి ఈ "తలకుమాసిన" ఇంగ్లీషువారిముందు వారడిగిన ప్రతిదానికి సమాధానం చెప్తూఉండటం ఏమి మర్యాద? "నాకు తెలిసిందేదో చెప్పాను. ఆయన ఇవ్వాళ వచ్చాడు రాత్రి భోజనానికి వస్తానన్నాడు. వస్తాడు. సరేనా?" అంటూ ఉరిమి, తనకున్న హక్కులన్నీ సద్వినియోగం చేసుకొని మాట్లాడకుండా లోపలి గదిలోనికి పోయినాడు. తలుపులు భడాలున వేసుకున్నాడు.

(ఇంకావుంది)

నూర్గురు కొడుకుల తండ్రి

పూర్వం ఒకానొక దేశంలో ఒకనికి నూరుగురు కొడుకులు ఉండేవారు. అతడు ధనవంతుడైనప్పటికీ ఇంతమందికీ తిండి, బట్టలు, ఆటవస్తువులు, చిరుతిళ్లు ఏర్పాటు చేయడం చాలా కష్టంగానే ఉండేది.

అయితే వారు పెరిగి పెద్దవారైనకొద్దీ తండ్రి కష్టం ఇంకా ఎక్కువకావడం మొదలుపెట్టింది. ఒక్కొక్కడూ పెద్దవాడు కావడంతోటే తండ్రి దగ్గిరికివచ్చి "నాన్నా! నేను పెద్దవాడి నయ్యాను. మరి నాకు పెళ్లెప్పుడు చేస్తావు?" అని అడిగేవాడు. వారిని సమాధానపరచి పంపడం తండ్రికి అసాధ్యంగా ఉండేది. ఒక్కొక్కడికే పెళ్లి చేసుకుంటూపోతే, ఖర్చు విపరీతమైపోయి ఆఖరు వాళ్లకి అసలు పెళ్లి చేయనేలేని స్థితి వస్తుంది. అందుకని అందరికీ ఒకేసారి చెయ్యాలని అతడు నిశ్చయించాడు. కాని నూర్గురు కోడళ్లను ఒక్కసారిగా ఎక్కడ సంపాదించుకు రాగలడు?

ఇలా విచారించి, 'ఏమైతే అదయింది. పురుషప్రయత్నం మానకూడదు' అనుకుని తండ్రి 'ఒకనాడు గుర్రంఎక్కి కోడళ్లను అన్వేషించడానికి బయలు దేరాడు.

అలా పోగా పోగా ఒక పట్టణం బయట పొలంలో పని చేస్తూన్న వృద్ధుడొకడు కనిపించాడు. అతడు కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూ ఉండడంచూసి "ఏమయ్యా? ఎందుకలా కుండపోతగా ఏడ్చేస్తున్నావు? ఏం కష్టం సంభవించింది?" అని ఇతడు అడిగాడు.

"అవునయ్యా! ఏడుపు కాక మరేమిటి? నా పరిస్థితిలో నువ్వుంటే తెలిసేది? నాకు నూరుగురు కూతుళ్లు ఉన్నారు. వీరందరికీ పెళ్లి చెయ్యడం ఎలాగా అని నా బాధ," అని చెప్పాడు వృద్ధుడు.

ఇది వినగానే నూరుగురు కొడుకుల తండ్రి గుర్రంమీంచి ఒక్క దూకు దూకి వృద్ధుణ్ణి వాటేసుకుని కావలించేసుకున్నాడు. "నేటికి నా జన్మ తరించింది. ఆహా! ఏమి నా అదృష్టం. వెదకబోయిన తీగ కాలికి తగిలింది. నాకు నూరుగురు కొడుకులున్నారు. నీకు నూరుగురు కూతుళ్లున్నారు. వాళ్లూ వీరు దంపతులు కావాలని దేవుడే సృష్టించి ఉంటాడు. ఇంకేం. ముహూర్తాలు పెట్టిద్దాం," అన్నాడు.

అప్పటికప్పుడే సిద్ధాంతుల వద్దకు వెళ్లి ముహూర్తం పెట్టించారు. ఒక శుభదినాన సలక్షణంగా, మహా వైభవంగా వివాహాలు జరిగిపోయాయి. పెద్దపెద్ద విందులు, వేడుకలు జరిగాయి. అప్పగింతలు వగైరా తంతు అంతా సవ్యంగా అయిపోయింది.

మగపెళ్లివారు తిరిగి యింటిదారి పట్టారు. కొడుకులనూ, కోడళ్లనూ వెంటబెట్టుకుని తండ్రి బయల్దేరాడు. మధ్యదారిలో ఒక నది ఉన్నది. ఆ నదికి వెడల్పాటి వంతెన ఉన్నది. ఆ వంతెనను పెళ్లివారు దాటుతూ ఉండగా ఒకమాయ జరిగింది. వంతెన ఉన్నట్లుండి కుంచించుకుపోసాగింది. అలాగ కుంచించుకుని పోతుంటే, మనుషులు ఒకళ్ళనొకళ్లు తోసుకుంటూ, తన్నుకుంటూ పడిపోతున్నారు. తండ్రి భయంతో వణికిపోతున్నాడు. ఈ ఉపద్రవం ఏమిటా అని.

ఇంతలో వంతెన వెనకగట్టున ఒకపెద్ద కేక వినబడింది. అందరూ వెనక్కి తిరిగిచూశారు. అక్కడొక మనిషి నిలబడి ఉన్నాడు. అతడిలా అన్నాడు:

"ఈ వంతెన నాది. నా అనుజ్ఞ లేకుండా మీరు దీన్ని దాటుతున్నందుకు మీకీ శిక్ష విధించాను," అన్నాడు.

పెళ్ళికొడుకుల తండ్రి అతడికి నమస్కరించి "మీరు ఎవరో గొప్ప మాంత్రికులవలె ఉన్నారు. మా తప్పు క్షమించి మమ్మల్ని క్షేమంగా పోనివ్వండి. మీకు ఋణపడి ఉంటాము," అని ప్రార్థించాడు.

"అలాగే పోనిస్తాను. కాని ఒక షరతున్నది. మీరు పెళ్లికూతుళ్ళ ఇంటిలో ఏదో మరిచిపోయి వచ్చారు. ఆ మరిచిపోయింది ఏదైనా సరే, మారు మాట్లాడకుండా నాకిచ్చివేస్తే మిమ్మల్ని వదిలిపెడతాను," అన్నాడు మాంత్రికుడు.

పెళ్లికొడుకుల తండ్రి వెంటనే పెళ్ళి జరిగిన యింటికి వెళ్లాడు. అక్కడ అతని కొడుకులలో ఒకడు కనిపించాడు. "నువ్విక్కడ ఎందు

కున్నా" వని తండ్రి అడిగాడు.

"నేను రాత్రి పెళ్ళిసందడివల్ల బడలికతో నిద్రపోయాను. మీరంతా బయలుదేరి వెళ్లేవేళకు నాకు మెలకువ రాలేదు. మీరు కూడా నన్ను మరిచిపోయి వెళ్ళిపోయారు." అని కొడుకు సమాధానం చెప్పాడు.

తాము ఏదో మరిచిపోయినట్లు మాంత్రికుడు చెప్పినది తన కొడుకునుగూర్చేనని తండ్రికి అర్థమైంది. ఆ కొడుకును మాంత్రికుడికి ఇచ్చివేయవలసి ఉంటుందనికూడా అతనికి అర్థమైంది. ఇచ్చివేయక పోతే ఇంకా ఆ వంతెనమీదనే చిక్కుపడిఉన్న మిగతా వారందరూ అక్కడే ఇరుక్కుపోవలసివస్తుంది. 'ఎలాగురా దేవుడా' అని దుఃఖిస్తూ తండ్రి కొడుకును వెంటబెట్టుకుని వంతెనవద్దకు వచ్చాడు. మాంత్రికుడు అతని దుఃఖంచూసి కొద్దిగా జాలికలిగి ఇలా అన్నాడు: మూడేళ్లవరకూ నీ కొడుకు నా వద్దనే ఉండి అన్నివిద్యలూ నేర్చుకుంటాడు. మూడేళ్లతరవాత నువ్వు మళ్లీ ఇక్కడకురా. నీకుమారుణ్ణి నువ్వుగుర్తుపట్టగలిగితే అతన్ని నీకిచ్చివేస్తాను. లేకపోతే అతడు నా వద్దనే ఉంటాడు."

ఈ షరతుకు తండ్రి ఒప్పుకున్నాడు. పెళ్లివారందరూ నిరుత్సాహంగా ఇంటిదారి పట్టారు.

ఎలాగో మూడేళ్లు గడిచింది. గడువుదినం వచ్చింది. తండ్రి అనుకున్న ప్రకారం వంతెనవద్దకు వెళ్లాడు. అక్కడొక కుటీరంలో మాంత్రికుడు కనిపించాడు. "అయ్యా, నా కుమారుణ్ణి నాకు చూపించండి" అని తండ్రి వేడుకున్నాడు.

మాంత్రికుడు సరేనని ఒక పిచ్చుకను, గువ్వను, చిలుకను చూపించాడు. "వీటిలో ఎవరు నీ కుమారుడో చెప్పకోగలిగితే, నీకు అతన్ని ఇచ్చివేస్తాను," అన్నాడు.

తండ్రి చాలాసేపు తదేకదీక్షగా ఆ మూడు పక్షులవంకా చూశాడు. ఎంతసేపు చూసినా ఏది తన కుమారుడైనదీ తెలియలేదు. నిరాశ చేసుకుని వచ్చిన దారే పట్టాడు. కొంతదూరం పోయాక చటుక్కున జ్ఞాపకం వచ్చింది, పిచ్చుక తనవంక దీనంగా చూసిన సంగతి. వెంటనే మాంత్రికునివద్దకు పరుగెత్తుకువెళ్లి "మళ్ళీ ప్రయత్నిస్తాను. పక్షుల్ని చూపించ"మన్నాడు.

మాంత్రికుడు పక్షుల రూపాలు మార్చివేసి ఒక కోడిని, పావురాన్ని, పాలపిట్టను చూపించాడు. తండ్రి ఎంతసేపు చూసినా తన కుమారుణ్ణి పోల్చుకోలేకపోయాడు. ఏడుస్తూ ఇంటిదారిపట్టాడు.

కాని కొంతదూరం పోయేసరికి మళ్ళీ ఆశ రేకెత్తింది. "ఈసారి ఏమైతే అదయింది. ఏదో ఒక దాన్ని కోరుకుంటాను. నా కుమారుడే అయితే మంచిది. లేకపోతే నా కర్మ అనుకుంటాను," అని తలచి మళ్ళీ మాంత్రికునివద్దకు వెళ్లాడు. ఈసారి కూడా ప్రయత్నించనిమ్మని ఎంతో వేడుకోగా వేడుకోగా మాంత్రికుడు సరేనని ఒక పిచ్చుకను, గువ్వను, వడ్రంగి పిట్టను చూపించాడు.

తండ్రి వాటిని పరిశీలనగా చూశాడు. చూడగా చూడగా గువ్వ కంటిలో ఒక అశ్రుబిందువు నిలిచినట్టు కనబడింది. "తప్పకుండా అదే నా కుమారుడై ఉండాలి. మానవులకు తప్ప కన్నీరు రాదు. ఆ గువ్వ కంటిలో కన్నీరు ఉన్నదంటే దానికి మానవహృదయం ఉన్నదన్నమాటేగదా!" అని తర్కించుకున్నాడు. "ఆ గువ్వయే నా కుమారుడు" అని మాంత్రికునితో అంటూనే గువ్వను పట్టుకున్నాడు. వెంటనే గువ్వకు మానవరూపం వచ్చింది. తండ్రీ కొడుకులు ఆనందం పట్టలేక కౌగలించుకున్నారు. తల ఎత్తి చూసేసరికి మాంత్రికుడు కుటీరంతో సహా మాయమైపోయాడు. ఈ విచిత్రమంతా తలచుకుని ఆశ్చర్యపడుతూ వారు ఇల్లు చేరుకున్నారు. ఇంటిల్లిపాదీ వారిని చూసి ఎంతో సంతోషించారు.

నూరుగురు కొడుకులకూ పెళ్లి చేసినప్పుడు చేసిన విందుకంటే ఉత్సాహంగా, వైభవంగా, కొడుకును తిరిగి తెచ్చుకోగలిగినందుకు ఆ తండ్రి బ్రహ్మాండమైన విందు చేశాడు. ★

★ లోకులంటే ఎవరూ? ★

(34-వ పేజీ తరువాయి)

ఎంచుకున్న నాలాంటిది ఏం చెయ్యగలదమ్మా! ఆ జన్మాంతమూ నా రాత ఇది కదా అనుకుంటూ చచ్చినట్లు పడివుండాల్సినదేగా!

క్రమంగా నాదగ్గర డబ్బు అయిపోగానే నా వంటిమీద వస్తువు లొకొక్కటే మాయమవడం మొదలెట్టేయి. ఆయన కవర్లకీ పౌడు సామాన్లకీ, విలాసాలకీ డబ్బివ్వడం నాకు కష్టమనిపించేది. అంతే కాక వంటిమీద వస్తువులన్నీ అయిపోతే ఏం చెయ్యడమా అన్న ప్రశ్న పట్టుకుంది. ఆయనతో ఇలాగ అంటే "నీ పెద్ద గొలుసు అమ్మితే ఏదైనా వ్యాపారం పెట్టవచ్చు. దానిమీద వచ్చేడబ్బుతో మనం దర్జాగా బ్రతకవచ్చున"న్నారు. ముందు నేను పెద్ద గొలుసివ్వడానికి ఒప్పుకోకపోయినా తర్వాత ఇవ్వక తప్పలేదు.

పోనీ ఇవన్నీ నా చేజేతులా చేసుకున్నవి కనుక అనుభవించక తప్పదనే అనుకుందాం. దేముడు నాకు మాతృత్వంకూడా దక్కకుండా చేయాలా? నా పాపానికి ఫలితం అనేటట్లు చచ్చినబిడ్డే పుట్టాలా? దేవుడు కూడా నేను తెలియకజేసిన తప్పుని క్షమించుకోలేకపోయాడు!!.........ఏముందమ్మా నా కష్టాలకి అంతులేదు......ఆఁ. అన్నట్లు రెండవుతోంది. మీ మామ్మ కేకేస్తారేమో... వెళ్లమ్మా" అంది సరోజ.

"సరీ, మీ ఆయన వ్యాపారం తుదివరకూ నడపలేదా?" అని నే నడిగితే "ఆఁ నా మొహం. ఆయనకి వ్యాపారం చెయ్యడానికైనా వళ్ళు వంగాలా! నా వస్తువులన్నీ మాయం చేసేసేరు. ఎంత జాగ్రత్తగా వాడితే మాత్రం? సంపాదన లేకుండా ఖర్చు చేస్తే ఎన్నాళ్ళుంటుంది? నా ఒంటిమీద నువ్వుగింజంత బంగారమైనా లేకుండా ఇలాగ బ్రోడులాగ చేసేసేరు. తిండికికూడా వెతుక్కోవలసి వస్తోంది. ఈ కొంప ఎలాగ వెడుతుందో ఏమీ తెలియడం లేదమ్మా! ఐకేళ్ళనుంచీ మఱచిపోయిన అమ్మకి సగం చచ్చి పరిస్థితంతా చెప్తూ ఓ రెండువందలు పంపించమని వ్రాసేను. కానీ ఇంతవరకూ ఏజవాబూ లేదు...... ఎందుకొస్తుంది? నేను వాళ్ళ కూతుర్ననుకోవడమే వాళ్ళకి పెద్ద తలవంపాయె... వెళ్ళమ్మా... వెళ్ళు ...ఇలాంటి కథలు వింటే ఏమీ పుణ్యం రాదు. అక్కర్లేని మనోవ్యధ...వెళ్ళు" అని నన్ను పంపించేసింది. పాపం! ఆవిడింకా ఏడుస్తూనే వుంటుంది. కళ్ళు ఎలాగయ్యేయనుకున్నావూ?" అంటూ మా ఉమ తన కామెంటరీ మొదలెట్టింది.

"సిగ్గులేదూ. ఏ మొహంతో మళ్ళీ అమ్మకి ఉత్తరం వ్రాసింది? తను ఇంత చక్కని కీర్తి తెచ్చిపెట్టింది చాలక" అని నే నంటే మా చెల్లి పాపం చిన్నబుచ్చుకుంది. "పాపం! అదేమిటే? అప్పటికే సగం చచ్చి వ్రాసేనంటోందిగా! ఏంచేస్తుంది? దరిద్రం ఎలాంటి పనైనా చేయిస్తుందట. ఏం? సరోజకిమాత్రం అభిమానం అవీ వుండవనా నీ అభిప్రాయం? పరిస్థితుల ప్రాబల్యంలో అలాగ దారితప్పింది గానీ... పాపం!" అని అప్పుడు మా చెల్లి అంటూంటే నాకెంత కోపంవచ్చిందో చెప్పలేను. ఖర్మ! ఇది ఆ లేచివచ్చిన దాన్ని సమర్థిస్తుందేవిటే? అయినా దీన్ని అట్టే వాళ్ళింటికి వెళ్ళనివ్వడం మంచిది కాదేమో ననిపించింది నా కాక్షణంలో! కాని మా చెల్లి మాటలన్నీ పరమ సత్యాలేమోనని ఇవాళని పిస్తోంది. ఒకసారిలాగే సరోజ కష్టాలన్నీ విని వెంటనే సరోజని తిట్టడం మొదలెట్టగానే మా చెల్లి "అబ్బా!! నీదెంత రాతిగుండె!" అనిఅంటే నాకెంతో కోపంవచ్చి మా చెల్లెలిని ఛడామడా తిట్టేసేను. కాని... నిజమే నేమో! మా చెలికున్న విశాలహృదయం నాకు లేదేమో! "పరిస్థితులన్నీ కూడగట్టుకొని ఆవిడని పెడదారి త్రొక్కించేయి. ఇంకా కసిగట్టి ఆవిడని పీడిస్తూనే ఉన్నాయి" అన్న ఆలోచన మనస్సులో మెదిలింది.

కాని, ఆ నిర్మల చెప్తేమాత్రం? పిప్పీ ఘారం చదువుతున్న సరోజ కామాత్రం తెలియకుండా వుంటుందా! మా చెల్లికూడా పిపుఘారమే కదా! దీని కిన్ని తెలుసూ! ఎవరిచేతన్నా ఒక్కమాట పడిందా? ఆఁ ఎలాగైనా చెడిపోయేవాళ్ళ బుద్ధులే వేరు' అనుకున్నాను.

* * *

అంతలోకే మా మామ్మవచ్చి "ఏమిట్రా! శుక్రవారంపూట దీపాలైనా వెలిగించకుండా కూర్చున్నారు.? త్వరగా లాంతర్లు వెలిగించి ఒకటిక్కడా మరొకటి వంటింట్లోనూ పెట్టివచ్చి మరీ చేసుకోండి ఏం అల్లికలు చేసుకుంటారో......" అని కేకలు వెయ్యడంతో నా ఆలోచన లాగిపోయాయి. స్వెట్టరు క్రింద పడేసి మా చెల్లిలిని పిలిచేను. ఎక్కడా అది పలికేట్లులేదు. ఎక్కడుందోనని వెళ్ళిచూస్తే సరోజ ఇంటివైపునున్న మల్లె పందిరిదగ్గర పారాడుతూ కనబడింది. దీన్నేంచేసినా పాపంలేదనిపించింది నాకాక్షణం! "ఉమా! ఇటురా" అని పిలిచి నానామాటలూ అంటే "అక్కా, మిటే" నేను దానింటివైపు వెళ్ళాలని మల్లె మొగ్గలు కొయ్యడంలేదే! అరయింది కదా అని కోస్తున్నాను" అంది బిక్కమొహం వేసుకొని. దానిమాటలు నిజమే నేమోనని నాకనిపించినా "ఇక చాలులే ఆ మొగ్గలు ఇక అటు వెళ్ళ'కని చెప్పి లాంతర్లు ముందేసుకుని కూర్చున్నాను.

* * *

"ఈ విడ్డూర్యం చూసేరాండీ!" అనుకుంటూ సీతమ్మగారు వాళ్ళ మనమణ్ణి ఎత్తుకొని, గిన్నెలో అన్నం కలుపుకొని మా ఇంటికొచ్చింది. మా మామ్మ "ఏమిటండీ!" అంటే "మరేంలేదూ ... వాడు నాలుగు గంటలబండిలో మా వాడికి కనిపించేడట" అంది బుగ్గని వేలేసుకుని. "ఎవరూ" అన్నాను నేను ఖంగారుగా. "ఆ యింట్లా యిన" అంటూ సరోజా వాళ్ళింటివైపు చూపించింది. "అయ్యో!" అని నేనూ మా మామ్మా ఓకేసారన్నాము. మా ఉమ ఇంచు

మించు ఆవిడ దగ్గరికేవచ్చేసి "ఎక్కడికి కెడు తున్నాడో?" అంది. "ఏమోనమ్మా నాకవేమీ తెలియవు. మా అబ్బాయి ఆఫీసులో ఒకతనికి ఏదో వూరు బదలీ ఐతే అతన్ని స్టేషనులో దిగబెట్టడానికి వెళ్ళేరు మా వాడునూ, మరికొందరునూ. అక్కడ ఇతన్ని రైలుబండిలో కూర్చుని ఉండగా చూసేనని మావాడన్నాడు. ఎక్కడికి కెడుతున్నాడో అవన్నీ కనుక్కోవడమేనా ఏమిటీ మావాడి పని?" అంది ఆవిడ కొంచెం విసురుగా. పాపం! మా ఉమ ఎంతో చిన్నబుచ్చుకుంది.

"ఐతే! సీతమ్మగారూ! దీన్ని ... వదిలి పెట్టేసి వెళ్ళిపోయాడంటారా?" అంది మామ్మ.

"ఏమోనమ్మా... ఆఁ. అయినా దీనికా పెంకితనం ఎందుకు చెప్పండీ? అతనెలా గంటే అలాగే చెయ్యరాదూ! తెగేవరకూ లాగితే ఏమౌతుందేమిటి?...ఆఁ అయినా తేచివచ్చినదానికి మొగుడంటే భయభక్తి ఉంటాయా ఏమిటి? మాకాలంలో ఎన్నడైనా మొగుడిమాటికి ఎదురు చెప్పి ఎరుగుదుమా?" అనేసరికి మా మామ్మ "ఆఁ. ఎవరి ఖర్మ కెవరు కర్తలూ? పనసపండులాంటి బిడ్డని ఎప్పుడైతే అమ్మేసిందో అప్పుడే అనుకున్నాను నేను. ఏదో అరిష్టం వచ్చితీరుతుందని!! అసలు వాళ్ళకి ల్లివ్వడమే తప్పు చేసేను." అంది. నా ఆశ్చర్యానికి అంతులేకపోయింది. ఏమిటీ! ఈ మామ్మే నా ఇన్నాళ్ళూ అమ్మాయీ అమ్మాయీ అంటూ సరోజకి పచ్చళ్ళూ ఊరగాయలూ ఇస్తూ... అనుకున్నాను.

"నేను మొట్టమొదటే చెప్పేను కదండీ. వాళ్ళు సంసారులమధ్య ఉండదగినవాళ్ళు కారని. ఐనా దీనికి వీడే మొదటి వాడని ఏమిటి దాఖలా? రోజూ అతనితో చెప్పలాడేది కదా! ఇవాళ వీడయ్యాడూ రేపు మరొకడొస్తాడు...... కనుక నామాట విని వెంటనే దాన్ని ఇల్లు ఖాళీచేసి పొమ్మనండి...... ఇలాంటివాళ్ళు సంసారి కొంపల్లో ఉంటే తెలిసీ తెలియని మన పిల్లలు కూడా చెడిపోగలరు" అంటూ మా ఉమకేసి చూసింది అదోలాగ నవ్వుతూ. మా ఉమ బెదురు చూపుల్తో నా వేపు చూడగానే నా గుండెకూడా "ఈవిడెప్పుడు చూసిందిరా బాబూ" అన్న భయంతో పీచు పీచు మంది.

మా మామ్మ "అలాగేనండీ! రేపే ఖాళీచేసి వెళ్ళిపొమ్మంటాను. అసలు మధ్యాన్నమే పొమ్మందామనుకున్నాను. కానీ మూడు నెలల అద్దె ఇవ్వాల్సివుందని కొంచెం తటపటాయించేను. పోనీలెండి. వెధవఅద్దె. రేపు ఏమైనాసరే పొమ్మంటాను" అంది.

సీతమ్మగారు వెళ్ళిపోగానే నాగుండె దడ తగ్గింది. అమ్మయ్య! అవును కాని సరోజనిగురించి ఎలాగ మాట్లాడిందో ఆవిడ! ఛ! పాపం!! అయినా వాడికెంత విశ్వాసం లేదో? తనకోసం తల్లినీ, తండ్రినీ, చెల్లెలినీ, నగలనీ, డబ్బునీ అన్నింటినీ వదులుకుందా? ఆఖరికి కన్నబిడ్డనికూడా అమ్మేసిందా?... ఆడదాని బ్రతుకు పువ్వులాంటిదని సరోజ అన్నమాట నిజమే పాపం!

ఆ రాత్రి ఇంక సరోజ విషయం ఎవ్వరం ఎత్తకుండా నిశ్శబ్దంగానే ఎవరిపనులు వాళ్ళు చేసుకొనిపోయాము. సరోజ గురించి ఆలోచిస్తూ నిద్రపోయిన నాకు ఓ రాత్రివేళ మెలుకువ వచ్చింది. వెన్నెల పుచ్చ పువ్వులాగ వుంది. మల్లె పందిరిలో విచ్చిన పువ్వులు పెరటినంతా మంచి వాసనతో నింపేసేయి. మంచినీళ్ళుత్రాగి పక్కమీద పడుకోబోతున్న నాకు సరోజావాళ్ళింటి వైపునుండి గట్టిగా వెక్కి వెక్కి ఏడుస్తున్న సరోజగొంతు వినిపించింది. నేను గతుక్కుమన్నాను. రాత్రి ఎనిమిది గంటలప్పుడు సరోజ ఇంటివైపు చూసినప్పుడు వాళ్ళింట్లో దీపం వెలిగించిలేదు. ఇప్పుడు కూడా అటువైపు చీకటి జీబూతం లాగేవుంది. పాపం జరోజ అన్నం తిందో లేదో? అటు భర్తా ఇటు కన్నబిడ్డాకూడా కాకుండా పోయారా నిర్భాగ్యురాలికి. రేపొద్దున్న మామ్మ ఆవిడని ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపొమ్మనడం ఖాయం! ఇప్పుడావిడ గతేమిటి? మా ఉమవైపు చూసేను. అది నిశ్చింతంగా అమాయకంగా నిద్రపోతోంది. సరోజ ఏడుపు ఇంకా స్పష్టంగా దగ్గరగా వినిపిస్తోంది. నాకేమీ తోచలేదు. అప్రయత్నంగా సరోజ ఇంటివైపు ఓ నాలుగు అడుగులు వేసేను. కానీ ఏమిటో నా గుండెలు దడదడలాడేయి. అంతలోకే మామ్మ అటునించి ఇటు కదలడంలో మంచం చప్పుడవడంవల్ల ఏదో తప్పుపని చేస్తున్నదానిలాగ గబగబా వెనక్కి వచ్చేసి నా మంచమ్మీద పడుకున్నాను. ఎలాగ నిద్రపట్టిందో ఎప్పుడుపట్టిందో నాకే తెలియదు.

పాలవాడి కేకతో మెలుకువ వచ్చింది. "సాకిరేవుకాడ ఎవరో ఆడోరు సచ్చి తేలేరంటండీ" అంటున్న పాలవాడి మాటలతో నేను ఉలిక్కిపడి లేచేను. గబగబా సరోజ ఇంటివైపు పరిగెట్టేను. తలుపులు బార్లా తీసి వున్నాయి. గోదావరిగట్టుఎక్కి దూరంగా మూగిన గుంపునిచూస్తూ అలాగ నిలబడిపోయాను.

"ఎవరైనా పెద్దమనుష్యులచేత చెప్పించి ఆయనని ఏదైనా ఒక ఉద్యోగంలో చేరేట్లు చూస్తే" అని మా ఉమ ఒకసారన్నప్పుడు "పెద్దమనుష్యులకి మా విషయం కావాలామ్మా! ఒకసారి కాలు జారిందంటే ఇక అథః పాతాళానికి దిగిపోవడమే తల్లీ! పెద్దమనుష్యులు కాదుగదా ఆఖరికి తల్లీ తండ్రీ కూడా చేయూత నివ్వడం మాట దేవుడెరుగు, సానుభూతికూడా చూపించరు" అన్న సరోజ మాటలు జ్ఞాపకమొచ్చేయి.

"బంగారంలాంటి పిల్లేమ్మా! ఏడి కడుపు నెట్టుకున్నాడేమ్మా! కరొక్కటకపు వెధవ!" అని ప్రక్కావిడతో మాట్లాడుతూ గోదావరి నుంచి స్నానంచేసి మడినీళ్ళు తెచ్చుకుంటున్న సీతమ్మగారు కనపడింది. తల్లితండ్రులూ, భర్తా వదలిపెట్టేసిన సరోజకి లోకులైనా కొంచెంత సానుభూతి చూపించి వుంటే ఆవిడ ఈ పాతకానికి ఒడిగట్టేది కాదేమో ననిపించింది. అంతలో బుజమ్మీద ఎవరో చెయ్యివేసినట్లయింది. వెనక్కి తిరిగేసరికి కన్నీటితో నిండివున్న మా ఉమ కళ్ళు "లోకులంటే ఎవరూ?" అని అధిక్షేపిస్తున్నట్లు కనబడగానే నా హృదయం గతుక్కుమంది. ★



నషనల్ ఆర్ట్ వారి "జయసింహ"లో జయసింహుడుగా ఎన్. టి. రామారావు.

గరికపర్తి సుబ్రహ్మణ్యం

చిత్రనిర్మాణంలో చాలా ముఖ్యమైన భాగం ఎడిటింగు. చిత్రం చక్కగా రాణించడానికి చిత్రంలో ముఖ్యంగా ఎడిటింగు చక్కగా వుండాలి. పూర్వపు రోజుల్లో షూటింగు అనంతరం దర్శకుడే ఎడిటింగు చేసుకోవలసి వుండేది. మన దేశంలో చిత్రపరిశ్రమ చాలా అభివృద్ధి చెందుటవలన యీపరిశ్రమలో అన్ని శాఖలు ఒక్కొకటిగా ముందడుగు వేస్తున్నవి. ముఖ్యంగా ఎడిటింగుశాఖ చిత్రనిర్మాణంలో చాలా అభివృద్ధి చెందింది.

ప్రస్తుతం ఎడిటింగు ఒక ప్రత్యేక శాఖగా అభివృద్ధి చెందినది. ఈ శాఖ ప్రతి స్టూడియోలోను నెలకొల్పబడినది. ప్రతీ చిత్రానికి ఒక ఎడిటరు, ఒక అసిస్టెంటు ఎడిటరు వుంటారు. ఎడిటరుకు సహాయపడు పరికరములు (1) మూవియోలా ప్రివ్యూ మెషీను. (2) కటింగు టేబిల్ (3) రివైండర్ (4) ఫిల్మ్ స్ట్రాంకు (5) సింక్రొనైజర్ (6) ఏంప్లిఫైయార్ (7) నెగటివ్ స్ప్లయిసర్ (8) పాజిటివ్ స్ప్లయిసర్ (9) పాకింగ్ డబ్బాలు (10) మాగ్నిఫయింగ్ గ్లాస్ (11) కత్తెర మొదలైనవి.

వీటి వుపయోగాలు:—

(1) మూవియోలా ప్రివ్యూ మెషీన్:— ఈ మిషను ఎడిటరునకు చాలా వుపయోగపడుతుంది. దీనితో మార్పుచేయవలసిన పిక్చర్ పాజిటివ్‌ను చూడవచ్చును. దీనితో శబ్దాన్ని కూడా వినవచ్చును. సింక్రొనైజు చేసిన తరువాత ఆర్టిస్టుల పెదవుల కదలిక సరిగావున్నదీ లేనిదీ, సౌండ్ సింక్ మొదలైన విషయాలు యీ మిషనుద్వారా ఎడిటరుకు తెలుస్తాయి.

(2) కటింగ్ టేబిల్:— ఎడిటరు యీ టేబిలుమీదనే నెగటివ్‌ను, పాజిటివ్‌ను, (పిక్చరును, సౌండును) సింకనామీటరు సహాయముతో సింక్రొనైజ్ చేయుటకు కత్తిరించడం జరుగుతుంది.

(3) రివైండర్:— సింక్రొనైజు చేసిన ఫిల్ములను నెగటివ్‌ను, డబల్ పాజిటివులను, ఎన్. జి. ముక్కలను యీ రివైండర్ సహాయముతో ఒక్కొక్క కాన్ నకు సరిపోవునట్లుగా ఫిలిమును ఒక్కొక్క రోల్‌గా చుట్టుతారు.

(4) ఫిలిమ్ స్ట్రాంకు:— ఈ స్ట్రాంకు కటింగ్ టేబులునకు అమర్చబడివుంటుంది. సింక్రొనైజు చేయునపుడు ఫిలిమ్ కొలుచునపుడు యీస్ట్రాంకు సహాయముతో స్పూలులలో రివైండు చేస్తారు.

(5) సింక్రొనైజర్:— ఈ మిషను సహాయముతో నటీనటుల పెదవుల కదలిక సరిగా ఉండేటట్లు పిక్చర్ నెగటివ్‌ను సౌండ్ నెగటివ్‌ను $19\frac{1}{2}$ ఫ్రేముల వ్యత్యాసముతో కలుపుతారు. దీనిని సింక్రొనైజు చేయడం అంటారు. ఇట్లు చేయుటవలన మామూలుసినిమా ప్రొజెక్టరులో పిక్చర్ నడుస్తున్నపుడు $19\frac{1}{2}$ ఫ్రేముల తరువాత ప్రొజెక్టరులో అమర్చబడిన ఏంప్లిఫైయారు సహాయముతో శబ్దము వినిపిస్తుంది.

(6) ఏంప్లిఫైయారు:— దీని సహాయముతో శబ్దము వినిపిస్తుంది.



“జయసింహ”లో కాళిందిగా అంజలీదేవి.



"(శ్రీ) 420"లో రాజ్‌కపూర్.

★ చిత్రనిర్మాణంలో ఎడిటింగ్ శాఖ ★

(7, 8) నెగటివ్ అండ్ పాజిటివ్ స్ప్లయిసర్లు:— దీని సహాయముతో పంచింగ్ మిషన్ ద్వారా నెగిటివును పాజిటివును కత్తిరించెదరు.

(9) పాకింగ్ డబ్బాలు:— ఎడిటింగులో కత్తిరించిన చిన్న చిన్న ముక్కలను పాజిటివ్‌లను, నెగిటివ్‌లను గాలికి చెదిరిపోకుండా వుండుటకు ఒక గుడ్డచే అమర్చబడినటువంటి డబ్బాలో వేస్తారు.

(10) మాగ్నిఫైయింగ్ గ్లాస్:— ఈ గ్లాసు సహాయముతో నెగిటివులను, పాజిటివులను చూస్తే బొమ్మలు పెద్దవిగా కనబడతాయి.

(11) కత్తెర:— ఎడిటింగులో పాజిటివులను నెగిటివులను కత్తిరించుటకు ఉపయోగపడును.

ఈ విధంగా ఎడిటింగు శాఖను ప్రత్యేకంగా నేర్చుకొని దానిని అభివృద్ధి చేసిన వారలేకులుండుటచే, దర్శకులకు చాల అనుకూలంగా ఉంది. ఒక చిత్రం తక్కువ కాలంలో తీయవలయునంటే అనుభవజ్ఞులైన ఎడిటరును నియమించిన, ఒకవైపు షూటింగు జరుగుతూవుండగా, వేరొకవైపు ఎడిటింగ్ కూడా జరిపించవచ్చును.

షూటింగు తరవాత ప్రొడక్షను మేనేజరు తన నిర్మాత సలహా ప్రకారం ఏరోజు కారోజు ఫిలిమంతా లేబరేటరీకి తీసుకొని వెళ్ళి అచ్చట లేబరేటరీ ఇన్‌ఛార్జికి, నెగటివ్‌ను డెవలప్ చేయుటకు ఇస్తాడు. అచ్చట నెగిటివ్ డెవలప్ అయిన తరువాత, దర్శకుడు లైటింగును పరిశీలిస్తాడు. తరువాత ఆ నెగిటివ్ సహాయంతో లేబరేటరీలో మరల పాజిటివ్ కాపీని తయారు చేస్తారు. ఈ పాజిటివ్ తయారయిన పిదప ప్రొడక్షను మేనేజరు ఆయా నెగటివ్, పాజిటివ్‌లను ఎడిటింగ్ శాఖకు తీసుకునివచ్చి వారి ఎడిటర్లకు ఇస్తాడు.

షూటింగులో తీసిన షాట్లను అన్నిటినీ ఒక క్రమపద్ధతిలో కథకు అనుగుణంగా, సహాయదర్శకుని సలహాలను తీసుకొని ఎడిటరు డైలాగులు, పాటలు మొదలైనవి సింక్రొనైజ్ చేస్తాడు. క్లాప్ శబ్దాలు కూడా దీనిలో ఉంటాయి. ఇలాంటి ఫిలుమును రష్‌ప్రింట్ అంటారు. ఈవిధంగా తయారు చేసి ఇస్తాడు ఎడిటరు. సాధారణంగా ఈ పనిఅంతయు అసిస్టెంటు ఎడిటరు కూడా చేయగల్గుతాడు.

ఆ తరువాత చిత్రంలో ఏ విధంగా టేకింగు ఉన్నది, నటీనటులు ఏవిధంగా నటించినది, మరల తీయవలసినవి, రీటేకులు కత్తిరించవలసినవి పరీక్షించుటకు ప్రతిదినం షూటింగు అయిన అనంతరం దర్శకుడు, సహాయదర్శకుడు, కెమేరామన్, సౌండు ఇంజనీరు, నిర్మాతలు, అంతా కలసి స్టూడియోలోని థియేటర్‌లో ప్రొజక్టరు సహాయంతో చూసి చక్కగానుండు షాట్లను ఓ. కె. చేస్తారు. దర్శకుడు తన సహాయదర్శకునకు అప్పుడే తన అభిప్రాయాలను అనగా కత్తిరించవలసిన షాట్లను, తీయవలసిన రీటేకులను, డబ్ సౌండులను వివరాలతో తెలియపరుస్తాడు.

ఓ. కే. షాట్లను సహాయదర్శకుడు ఒక పుస్తకంలో రాసుకొని వెంటనే ఎడిటరుకు చెప్పడం జరుగుతుంది.

ఒక్కొక్కప్పుడు షూటింగు హడావిడిలో వ్యవధిలేక పిలులేనప్పుడు కనీసం రెండురోజులకుగాని, మూడురోజులకుగాని రష్‌ప్రింట్ వేసి చూసుకుంటారు. కెమేరామన్ తన లైటింగు, ఎఫెక్టులు సరిగా వున్నదీ లేనిదీ, సౌండుఇంజనీరు శబ్దాన్ని, దర్శకుడు నటీనటుల నటన, టేకింగు, పాటలు; మాటలు జాగ్రత్తగా పరిశీలిస్తారు.

ఈ విధంగా ముగ్గురు పరిశీలించిన తరువాత అన్ని విధాల బాగున్న షాటులను నిర్ణయించుకొని దర్శకుడు తన సహాయ దర్శకునకు ఓ. కే. షాట్లను చెప్పగా అతడు ఆయా షాట్ల బాగున్న నెంబర్లను వ్రాసుకొని ఎడిటరునకు వరుసక్రమంలో అతికించుటకు చెపుతాడు.

ఎడిటరు కూడా జాగ్రత్తగా ఆలోచించి అనవసరమైన షాట్లను, సన్నివేశాలను కత్తిరించడం జరుగుతుంది. సీనిక్ ఆర్డర్ ప్రకారము కథాక్రమంలో చిన్న చిన్న ముక్కలను

అతికించి పూర్తిఅయిన ఒక ఫిలింరూపాన్ని తయారుచేస్తారు.

ప్రస్తుతం తెలుగుచిత్ర నిర్మాణంలో ఎడిటర్లు బహుకొద్దిమందిమాత్రమే. చాలమంది ఆంధ్రులు; కన్నడులు; బెంగాలీలు ఉండుట వలన వారికి తెలుగు సరిగా తెలియదు. ఆ డైలాగులన్నీ ఇంగ్లీషుకాని, వారివారిభాషలలోకాని అనువాదంచేసి చెప్పడం జరుగుతుంది. ఈవిధంగా చెప్పినప్పటికీ మన తెనుగు భాషలోనుండు రసం ఇంగ్లీషుభాషలోనికి సరిగారాదు. తెలుగుఎడిటర్లు బహుతక్కువఉన్నారు. ఉన్న కొద్దిమందినైనా మన నిర్మాతలు ప్రోత్సహించాలి. ఎడిటింగు విద్య నభ్యసించుటకు మన తెలుగువారికి అప్రంటిసు అవకాశాలు లభించేటట్లుచేసి పైకితీసుకురావాలని కోరుతున్నాను.

పెకేశే చిత్ర పరిశ్రమలలోలాగే మొదట్లోనే సెనేరియో వ్రాసేటప్పుడే ఫొటోగ్రాఫరు, డైరెక్టరు, కవి, సౌండుఇంజనీరు చక్కగా కథనంతయు తర్జన భర్జనచేసి, తీయబోవు సన్నివేశాలను తప్ప మిగిలిన వానిని స్క్రిప్టులోనే ఎడిట్ చేసినచో నిర్మాతలకు ఫిలిము కలిసివస్తుంది. ఫిలిం ఎక్కువ వ్యయమువదు.


ఈ రోజుల్లో చిత్రనిర్మాతలు ఒక్కొక్క చిత్రానికి 70 వేలు లేక 80 వేల అడుగుల ఫిలుము ఉపయోగిస్తున్నారు. ప్రదర్శించే ఒకచిత్రం 17 వేల అడుగులకు మించి వుండటేదు. అంటే 53 లేక 63 వేల అడుగుల ఫిలిం వృధాగా పోతున్నదన్నమాట. దీనికి కారణం మొదట్లో షూటింగుకు వెళ్లకముందు స్క్రిప్టును ఎడిట్ చేయకపోవటమే.

ఎడిటరు అనుభవజ్ఞుడైతే ఒక్కొక్క సమయంలో డైరెక్టరు, కెమేరామెన్, నటీనటుల లోపాలను చిత్రంలో కనిపించకుండాచేయవచ్చు. నటీనటుల నటన ఎక్కడెక్కడ బాగుగాలేదో, ఎక్కడెక్కడ శబ్దగ్రహణం సరిపోలేదో, ఛాయాగ్రహణం ఎక్కడ అందంగాలేదో ఆయా సన్నివేశాల్ని బట్టి కత్తిరించి సంస్కరించి అతికించే శక్తి ఎడిటర్‌కు ఉండాలి.

ఏ రోజు కారోజు తయారయిన ఫిలిమును ఎడిట్ చేయుటవలన దర్శకుడు ఎప్పటికప్పుడు సరి చూచుటకు అవకాశముంటుంది. అంతేకాక, షూటింగుతో పాటు ఎడిటింగుకూడా పూర్తి అయిపోతుంది. తరువాత మొత్తం పోజిటివ్ రష్ ప్రింట్‌ను దర్శకునకు చూపించి ఫైనలైజ్ చేసి, రీరికార్డింగు మొదలు పెడతారు. అందుచేత విడుదలకు ఆలస్యమువదు.

కొన్నికొన్ని పరిస్థితులలో ఎడిటరుకు స్వనిర్ణయాల దర్శకుని సలహో ననుసరించి, ఆయా దృశ్యాల్ని పూర్తిగా తీసివేయవచ్చు.

ఉ:— ఒక మిడ్ షాటులో నటియొక్క మాటలు బాగున్నప్పటికీ ముఖం



హిందీ నటి అనితా గుహ.

చిత్రంలో అసహ్యంగా కనిపించినపుడు ఆమె మాటలను నటునియొక్క ముఖం మీదకు తీసుకొనివచ్చి నటుని ముఖాన్ని చూపిస్తూ ఆమె మాటలనుమాత్రమే వినిపించవచ్చును. దీనివలన సన్నివేశానికి దెబ్బ తగలకుండా, వికారమైన ముఖాన్ని చూపకుండానే ఎడిటరుయొక్క నేర్పువలన చిత్రంలో డైలాగులను వినిపింపవచ్చు.

ఎడిటరు స్వతస్సిద్ధంగాసమర్థుడైతే, చిత్రం రానునపుడు ప్రేక్షకులకు విసుగు జనించకుండా వుండుటకు చక్కని టెంపోలో సన్నివేశాలను ఎడిట్ చేస్తాడు. ఎడిటింగ్ ద్వారానే, చూపరులకు ఒక ఉత్సాహాన్ని, ఆతురతను కలిగిస్తాడు.

దర్శకుడు, ఎడిటరు ఇద్దరూ మంచి అనుభవజ్ఞులైతే చిత్రం చక్కగా రాణిస్తుంది. సాధారణంగా ఫైనల్ ఎడిటింగులో నెగటివ్‌ను కత్తిరించునపుడు ఎడిటరుతో పాటు దర్శకుడుకూడా వుంటాడు. ఈ విధంగా వుండుటవలన, దర్శకుడు తాను ఏ భాగంలో ఏ షాట్ తీసినది ఎప్పటికప్పుడు ఎడిటరుకు చెప్పుటకు వీలుంటుంది.

కథను తెరపై రసవత్తరంగాను, ఆకర్షణీయంగాను చూపుటకు చిన్న చిన్న షాట్లుగా విభజించి ఒక ట్రీట్‌మెంటును తయారుచేసి చిత్రంలో మనం మామూలుగా చూసే దినాల్ని వేస్తారు. ఫేడిన్, ఫేడ్ వుట్, వైప్, మాస్క్, డిసాల్వ్అవుట్, డిసాల్వ్‌యిన్, సూపర్‌ఇంపోజ్ మొదలైనవి ప్రత్యేకంగా వీటికై ఏర్పడిన లేబరేటరీలలో తయారవుతాయి.



మినర్వా మువిటోన్ వారి "కుందన్"లో సొహ్రాబ్ మోడీ, నిమ్మీ.

★ చిత్రనిర్మాణంలో ఎడిటింగ్ శాఖ ★

వాటి ఉపయోగాలు:—

(1) ఫేడిన్ :— ఇది చిత్రంలో ఏదైనా సన్నివేశం ప్రారంభమవుతున్నట్లు దృశ్యాన్ని మెల్లగా చూపిస్తుంది.

(2) ఫేడవుట్:— దృశ్యం క్రమంగా, మెల్లిదిగా మాయమయిపోతుంది.

(3) వైప్:— ఇది డిసాల్వ్ కంటె త్వరగా మార్పును చూపుతుంది. ఒక సీను నుండి వేరొకసీనుకు త్వరిత గతిని మార్చవలయునన్న, వెంటనే ఒకమూలనుండి ఒక గీతమాదిరిగావచ్చి సీను మారునట్లుచేస్తుంది.

(4) మాస్క్:— ఒకపాత్ర నిద్రించునపుడు అంతరాత్మ బయటకువచ్చి పిలుస్తున్నట్లు మాట్లాడుతున్నట్లు చూపడానికి పనికివస్తుంది.

(5) డిసాల్వ్ అవుట్ :— దీనిలో ఒకసీను వేరొకసీనుకు వెంటనే మారిపోతుంది. మొదటిసీనును ఆపివేయడమే దీని ప్రయోజనం.

(6) డిసాల్వ్ యిన్:— ఇది చూపించడంవల్ల రెండు వేరువేరు దృశ్యాలను ప్రేక్షకులకు అర్థసహితంగా చూపించుటకు వీలు కలుగుతుంది.

(7) టైమ్‌లాప్స్: — దీనితో కాలము యొక్క గమనాన్ని, పాత్రలలో మార్పులను చూపించవచ్చు.

ఎడిటరు చిత్రంలో ఎప్పుడెప్పుట డిసాల్వ్‌లు పెట్టవలసినది కథావసరాన్ని బట్టి చూపుతాడు.

ఇందువలనే ప్రఖ్యాత సోవియట్ దర్శకుడు కే. కే. పుడోవ్కిన్ సినీమాకళలో తారలు ప్రధానంకాదని దర్శకుడు టెక్నీషియన్లే ముఖ్యులని అంటాడు. ఆయన సిద్ధాంతాలు మొదటిసారిగా విన్నవారికి కొంత విచిత్రంగా ఉంటాయి. కాని వారి సిద్ధాంతాలను ఆచరణలో పెట్టినపుడు అంటే తెరమీద చూపించినపుడు వాటిలో వుండే శక్తి స్పష్టంగా తెలుస్తుంది. ★

సినిమా వార్తలు

నేషనల్ ఆర్ట్ థియేటర్ వారి రెండవ చిత్రానికి "జయసింహ" అని పేరు పెట్టారు. ఇది జానపద చిత్రం. ఇప్పటికే 14 రీళ్లు పైగా పూర్తయింది. త్వరలో షూటింగ్ ముగిసిపోతుందని తెలుస్తోంది. ఎన్. టి. రామారావు, రేలంగి, అంజలి, వహీదా, ఋష్యేంద్రమణి, సీత, గుమ్మడి, రాజనాల, కాంతారావు, వంగర మున్నగువారు నటిస్తున్నారు. దర్శకుడు యోగానంద్. రచయిత సముద్రాల జూనియర్. సంగీత దర్శకుడు రాజా. కెమెరా రహమాన్. కళా దర్శకుడు తోట. నృత్య దర్శకుడు వెంపటి సత్యం. ఈ చిత్రంలో కత్తి యుద్ధాలు, గొడ్డళ్ల యుద్ధాలు మొత్తం అయిదు దాకా ఉంటాయనీ, జనాకర్షణకు కావలసిన మంచి మంచి హంగులన్నీ ఉంటాయనీ తెలుస్తోంది.

* * *

"విప్రనారాయణ" కథను దక్షిణ కళాత్మక చిత్రంగా నిర్మించిన భరణీవారు ఈసారి చింతామణి చిత్రం నిర్మిస్తున్నారు. భానుమతి చింతామణి పాత్ర ధరిస్తుంది. రామకృష్ణగారు దర్శకత్వం వహిస్తారు. షూటింగ్ త్వరలో మొదలుపెడతారని తెలుస్తోంది.

* * *

భాస్కర్ ప్రొడక్షన్స్ వారి "[illegible]" ఈ నెల 6 వ తేదీన విడుదల కావచ్చునని వినికిడి.

* * *

విఠల్ ప్రొడక్షన్స్ వారి "కన్యాదానం" కూడా విడుదలకు సిద్ధంగా ఉన్నది. ఈ నెలలోనే విడుదల కాగలదట.

* * *

అంజలీ పిక్చర్స్ వారి "అనార్కలి" తమిళంలోకి అనువదిస్తున్నారు.



హిందీ నటుడు శేఖర్.

శ్రీ రాజరాజేశ్వరీవారు తెలుగులో తులాభారం, తమిళంలో సతీబహులా నిర్మిస్తున్నారు. ఈ రెండూ కాక సావిత్రి చిత్రాన్ని కూడా నాగభూషణంగారు డైరెక్టు చేస్తున్నారు.

* * *

సారథీవారి చిత్రం "రోజులు మారాయి" జూలై 22 న శతదినోత్సవాలు జరుపుకోబోతున్నది. మద్రాసులో శ్రీకృష్ణా టాకీస్‌లో ఈ చిత్రం తాలూకు అర్థశతదినోత్సవం జూన్ 29 న తేదీన జరిగింది.

ఇండో-సోవియట్ చిత్రం

ఇండో-సోవియట్ సంయుక్త నిర్మాణంగా ఒక చిత్రం హిందీ, రష్యన్ భాషలలో తీయబడనున్నది. దీన్ని కె. ఎ. అబ్బాస్ డైరెక్ట్ చేస్తాడు. వాస్కోడగామా భారతదేశానికి రావడానికి 80 ఏళ్ల ముందే భూమార్గాన, సముద్రమార్గాన ప్రయాణం చేసివచ్చిన రష్యన్ యాత్రికుడు అఫనసి నికితిన్ జీవితకథ ఆధారంగా ఈ చిత్రం తయారవుతుంది. ఇందులో బొంబాయితార నర్గీస్ ప్రసిద్ధ రష్యన్ నటుడు నికొలాయ్ చెర్కాసోవ్ నటిస్తారట. హిందీలో పరదేశీ అనీ, రష్యన్‌లో అఫనసి నికితిన్ అనీ పేరు పెడతారట.

* * *

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్మించిన బెంగాలీ చిత్రం "పథేర్ పాంచాలి" న్యూయార్క్, 'మ్యూజియమ్ ఆఫ్ మోడరన్ ఆర్ట్'లో ఇటీవల ప్రదర్శించబడినప్పుడు అమెరికన్ విమర్శకులు అనేకులు ఈ చిత్రం అద్భుతంగా ఉన్నదని ప్రశంసించారు. ఈ చిత్రం దర్శకుడు సత్యజిత్ రాయ్. దీన్ని అమెరికాలో వివిధ కేంద్రాల్లో విడుదల చేయడానికి, యూరప్‌లో కూడా వివిధ భాషల సబ్‌టైటిల్స్‌తో విడుదల చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. "పథేర్ పాంచాలి" చిత్రానికి అదే పేరుగల నవల ఆధారం. కీ. శే. విభూతిభూషణ్ బందోపాధ్యాయ వ్రాసిన ఆ నవల బెంగాలీ సారస్వతంలోనే కాక, ప్రపంచ సారస్వతంలో కూడా ఉత్తమస్థానం ఆక్రమించగల నవల అని విమర్శకులు అభిప్రాయపడ్డారు.

ఈ చిత్రం భారతదేశంలో ఇంకా విడుదల కాలేదు.


* * *

"టైగర్ ఎండ్ ది ఫ్లేమ్" అనే ఇంగ్లీషు పేరుతో సొహ్రాబ్ మోడీ తీసిన ఝాన్సీకి రాణీ చిత్రం జూలై 8 న అమెరికాలో విడుదల అవుతున్నది. మోడీ నటన, దర్శకత్వం, మెహతాబ్ నటన, యుద్ధదృశ్యాలు, దుస్తులు, ఎర్నెస్ట్ హాలర్ చూపిన టెక్నికలర్ ఫొటోగ్రఫీ నైపుణ్యం ఇవన్నీ చూసి అమెరికన్ విమర్శకులు, పత్రికలవారూ చాలా మెచ్చుకున్నారు. ★




విశాల్ ప్రొడక్షన్స్‌వారి "కన్యాదానం"లో నర్తకి వహీదా రహమాన్.

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty St., Madras-1. Editor ; S. Sambhu Prasad.



కాలేజీలోని
సింహద్వారం.
ఫోటోలు: బి. మధు
సూదనరావు,
—రాజమండ్రి.




దీని సీలుమూత
అన్య జోక్యనిరోధక
మైనది
CALIFORNIAN
POPPY
HAIR OIL
ఇప్పుడు ఆకర్షణీయమైన
కొత్త సీసాలో
కేలిఫోర్నియన్ పాప్పీ తల నూనె